


ఆంధ్ర మహిళ

సంపుటి 13 :: జూన్ '57 :: సంచిక 6

వ్యవస్థాపకురాలు

శ్రీమతి దుర్గాబాయ్ దేశముఖ్

సంపాదకురాలు

శ్రీమతి కె. లక్ష్మీరఘురామ్

ముద్రణ :

ఆంధ్ర మహిళా ప్రెస్

విషయసూచిక

ఆంధ్రమహిళ

సంపుటి 13 :: జూన్ '57 :: సంచిక 6

ఆ శతాబ్దము - ఈ శతాబ్దము

ఈ సంవత్సరముతో దేశ స్వాతంత్రోద్యమమునకు శతాబ్దము నిండినది. అందుకే మొన్న ఉత్సవాలు చేసుకొన్నాము.

వ్రతంచెడ్డా ఫలము దక్కలేదు అనుకోకుండా వ్రతంచెడ్డా ఫలము దక్కినది. సరిగా చెప్పాలంటే ఫలము దక్కినా వ్రతం చెడుతూవుందని చెప్పాలిసొస్తుంది. ఈ స్వాతంత్ర్య ఉద్యమము ఒక శతాబ్దము విలక్షణమైన తీరులో స్వాతంత్ర్యాన్ని సాధించినందుకు మనమందరము ఎంతో సంతోషిస్తున్నాము. ఆ స్వాతంత్ర్య సమరాన్ని ధైర్యముతో సారధ్యము వహించిన వారిని శ్లాఘిస్తున్నాము – ఆనాడు అసువులుబాసిన అమరవీరులు అమరవీధులలో మనలనుచూచి మన దేశాన్ని చూచి ఆనందించుచున్నారుకాబోలు. కాని ఈ స్వాతంత్ర్య ఉద్యమము నేటికి వికృతమైన పోకడలుపోయి వినాశకరముగా మారే ప్రమాదాలు కనబడుచున్నవి. రాజకీయాల్లో జనించిన స్వాతంత్ర్య బీజము, సంఘములో, గృహములో, ఖార్ఖానాల్లో, కచేరీలలో, కళాశాలలో వికృతరూపములు దాల్చినవి. మొక్కనాడు వంచనిది మానునాడు వంగదు. కాబట్టి జాగ్రత్తపడి ఈ స్వాతంత్ర్య నామరూపాలకు విలక్షణ అర్ధస్వరూపాలు కలిగించటమే నేటి విజ్ఞుల విధి.

1857 లో ఝాన్సీరాణికన్న 1957 లో స్త్రీలు ఏమైనా పురోగమించారా ? స్త్రీ పురుషులు అరమరలు లేకుండా నిజంగా ఆలోచించవలసియున్నది. స్త్రీ లెంతవరకు పురోగమించారు ? లెజిస్లేటివు బిల్డింగు, పార్లమెంటు వరకేనా ? వీరికి సోదరులు ఎంతవరకు చేయూతనిచ్చారు ? మునుగుతుంటే చూచితేలనిచ్చారా ? లేక మునగటానికి దోహదమిచ్చారా ? అవి సాధించాము ఇది సాధించాము ఈ బిల్లులు ఆ బిల్లులు ప్యాసయినవి అని సోదరీమణులు, మహిళా సంఘాలు నిజంగా గర్వించతగ్గ సమయము వచ్చిందా ? ఆత్మ పరీక్ష చేసుకొనవలసియున్నది.

రాజకీయంగానే మనము పురోగమించింది. సాంఘిక సంస్కారములన్నీ ఎండమావులుగానే నిలచిపోయినవి. సాంఘికముగా పురోగమించామని అనుకుంటున్నామేగాని రవ్వంతైన ముందుకు సాగలేదు సరికదా అధోగతిపాలైనా మంటేనే సత్యము. రాజకీయంగా చైతన్యము కలిగించి ఆ శతాబ్దము రాజకీయ స్వాతంత్ర్యము సాధించినట్లే ఈ శతాబ్దము సాంఘిక చైతన్యము పునీతమై కొంత కార్యదీక్ష, త్యాగములతో రాజకీయ స్వాతంత్ర్య సుఖములతో సాంఘిక స్వాతంత్ర్య సుఖములు సాధించవలసియున్నది. దీనికి స్త్రీలే కడుసమర్థులు.

ఆ శతాబ్దమున వీరులు తయారైనట్లే ఈ శతాబ్దమున వీరనారీమణులు తయారుకావలసినతరుణము ఆసన్నమైనది. నేటి శతాబ్దమునకు కావలసినది ఝాన్సిలక్ష్మీబాయికాదు, మిస్ ఇండియాలు కాదు. సాంఘిక స్వాతంత్ర్య సమరలక్ష్ములు. కొందరు దిట్టలు ఇదివరకే పునాదులు వేశారు, వేస్తున్నారు నవ్యసంఘ నిర్మాణానికి సంఘసేవికలు తయారవుచున్నారు. క్రిందటి శతాబ్దము పురుషులదైతే ఈ శతాబ్దము స్త్రీలది. మనమూ వారితో సమానమని పోరాటము సాగించి లాభములేదు. నిర్మాణాత్మక సాంఘిక ఉద్యమాన్ని, 1857 - 1957 రాజకీయ ఉద్యమం వలే సాగించగలమో లేదో చూదాము.

ది 25-5-1957 వ తేదీ శనివారం సాయంత్రం గం. 5-30 లకు ఆంధ్ర మహిళా సభలో ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులుగారి మృతికి సంతాపము ను ప్రకటించుటకు సానుభూతి సభ జరిగినది. శ్రీ కె. వి. స్వామిగారు అధ్యక్షత వహించారు.

ఆంధ్ర మహిళా సభ సంయుక్త కార్యదర్శిని శ్రీమతి వి. లక్ష్మీపార్వతిగారి కోరికపై అధ్యక్షులు పంతులుగారి గుణగణాలను ప్రశంసిస్తూ వారు దేశానికీ, ప్రజలకూ కావించిన సేవలను ఉద్ఘాటించారు.

మద్రాసుపట్టణం ఆయన రాజకీయయుద్ధానికి రంగస్థలమనియు అందులో వారికి స్థిరమైన స్మారక చిహ్నం ఏర్పాటుచేయాలనియు చెప్పారు.

శ్రీమతి సతీతులసిగారు కొంత ముచ్చటించి తరువాత పద్యాలు చదివారు. శ్రీ పందిరి మల్లికార్జునరావుగారు ప్రసంగిస్తూ ఆంధ్ర దేశ చరిత్ర అంటే ప్రకాశం గారి చరిత్ర అని చెప్పారు.

శ్రీమతి చెన్నఘంటమ్మగారు మాట్లాడుతూ ఎంతటి ఘనులైనా ఆంధ్ర కేసరి ముందు లేడి పిల్లలవంటివారని నుడివిరి. వారి త్యాగము, సేవ, కార్యదీక్ష, ధైర్య సాహసాలను గూర్చి విపులీకరించారు. మద్రాసు రెడ్ క్రాస్ సొసైటీ గౌరవ కార్యదర్శి శ్రీ అమృతగణేశన్‌గారు పంతులుగారి గుణగణాలను ప్రస్తుతించారు. తరువాత ఈ దిగువ తీర్మానము ఆమోదింపబడి ఎల్లరు రెండు నిముషములపాటు నిశ్శబ్దముగ నిలవబడిరి.

"ఆంధ్ర కేసరి శ్రీ టంగుటూరి ప్రకాశంగారి అస్తమయానికి యీ సభవారు సంతాపము తెలుపుతూ, ఆయన త్యాగనిరతికీ, సేవాదక్షతలకూ, ధైర్యస్థైర్యాలకూ, జోహారు లర్పిస్తూ, ఆయన ఆత్మశాంతికి హృదయపూర్వక ప్రార్థనాంజలులు సమర్పిస్తున్నారు.

వారి కుటుంబానికి, యీ సభవారు సానుభూతిని తెలియజేస్తున్నారు."

రఘుపతి రాఘవ రాజారామ్ గీతముతో సభ ముగిసినది.

భారత స్వాతంత్ర్య సమరము

'భాను'

భారతదేశ చరిత్రలో 1857 వ సంవత్సరము భారతీయులందరకు అత్యంత స్మరణీయమైనది. ఆ సంవత్సరము మే నెలలో భారత స్వాతంత్ర్య సమరానికి అంకురార్పణ జరిగినది. స్వాతంత్ర్యేచ్ఛ వెల్లువికి తిరుగుబాటు విజృంభించినది. ఇప్పటికి వంద సంవత్సరములైనది. భారత ప్రజలూ, ప్రభుత్వమూ ఈ స్వతంత్ర సమర శతవార్షికోత్సవములు జరిపి, స్వాతంత్ర్య సమరమున అసువు- లర్పించిన మహావీరులకు జోహారు లర్పించుట సముచితముగా నున్నది.



స్వాతంత్ర్య సమరము అనగానే మనకు ఝాన్సీ లక్ష్మీబాయి జ్ఞప్తికి వచ్చును. తన రాష్ట్రము విదేశీయుల పాలు కాకుండ కదనరంగమున కత్తి దూసి విజయముగాంచి, సర్వ స్వతంత్ర పట్టమహిషియైనది. బలవంతులైన శత్రువులను నిరోధించుటకు అడవులపాలైన సైనికులను సేకరించి వివిధ యుద్ధరంగములలో శత్రువులను భంగపరచి స్వాతంత్ర్య రక్షణకై రణరంగముననే ప్రాణములు గోల్పోయిన వీరనారి ఝాన్సీ రాణి. ఆమె అకుంఠిత ధైర్య సాహసములను, సమర చాతుర్యమును పరికించిన ఆంగ్లేయులే అచ్చెరువొందిరి.

అప్పటి యుద్ధమున పాల్గొన్న వీరులలో స్త్రీలే ప్రముఖ పాత్ర వహించిరి. హజ్రత్‌మహల్, జేనత్‌మహల్, మొదలగు వీరనారీమణులు ఎందరో పాల్గొన్నారు. వారికందరకు మా జోహారులు.

భారత స్వాతంత్ర్య సమర శత వార్షికోత్సవం

కుమారి రేమణి స్వరాజ్యలక్ష్మి

1857 వ సంవత్సరం భారత స్వాతంత్ర్య సమర చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖింపబడినది. ఆంగ్ల పరిపాలనా సౌధాన్ని పునాదులతో సహా గడగడలాడించిన యీ సమరంలో ఎందరో త్యాగధనులు, అమరవీరులు, వీరవనితలు, మాతృదేశ దాస్యవిముక్తికై అసువులనర్పించి వీరస్వర్గం చూరగొన్నారు. ఆంగ్లేయ ఆధిపత్యంలో చరిత్రకారులు యీ స్వాతంత్ర్య సమరాన్ని కేవలము "సిపాయిల తిరుగుబాటుగా" చిత్రించి, ప్రాధాన్యత యివ్వక అసలు నిజాన్ని మరుగుపరచారు.

ఈ ప్రథమ స్వాతంత్ర్య సమరాన్ని కొనవరకూ సాగించిన ఖ్యాతి వీర భారతనారీమణి ఝాన్సీలక్ష్మీబాయికి దక్కింది. శత్రువులు ప్రయోగించిన తుపాకీ తూటాలతో శరీరం తూట్లుపడినా, విరోధుల ఖడ్గదారలకు ఒకచెయ్యి విరిగిపోయినా, ఆమె సవ్యసాచిలా ఎడమచేత కత్తిధరించి, మహాకాళిలా మండిపడుతూ ప్రళయ భయంకరంగా శత్రువులను చించి చెండాడిన వీరనారీ తిలకం లక్ష్మి. మరణ సమయంలో కూడా "జన్మభూమీ ఆజాద్ హో" అంటూ అసువులు బాసిన అమరజీవి. లక్ష్మి తన శౌర్య ధైర్యాలతోనూ, ఆత్మత్యాగంతోనూ అఖిల భారత నారీ లోకానికే ఎన్నటికీ వసివాడని ఖ్యాతిని ఆర్జించింది.

వర్తక నెపంతో, హిందూదేశంలో అడుగుపెట్టిన ఆంగ్లేయులు, భారతీయులలో ఐక్యత కొరవడిన కారణంగా మనలో మనకు అనవసర అంతఃకలహాలు ప్రజ్వలింపజేసి 'ఎకైవచ్చి మేకైకూర్చున్నట్టు' భారత పాలకులయారు. విభజించి పాలించే యత్నంలో వీరు, అనేక జాతిమతములతో నిండిన భారతావనిలో జాతి మత వైషమ్యములను పెంపుచేసి భారతీయుల బలహీనత వల్ల అధికారం హస్తగతం చేసుకున్నారు. కుట్రలు, కుతంత్రాలు ఎరుగని భారతీయులు వారు చెప్పిన ప్రతి విషయము నిజమనినమ్మి వారి చేతులలో కీలుబొమ్మలయారు.

అధికారం హస్తగతం చేసుకున్న తరువాత ఆంగ్లే[illegible] అనేక దారుణ హింసాకాండలను జరిపారు. భారతీయులపట్ల క్రూరాతిక్రూరంగా ప్రవర్తించారు. బానిసలకంటే నీచాతినీచంగాపరిపాలించారు. దీనివలన దేశభక్తిపరాయణులైన వారిరక్తం ఉడికింది. పరిణామమే 1857 వ సంవత్సరంలో ప్రథమ భారత స్వాతంత్ర్య సమర శంఖుస్థాపన.

అయితే చరిత్రకారులు దీనికి రకరకాల వ్యాఖ్యానాలు యిచ్చి ఉన్నప్పటికీ, సిపాయిల తిరుగుబాటుగా చప్పరించినప్పటికీ, భారతదేశ స్వాతంత్ర్యం కోసం జరిగిన ప్రథమ పోరాటంగానే చరిత్రకెక్కింది. భారతదేశంలో కొరవడిన ఐక్యత కారణంగా, కుయుక్తులకు మూలపురుషులైన బ్రిటిషువారు, ప్రథమ స్వాతంత్ర్య మహా సమరానికి తాత్కాలికంగా అడ్డుకట్ట వెయ్యగలిగినా పూర్తిగా నిరోధించలేక పోయారు. ఈ పోరాటం త్వరలోనే మరొక రూపంలో పునఃప్రజ్వలితమైంది. తిలక్ ప్రభృతులు పునాదివేసిన యీ పోరాటం గాంధీమహాత్మునినాయకత్వం క్రింద అహింసాయుతమైన శాంతి పోరాటంగా రూపురేఖలు మార్చుకుంది.

భారతీయులు ప్రారంభించిన ఈ అహింసాయుతమైన స్వాతంత్ర్య సమరాన్ని ఆంగ్లేయులు హింసతో అరికట్ట చూచారు. 'జలియన్‌వాలా బాగ్' దురంతంవంటి కిరాతక కృత్యాలెన్నో లెక్కకు మిక్కుటంగా జరిపారు. అయితే భారత జాతి పిత బాపూజీ హింసను ప్రతిహింసతో ఎదుర్కొనలేదు. దౌర్జన్యాన్ని దౌర్జన్యంగా కాకుండా, దౌర్జన్య రాహిత్యంగా, అహింసా సిద్ధాంతాల ద్వారా కొనవరకు సాగించి స్వాతంత్ర్య సముపార్జన సాధించాడు.


ఉప్పు సత్యాగ్రహం తరువాత ఆంగ్లేయులకు అసలు శిసలైన సత్యాగ్రహ సమరశక్తి కొద్దిగా దృగ్గోచరమైంది. ఫలితంగా రౌండ్ టేబిల్ కాన్ఫరెన్సు, క్రిప్సు రాయబారము—విఫలము—క్విట్ ఇండియా ఉద్యమము, కాంగ్రెస్ ప్రముఖ నాయకుల అరెస్టు, "డైరెక్ట్ యాక్షన్ డే"—లార్డ్ మౌంట్ బాటన్ రాజనీతిజ్ఞతతో చాకచక్యంగా తమ ప్రభుత్వంతో జరిపిన మంతనాలు-బొంబాయిలో నావికుల తిరుగుబాటుతో ఆంగ్లేయ ప్రభుత్వం తమ పట్టు

సడలించింది. భారతదేశీయులకు పరిపాలన చెయ్యటమే చేతకాదని కొద్దిరోజులపాటు తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసి, ఫలితం గమనించింది. అయితే అప్పుడు కూడా వారు తమ కుటిలనీతిని మానలేదు. హిందూ-మహమ్మదీయ విద్వేషం పెచ్చుచేశారు. ఫలితం యిరు తెగలలోనూ అనేకమంది అమాయకులు ఆహుతయ్యారు.

చివరకు అఖండ భరతఖండం రెండు ముక్కలుగా చీలి 1947 ఆగస్టు 15 వ తేదీ తొలిఘడియల్లో స్వాతంత్ర్యం సముపార్జించుకుంది. అంటే 1857 లో శంఖుస్థాపన గావించబడిన యీ పోరాటం నిరాఘాటంగా 90 సంవత్సరాలు జరుగుతూనే వుంది. "రవి అస్తమించని ఆంగ్ల సామ్రాజ్యంలో 'రవి'ని అస్తమింప చేసింది భారత స్వాతంత్ర్య పోరాటమే. ఆంగ్లేయులు మనకు ఇన్ని అన్యాయాలు చేసినా, ఇంకా చేస్తున్నా, రత్నగర్భ అయిన భారతవర్షాన్ని 'రాళ్ళగర్భ'గా చేసి విడిచినా ఉదార హృదయులమైన మనం వారి తప్పులు దిగమింగి అభిమానంగా ఆదరంగా వ్యవహరిస్తున్నాం.

1950 సంవత్సరం జనవరి 26 న భారతదేశం పూర్తి ప్రజాస్వామిక ప్రభుత్వాన్ని ఏర్పరుచుకుంది. దేశం మొత్తంమీద రెండుసార్లు జనరల్ ఎలక్షన్లు దిగ్విజయంగా సమాప్తి చెందాయి. రెండుసార్లూ కాంగ్రెస్ పక్షమే అత్యధిక మెజారిటీతో నెగ్గింది. (రెండవసారి కేరళలో తప్ప) ప్రథమ పంచవర్ష ప్రణాళిక దిగ్విజయంగా పూర్తయింది. ద్వితీయ పంచవర్ష ప్రణాళిక ప్రారంభమైంది. దేశం, ప్రభుత్వం ఎన్నో ఘనకార్యాలు సాధించింది. ప్రపంచం అంతా శాంతికోసం హిందూదేశం వైపు దృష్టి సారించి వుంది.

అయినా 1857 లో ప్రారంభమైన పోరాటం యింకా పూర్తిగా ముగియలేదని చెప్పవచ్చు - నిండు చంద్రుని పండు వెన్నెలకు కళంకం ఆపాదించిన మచ్చలా, సమగ్ర భారతంలో గోవా, మొదలైన కొన్ని ప్రదేశాలు యింకా విదేశీయుల పరిపాలన క్రిందే ఉన్నాయి. అక్కడ బుడతకీచుల దురహంకారం యింకా వెర్రితలలు వేస్తూనే వుంది. ఆ ప్రదేశాలను భారతదేశంలో కలపటానికి ప్రయత్నించి అందుకుగాను అహింసాయుత పోరాటం ప్రారంభించిన సత్యాగ్రహులపై బుడతకీచులు రాక్షసుల కన్న అమానుషమైన దారుణకృత్యాలు సలిపారు. ఇంకా జరుపుతూనే ఉన్నారు. అయితే యిక ఎప్పటికీ తాము ఆ ప్రదేశాలలో వుట్టికట్టుకు వూరేగుతామనుకోవటం వారిది పొరపాటు. పాండిచ్చేరీ నుండి వైదొలగటంలో ఫ్రెంచివారు ప్రదర్శించిన విజ్ఞత ప్రదర్శించి బుడతకీచులు భారతీయుల ఆదరానికి పాత్రులవుతారో, లేక తా బట్టిన కుందేటికి మూడేకాళ్ళంటూ అహంకారంతో విర్రవీగి అసహ్యింప బడుతారో కాలమే నిర్ణయించాలి. ఏమైనా ఆ ప్రదేశాలుకూడా భారత్‌లో విలీనం అయేదాకా 1857 లో ప్రారంభమైన స్వాతంత్ర్య సమర పోరాటం ముగిసిందనుకోరాదు. ఆ ప్రదేశాలు కూడా మన మాతృభూమిలో చేరిననాడే మనకు సంపూర్ణ స్వాతంత్ర్యం లభించినట్టవుతుంది.



రవీంద్రవర్ధంత్యుత్సవాలు :

తొంభై ఏడవ జయంతి

విశ్వకవి రవీంద్రుని 97 వ పుట్టిన దినోత్సవాలు దేశం మొత్తంమీద పెద్దపెట్టున జరిగాయి. కవిగా, గేయకర్తగా, కథకునిగా రవీంద్రుడు అందరిహృదయాలనీ ఆకర్షించాడు. అరవై సంవత్సరాలపాటు ఒక్క బెంగాల్ సాహితీ రంగాన్నే కాక విశ్వసాహితీ రంగాన్నే విశృంఖలంగా విహరించాడు రవీంద్రుడు. పరిణామంలో యీతని రచనల బరువు ఒక మానవాతీతుని శక్తి గోచరింప చేస్తుంది.

నవలా రచయితగా రవీంద్రుడు బెంగాల్‌లోని మధ్య తరగతుల జీవితాలని, పాశ్చాత్య నాగరికతా వ్యామోహ ప్రభావాలనీ కంటి కానేలా చిత్రించాడు. ఇతని కథలు అతి సున్నితం అయిన నారీతత్వానికి నిదర్శనాలు. ఇతని గేయాలు అందరినోటా పొరలాడే తేనెపాటలు. బెంగాల్ గడ్డమీద యీతని పదాలు పాడని బెస్తగానీ, పల్లెవాసి గాని ఎలా లేడో యితని గేయాలుపాడని, మెచ్చుకోని నాగరికుడూ అలాగే లేడు.

రవీంద్రుని స్త్రీలు హృదయరంజకంగా వుంటారు. మన మనోవీధినుండి ఎన్నటికీ తొలిగిపోని తత్వాలు వారివి.

మద్రాసులో టాగూర్ అకాడమీ వారి ఆధ్వర్యాన రవీంద్ర జయంత్యుత్సవాలు జరిగాయి.



రాజకీయాలు

శ్రీమతి కె. రామలక్ష్మీ ఆరుద్ర

మే మాసం దేశం మొత్తంమీద ప్రాముఖ్యం వహించింది. నూరు సంవత్సరాల క్రితం జరిగిన తొలి స్వాతంత్ర్య సమరపు పుట్టినరోజు నాడు దేశం మొత్తం మీద ఉత్సవాలు జరిపారు. మే పదకొండు నాడు మృత వీరుల సంస్మరణంలో లెక్కలేనన్ని ఊహల దండులు బయలుదేరాయి. ఆనాడు జరిగినది స్వాతంత్ర్యసమరమా? సిపాయిల తిరుగుబాటా? ఏమిటి? ఎందుకు జరిగింది అన్న ప్రశ్నలకి చక్కని సమాధానం యిచ్చారు మౌలానా అజాద్‌గారు. అసలు ఉత్సవంగా యీ తొలి స్వాతంత్ర్య పోరాట దినాన్ని ఆగస్టులో మన స్వాతంత్ర్య దినంతో పాటు ప్రభుత్వం జరుపుకుంది. అందాకా యీనెలలో జరిగినవి రుచులూరించే జ్ఞప్తులే.

1857 లో నేలకూలిన వీరులు విషాదాంత కథనాన్నే విజయంగా రూపొందించారు. తదుపరి తరాలవారికి ఉత్తేజాన్ని ఉత్సాహాన్ని కల్గించడంకోసం తమ ఆత్మ బలిదానాన్ని వినియోగించి, పాఠాలు గరిపారు. ఈసిపాయిల తిరుగుబాటుకి రాజకీయంగా ప్రాముఖ్యంలేదు. ఎందుకంటే ఆ కారణం అతి స్వల్పం. లార్డు డల్‌హౌసీ ఏవో కొన్ని చిన్న చిన్న సంస్థానాలని విలీనం చేసుకుంటా డన్నది. స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత ప్రజాస్వామ్య రాజ్య లక్షణాలని అవగతం చేసుకున్నతరువాత యీ కారణ మేమంత విప్లవాంకురం కలదిగా తోచదు. సర్దార్ వల్లభాయ్ పటేల్ ఎన్ని చిన్న సంస్థానాలని కలిపితే, యీ రిపబ్లిక్ భారతదేశం రూపందింది? అంతకంటే కూడ రాష్ట్రాల పునర్విభజన యింకా విప్లవాత్మకంకదా? నిజానికిచూస్తే డల్‌హౌసీ ప్రారంభించిన పనిని పటేల్ ఒక కొనకి తెచ్చాడు. వర్తమాన ప్రభుత్వం పూర్తిగా దేశాన్ని ఐక్యంచేసి రాజరికానికే స్వస్తి పలికించింది. ఒకవిధంగా తిరుగుబాటు కారణాలు స్వల్పమైనవే అయినా, ఆ తిరుగుబాటులో అసువులను బాసిన వీరులు మరువరాని వారు. వీరు నేర్పిన గుణపాఠపు విలువ ఎనలేనిది. జాతి ఐక్యతనీ వ్యక్తి స్వాతంత్ర్యాన్ని నిలబెట్టుకోవడం కంటె ఎక్కువయిన యింకొక స్మారక చిహ్నం వీరికి సృష్టించలేం. చరిత్రలో నిలిచి మిగిలినవారి పేర్లలో ముఖ్యుడు నానాసాహెబ్ ఒకడు. ఇతని జనరల్ తాంతియాతోపె, యితని సలహాదారు అజీముల్లాఖాన్. వీరు కూడా యీ తిరుగుబాటులో ప్రముఖ పాత్ర వహించినవారు. వీరు కాక, రోహిల్‌ఖండ్ గవర్నరు- బహదూర్ ఖాన్, జగదీశ్‌పూర్‌కి చెందిన కువ్వాల్‌సింగ్— (ఎనభైయో పడిలో పడ్డ ముదుసలి. యీ సింగు అప్పుడు పట్టుపట్టి తన రాజధానిని బ్రిటిషువారి దగ్గరనుంచి తిరిగి తెచ్చుకున్నాడు.) ఇరవై సంవత్సరాల యౌవని రాణీలక్ష్మీబాయి బ్రిటిషువారి పట్ల యీమె శత్రుత్వపు బలం అమోఘం అయినది. అయితే ఢిల్లీపై దండెత్తడానికని నేతాజీ సుభాస్ బోస్ బర్మాలో, మలయాలో రెండవ ప్రపంచ యుద్ధం సందర్భంలో, లేవనెత్తిన సైనిక దండులలో ఒకదానికి యీ ఝాన్సీ లక్ష్మీ పేరు పెట్టాడు.

తిరుగుబాటు దారులు ఎంత దీక్షతో తిరుగుబాటు జరిపారో వాటిని అణచివేయడానికి బ్రిటిషు సైన్యాలు అంత దీక్ష పూనాయి. బ్రిటిషు పాలనకింద శాంతి

సౌఖ్యాలని చూపిన ప్రదేశాలు వారికి విశ్వాసపాత్రంగా వున్నాయి. కొన్ని కొన్ని సందర్భాలలో అటు బ్రిటిషు వారూ యిటు తిరుగుబాటు దారులూకూడా దారుణ హింసా కాండకి పూనుకొన్నమాట వాస్తవమేకాని రెండేళ్ళపాటు జరిగిన యీ తిరుగుబాటు ఫలితంగా అటు పాలించేవారి లోనూ యిటు పాలితులలోనూ కూడా కనువిప్పు కల్గింది. 1858 లో బ్రిటిషు పార్లమెంటు. వ్యాపారదృష్టిపై ఆధార పడ్డ పరిపాలనా విధానాన్ని మార్చి కొంచెం మంచి ప్రభుత్వాన్ని నెలకొల్పడం జరిగింది. మహిరాణీ విక్టోరియా పరిపాలన చేతపూనడంతో కొత్త వాతావరణం ప్రారంభం అయింది. ఈనాడు మన రాజ్యాంగం అమలు లోకి తెచ్చిన ఎన్నో అంశాలని విక్టోరియా రాణి వూహించింది. "జాతి మత కారణంగా ఎవరూ దూరంగా వుంచబడరు. ఎవరూ దగ్గిరిసా చేర్చుకోబడరు. అందరూ పక్షపాతం లేకుండా న్యాయరీత్యా రక్షణలన్నీ పొందు తారు" అన్న విక్టోరియా ప్రొక్లమేషన్ యిందుకు నిదర్శనకదా ? అధికారంలో వున్నవారు అనవసరంగా ప్రజల నమ్మకాలతోటి జోక్యం కల్గించుకోకూడదనీ శాసించింది. అంతే కాకుండా, జాతీయ వ్యాపారాన్ని అభివృద్ధి పరిచి. ప్రజానీకానికి సదుపాయాలని కూర్చే పనులని చేయాలని కోరిందామె.

కాని, ఆమె కోరినంతగానూ, భారతీయులు కోరినంత గానూ కార్యక్రమం త్వరగా కొనసాగలేదు. అయితేనేం అన్నిరంగాలలోనూ గాంధీ వాచకాలు పలకడం జరిగింది. అదే అప్పట్లో గొప్ప విజయం.

1857 నేర్పిన ప్రముఖ గుణపాఠాలలో ఒకటి ఐక్యత ప్రాముఖ్యం. భారతదేశ స్వాతంత్ర్యం నిలవాలంటే భారతీయులు జాతి మత భేదాలు లేకుండా ఏకంగా నిలవా లన్నది. అంతేకాకుండా సర్వ ప్రజలూ సుఖంగా బ్రతకా లంటే, ప్రజోపయోగార్థం అవసరం అయిన అభ్యుదయ సాధనకే యిటువంటి ఐక్యత అవసరమే. భాషామత విషయాలలో యిట్టిట్టే విభేదాలు సృష్టించుకునే నేటి పెద్దలు కొందరు యీ ఐక్యతావసరాన్ని గుర్తించటం ఎంతైనా అవసరం.

ఆరుమాసాలపాటు వైభవోపేతంగా సాగిన బుద్ధ జయంత్యుత్సవాలు మే మాసంలో ముగిసాయి. వాటి ముగింపు వుత్సవంలో పాల్గొందుకు ప్రధాని నెహ్రూ కొలంబోకు వెళ్ళారు.

బుద్ధుణ్ణి, అహింసావాదాన్ని ఎంతగానో మెచ్చుకొనే పెద్ద దేశాలు మారణ యంత్రాల తయారింపులో పోటా పోటీలు పడడం ముదావహం. ఈవిషయం పైననే ప్రసంగిస్తూ శ్రీ నెహ్రూ మానవాళికే మహాప్రమా దాన్ని తేగల యీ అస్త్రాలను విసర్జించడం ఎంత ముఖ్యమో వివరించారు. హైడ్రోజెన్ బాంబుని మనం యితరులకి హానిచెయ్యడానికై ప్రయోగిస్తే అది మనకి కూడా హాని చెయ్యగలదనీ, బహుశా ప్రపంచంమొత్తానికే ఆ హాని కలుగుతుందని నిరూపితం అయిందని చెప్తూ, మానవుడు చేస్తూన్న దారుణం అయిన పనులవల్ల మానవజాతే తన సర్వనాశనాన్ని ఎదుర్కోవలసి రాగల అవకాశాలని గురించి మాట్లాడారు నెహ్రూ. వీటిని అరికట్టడంలోనూ వీటిని ఉపయోగించడం విషయంలో పరిమితులను తేవడంలో కృతకృత్యులం అయితేకావచ్చు. కాని అది చాలదు. ఇంకా లోతుగా వెళ్ళి మానవజాతి మనస్సును, ఆలోచనలనూ, సైనికపాటవంవైపూ, మహాస్త్రాలవైపూగాక, సాధ్యమైతే కరుణవైపూ, మానవ స్వాతంత్ర్య సహకారాలవైపూ మళ్ళించడానికి ప్రయత్నిం చాలి అన్నారు. ఎక్కడో అక్కడ యీ అణ్వస్త్రాల పరీక్ష జరగడమో జరుగుతుందని అనడమో జరుగ బోతోందని చెప్పడమో వింటూనేవున్నాం. అవీ, బుద్ధ జయంత్యుత్సవాలలో పాల్గొనడానికి వస్తున్న సందర్భంలో యీ వార్తలు వినడం, జీవిత సమస్యల నెదుర్కొనడం కోసం కల యీ రెండు దృక్పథాలకే చెందిన ఆలోచన లతో నిండిపోయిందన్నారు శ్రీ నెహ్రూ. ఈ రెండు దృక్పథాలలో ఒకటి గౌతమబుద్ధుని కరుణ పథకం. రెండవది హైడ్రోజెన్, యాటం, బాంబుల పథకం. ఈ రెండు ఎంత విభిన్న పంథాలో తెలుస్తూనేవుంది. వాటిలో మానవ జాతులు ఏది ఎన్నుకొంటాయి. అన్నదే సమస్య.

బ్రహ్మాండం అయిన క్లిష్టపరిస్థితులను ఎదుర్కొంటూ సర్వనాశనాన్నుండి తప్పించుకొంటూ మానవుడు సజీవంగా వుండకల్గితే, అటుపిమ్మట కూడా అతడు మనకల్గే అవకాశం వుంటుంది. అదే జరగాలని నే కోరుతున్నాను అన్నారు నెహ్రూ.

మహావిపత్తును తెచ్చిపెట్టగల్గిన యీ మారణ యుద్ధాలని నిషేధించడానికైనా, అరికట్టడానికైనా ప్రత్యా మ్నాయా మార్గాలు ఆలోచించాలి కాని చేతులు కట్టుకు కూర్చోనకూడదు. మెరుపుల్లా కన్పించే కొన్ని సమస్యలు

సహితం కాలక్రమాన పరిష్కారానికి లొంగుతున్నాయి కదా ? శ్రమ అనుకోకుండా ఫలితం దక్కేవరకూ పరిశ్రమించడమే.

విజ్ఞులూ, విజ్ఞాన వేత్తలూ ప్రపంచం మొత్తంమీద పెద్దలందరూ నిరసిస్తూన్న యీ అణ్వస్త్రాల ప్రయోగాలకి స్వస్తి చెప్పకుండా యింకా యింకా ముందుకు సాగి పోవాలని కోరే "పిచ్చి రాజ్యాలు" కళ్ళు తెరిచి మానవ జాతికి తామై తెచ్చిపెడుతూన్న యీ సర్వనాశనాన్ని గురించి ఆలోచించాలి. అలా ఆలోచించేలా చేసేదాకా యీ పెద్దలెవ్వరూ వూరుకో కూడదు. ఊరుకోరు కూడా.

ఎన్నికల హడావిడి ఒక ఎత్తు. పదవుల పంపిణీ ఒక ఎత్తు. ఎన్నికల రోజుల్లో వున్నలాంటిదే జ్వరతీవ్రత మంత్రి వర్గాలు రూపం దాల్చేదాకా తగ్గదు. కేంద్ర మంత్రివర్గంలో ఆడవారి సంఖ్య హెచ్చించారు. అలాగే యిద్దరు దక్షిణాత్యులకు డిప్యూటీ మంత్రి పదవులు మంజూరు చేయించారు. అందులో ఒకరు శ్రీ కొత్త రఘురామయ్యగారు. రెండవవారు శ్రీ ఎ. ఎం. థామస్ గారు. రఘురామయ్యగారు డెఫెన్సు శాఖకూ, థామస్ గారు వ్యవసాయ శాఖకూ చేర్చబడ్డారు.

శ్రీ రఘురామయ్యగారు, మొన్నటి ఎన్నికలలో గుంటూరు నుండి లోక్‌సభకు ఎన్నిక అయారు. రాజకీయాలలోకి ప్రవేశించడానికి ముందు వీరు మద్రాసు హైకోర్టులో లాయరుగా 1937 నుండి 41 దాకా ప్రాక్టీసు చేశారు. తరువాత రాష్ట్ర జ్యుడిసియల్ శాఖలో ప్రవేశించి లీగల్‌శాఖలో డిప్యూటీసెక్రటరీ అయారు. గవర్నమెంటు సొలిసిటర్‌గా కొన్నాళ్ళు పనిచేశారు. తరువాత 1947 లో మద్రాసు లీగల్ శాఖలో డిప్యూటీ సెక్రటరీగా నియమితులయారు. తరువాత సంయుక్త కార్యదర్శి అయారు. 1951 లో ప్రభుత్వోద్యోగానికి స్వస్తి చెప్పి రాజకీయాలలోకి దిగారు. 1952 లో కాంగ్రెసు టిక్కెట్టుమీద తెనాలినుండి లోక్ సభకు ఎన్నిక అయారు.

శ్రీ రఘురామయ్యగారు, యునైటెడ్ నేషన్సుకు రాయబారవర్గానికి సలహాదారుగా వెళ్ళారు. తరువాత చైనాలో, తూర్పు దక్షిణ ఆసియా రాజ్యాలలో యిండియన్ పుగాకునకు తగిన మార్కెట్టు లభిస్తుందేమో పరిశీలించడానికి నియమింపబడిన టొబాకో మిషన్‌కి ఆధ్వర్యం వహించారు.

శ్రీ ఎ. ఎం. థామస్ కేరళకు చెందిన న్యాయవాది. 1949 లో కొచ్చిన్ శాసనసభ సభ్యుడు. తరువాత 1949–51 వరకూ తిరువాన్కూరు కొచ్చిన్ శాసనసభ సభ్యుడు. 1951-52 లో యీ శాసనసభ స్పీకరుగా కూడా పనిచేశారు.

వారిద్దరూ, కేంద్ర మంత్రివర్గంలో వుండి దక్షిణాదికి పేరు ప్రఖ్యాతులు యినుమడింపచేస్తారనీ, యింకా ఉన్నత పదవులకి వెడతారని ఆశిద్దాం.

రావణాసురుడి కాష్ఠంలా తయారవుతూంది కాశ్మీర్ సమస్య. ఎవరెవరో రావడం, తోచినవి చెప్పడం వెళ్ళడం. పాకిస్తాన్ ఆ అవకాశాన్ని అందిపుచ్చుకొని భారతదేశంపై నానా అభాండాలూ తిరిగివెయ్యడం. ఇదీ మాటికి పరిపాటి అయిపోయింది.

కాశ్మీరు సమస్యపట్ల కొంత విమర్శనాయుతంగా తిలకించి మాట్లాడినట్లు కనపడ్డది. శ్రీ బెవాన్‌గారి మాటలు. భారతదేశం తిలకింపవచ్చిన ప్రముఖులలో వీరుకూడా ఒకరు. కాశ్మీర్‌పట్ల బ్రిటిష్‌వారి తెలివితక్కువ వైఖరిని గురించీ, భారతీయుల అసంతృప్తి కారణాలను గురించీ శ్రీ బెవాన్‌గారు వివరించారు. ముఖ్యంగా మూడువిషయాలు భారతీయులను దిగ్భ్రమ చెందించాయనీ, అందులో ఒకటి- సూయజ్‌పై దండయాత్రా, రెండవది, కాశ్మీర్ విషయంలో పాకిస్తాన్ని బ్రిటను సమర్థించడం, మూడు హైడ్రొజెన్ బాంబుగా ప్రయోగాల విషయంలో బ్రిటిషు పట్టుపట్టడం. కాశ్మీరు ప్రభుత్వాన్ని తాను సమర్థించకపోయినా, మత విద్వేషాలపై ఆధారపడే ప్లెబిసైట్ నిర్ణయాలను సమర్థించడం తప్పనీ, యింటర్వ్యూలో బెవాన్ చెప్పారు. అంతేకాక, మాటాడితే అందరూ చెప్పే-కాశ్మీరు-హంగెరీల సామ్యం తప్పన్నారు. అక్కడ జరిగేది పక్షపాత నియంతృత్వం. కాశ్మీరులో ఎన్నికలు జరిగాయి. యీ రెండూ రెండు సమస్యలు అన్నారు.

వివేకవంతంగానూ, నిష్పక్షపాతంగానూ కాశ్మీరు సమస్యను తిలకింప దలచుకొంటే నిజానిజాలు గుర్తింప కల్గుతారు. లేకుంటే రంగద్దాల కళ్ళజోడులోంచిలా ఎవరి వాదం వారిదే కరెక్టు అనిపిస్తుంది. ఏది ఏమైనా భారత ప్రభుత్వం కాశ్మీరు విషయంపై లొంగిపోవడం జరగదు. అది గ్రహించే కాబోలు-పాకిస్తాన్ కాకిగోల ;



'సర్వప్రాణులకు దుఃఖము నశించాలి. సర్వప్రాణికోటీ నిత్య నిరామయ నిర్వికల్ప నిర్వాణానందాన్ని అనుభవించాలి' అన్నదే బుద్ధదేవుని మతం.

పునర్జన్మలకు కారణం శాశ్వతానందాన్వేషణమే. దుఃఖానికి మూలం కోరిక. కోరిక లేనినాడు ఆనందం నీ అధీనం.

నిర్వాణపదమును పొందుట సులభసాధ్యం కాదు. ఎంతో సాధన చెయ్యాలి. ఎన్నో జన్మలు ఎత్తాలి.

ప్రపంచంలోని దుఃఖం నశింపజేసి, శాంతి సమత్వాలను సమన్వయం చెయ్యడానికి సన్మార్గానువర్తనము ప్రథమ సోపానము. సకల భూతరాసులమీద కరుణగల్గి సర్వప్రాణులకూ సేవ చెయ్యి. అప్పుడే నీకు ముక్తి.

బుద్ధం శరణం గచ్ఛామి
ధర్మం శరణం గచ్ఛామి
సంఘం శరణం గచ్ఛామి.

త్యాగధనులు

రచన :
శ్రీ మధురాంతకం దొరస్వామిపిళ్ళై

అది యపరాహ్ణవేళరవి । యంతకరంబుల తీక్ష్ణతాపమున్
యొదుగ నిషాదు డొక్కరుడు । యోర్మివహించి
నిజాంతరంగమం
దొదవినవేటవేడుకను । యూళ్ళను బల్లెలదాటి కానలో
బొవలెడి పక్షిజాలముల । బూనిక బట్టదలంచి నేర్పునన్.

ఉరులు పాదులు నెలకొల్పి । యుండునంత
బేలలై జేరి పాదుల । బీర ముడిగి
గోలసేసెడి పులుగుల । గుములు దీసి
జోలెపై చెను బోయండు । జాలిగొనక,

ఛాయమగడంత చల్లన । చలము మాని
పశ్చిమాంబుధి గ్రుంకగా । నిశ్చయించె
వేట జాలించి మృగయుండు । విపినసీమ
పురికి నేతెంచునంతలో । ప్రొద్దుగ్రుంకె.

గగనపథమున మేఘముల్ । గప్పుకొనియె
కారుచీకట్లతోగూడ । కారడవిని
కుండపోతగ వర్షంబు । కురిసెనంత
దారితెలియక నాతండు । తల్లడిల్లి.

చేరి తలదాచుకొనియెను । చెట్టుక్రింద
చలియు నాకలిపీడింప । చాల నలసి
అంత వృక్షమ్ముపై నున్న । యతివ పక్షి
కాంతు దేతేరమికి నెంతో । కళవళించి.

అక్కట యేమికారణమొ ।
యారయనైతి విభుండు రామికిన్.
దిక్కని నమ్మియుండునను ।
దేరియెచూడక యుండదిమ్మెయిన్
జిక్కులు నేమివచ్చె ? నిట ।
జేరగసూర్యుడు గ్రుంకె నింక నే
దిక్కనగాంతు నాథవుని ।
దీనత నేమియు దోపదక్కటా.

అనుచు జింతించు నంతలో । యా విషాదు
జోలెనున్నట్టి మగపక్షి । చోద్యమంది
జాయ ! నే పట్టువడితిని । బోయచేత
దైవవిధి యిట్లు సేయంగ । దాళగలమె.

యనుడు దద్దయు జింతించి । యాడుపక్షి
పుడమి మూర్ఛిల్ల వేగమె । మూర్ఛదేరి
నాథ ! హా నాథ యేమందు । నాథయనుచు
శాఖిపైనున్న యాపక్షి । చాల వగవ.

జాయ యేటికి చింతింప । ఖాయమగునె
కాయమది యేరికైనను । కలువ కంతి
పట్టి భ్రాంతులు బ్రతుకులు । వగవనేల
అతిథి ధర్మంబు లవి కొంత । యఘము ద్రుంచు.

శీతకాలవాయువుల్ యిటుల ।
చెంతలవీవగ కంపమొందుచున్
నెంతటి యాతటిన్ బడలి ।
నేమిక కాగలవాడొ బోయ డీ
చెంతను జేరినాడు మన ।
చెట్టుకు దాపున గాన వానికీ
వింతను క్షుత్తుమాన్చి చలి ।
[illegible]

శత్రుడని కంటగింపకు । మిత్రుడనుచు
చూచి పోషింపు మతిథిని । చోద్యమంద
మూడులోకాల జనులెల్ల । మోదమంది
నీదు చరితంబు జెప్పుచు । నెగడు నటుల.

అనుట నాలించి వేగమే । యాడుపక్షి
పక్షములు విప్పి రివ్వున । బారదొడగె
గగన పథమున కొంతట్లు । గడచి చనిన
చెంత నొకయూరు గనిపించె । చెలువకపుడు.

నోట కొఱవిని గరచుక । నింగి కెగిరి
చేరి వృక్షమూలంబును । చెంతనున్న
చిదుగులంగూర్చి కొఱవిని । చెలిమి గుల్క
యింగిలంబును దరికొల్పి । యిట్టులనియె.

గడగడ వడకెద వేటికి ?
సిడిముడిపడి చాల యిటుల । చిక్కితివనా !
గడిబిడియైతివి వానను
జడి కొంచము తగ్గెనింక । జలిగాచుమికన్.

అనుడు నిషాదుడంతటను । యాసిఖి చెంతకునేగితావడిన్
బనిగొని జ్వాలగాచుకొని । బాసెను శీతలబాధయంతటన్
గనలుచు నాకటన్ బొదల । గాగని బోయనివంకజూచి తా
మనమున జింతజేసికొని । మానుషభాషల నిట్లువల్కెడిన్.

పులుగు జాతుల మాటను । పుడమినీకు
నిడగ దగినట్టి వస్తువుల్ । నెగడవిందు
గాన మచ్ఛరీరంబును । గాల్చినిపుడు
ఫలల భక్షణమీవిడ్డు । బడయుమయ్య.

అని తన నాథుగాంచి వడి ।
యయ్యార ! యజేయ ! యటంచు మోదమున్
గనిన హృదంతరాళమున ।
గామిని గానన సీమలో వడిన్
బనిగొని నింగిలంబు జొర ।
బావురుమన్నవి పక్షిజాలముల్
మనసున యెంతో చింతయది ।
మానగలేదిక బోయవానికిన్.

డెందము గందళింప నపు ।
డీవిధమెల్లను గాంచి యాత్మలో
బొందిన మోదమున్ దొరగి ।
పుల్గుల బట్టుట పాపమంచు నా
పాంథుడ జోలెలో నిడిన ।
పక్షులపాటుకు జింతసేయుచున్
బంధవిముక్తు తానటుల ।
బక్షులజేసిన యంతలోవడిన్,


యగ్ని కాహుతియైనట్టి । యతివకొఱకు
యారటంబంది మగపక్షి । యంత నగ్ని
జొచ్చిన నిషాదుడంతట । చోద్యమందె
దివ్య నవ్య శరీరముల్ । దేజరిల్ల.

పక్షి మిథునమ్ము నాకస । పథమునందు
తమకు యెదురుకోల్ గాగను । తరలివచ్చు
దివ్యయానంబు నెక్కుచు । దేజరిల్లి
దివ్యలోకంబు జేరెను । గువ్వలంత.

బోయ డాశ్చర్యమగ్నుడై । భూరియశము
గన్నపక్షుల బుద్ధిని । సన్నుతించి
జీవితం బెంతకైనను । జింతెయనుచు
యెంతపాపిని నేనంచు । యేడ్చితుదకు.

మండుచున్నట్టి యగ్నిని । నిండుకొలిపి
యగ్ని కాహుతియై తాను । యధిగమించి
దివ్యయానంబు జేరెను । తేజమెసగ
పాపియైనను సద్భక్తి । పరుడు నగుట.

మూడుమూర్తుల యట్టులు । ముగురు జీవు
లొక్క పరిజేరి వైకుంఠు । మ్రొక్కుకొనిరి
పులుగుజంటల త్యాగంబు । పుడమి జనుల
కుల్లములనాటె సత్కీర్తి । పల్లవింప !



సంగీత కళా రహస్యనిధి

అసహ్యముగా వున్నదాన్నెప్పుడూ. అది ఎందుకు అసహ్యంగా వుందీ అని ఎవరూ పరిశీలించి చూడము. కాని అదే ఏదైన సుందరమైన దైతే అది ఎందుకు అందముగా వున్నదో. ఎంత అందముగా వున్నదో తేరిపార చూచి. తర్కించి. వితర్కించి తృప్తి పడతాము.

ప్రపంచములో ఏడ్చేవాళ్ళు ఎంతమందో వున్నారు- కొంతమంది ఏడుస్తూ వుంటే - ఆ చేపలచట్టంత మూతి, చింకికళ్ళు, వాలకము చూస్తే అసహ్యమేస్తుంది. కొంత మంది బుడిబుడి ఏడ్పులు చూస్తే చీదరేస్తుంది. మరి కొందరు బుంగమూతి పెట్టుకొని కన్నీళ్ళు కారుస్తుంటే జాలివెయ్యొచ్చు కాని ఏడ్చేటప్పుడు అంగాలు చిందులు తొక్కే దెప్పుడు ?

బోసినోరుబిడ్డ. బుగ్గలు సొట్ట బడుతూ. అయోమయంగా తగుస్థాయిలో ఏడుస్తుంటే ముద్దుగా వుంటుంది. కాని అదైనా హెచ్చుస్థాయిలో అయితే 'నోరుముయ్యి' అని అనిపిస్తుంది.

కాని ఏరోగములోనైనా, ఏ శ్రుతిలోనైనా ఆ ఏడ్చే ఏడ్పు అందంగా వుండేది. ఏ భామామణైనా ఏడ్చేటప్పుడే - సన్నస్థాయిలో మెల్ల మెల్లగా ఎక్కుడైన స్త్రీ ఏడ్చిందంటే చుట్టూ ఒకగుంపు మూగుతారు. "ఆడమనిషి ఏడుస్తుంది-ఎందుకో పాపము !" అని మహా సానుభూతి చూపెడుతూ చుట్టూ మూగుతారు. నిజంగా వాళ్ళకి ఆ ఏడ్చే వాళ్ళమీద దయకలిగా ? ఆ ఏడ్పు స్త్రీ ఏడుస్తున్నది గనుక. అది సహజంగా సంగీతము వలే అందరినీ ఆకర్షిస్తుంది.

సంగీతములో రకాలున్నట్లే ఏడ్పులో రకాలు లేక పోలేదు. స్త్రీఏడ్వనబడే సంగీతము రసవత్తరఘట్టాలలో జనించినప్పుడు, మరీ రసవత్తరంగా, రమణీయంగా, హృద్యంగమంగా వుంటుంది.

ఈ సంగీతానికీ రాగాలు లేకపోలేదు ఈ సంగీతము ఏ గురువువద్దనో నేర్చుకునేదికాదు. ఉదయము ఐదు గంటలకు లేచి పొరుగింటివారు నిద్రపోకుండా సాధన చేసేదీకాదు. నెలకు రూ 50 లు అర్పించుకొని మాష్టరు గారివద్ద నేర్చుకునేదీకాదు-ఈ సంగీతము సహజంగా జీవితంలో వస్తుంది. కష్టనష్టాలే గురువులు.

ఈ సంగీతమే స్త్రీల చేతిలోని బ్రహ్మాస్త్రమని కొందరు ఉక్రోషము పట్టలేక అంటారు. అబల చేతిలోని అస్త్రము కూడా సున్నితముగా వుపయోగించినా బ్రహ్మాస్త్రమై పోతుందని పెద్దలంటారు. ఈ బ్రహ్మాస్త్రము హైడ్రోజన్ బాంబు, ఆటంబాంబులవలే ఇతరులకెట్టి నష్టము కలిగించ

కుండానే తాము ఆశించినవాటిని సాధించిపెట్టగలదట. సత్యభామ ఈ అస్త్రముతోనే పారిజాతాన్ని సంపాదించినదట. అంటే ఈ అస్త్రము కొంచెము పాశుపతాస్త్రమువలె వేసినవారి దగ్గరకు తిరిగి ఫలితాన్ని తీసుకొని వస్తుందన్న మాట. సత్యభామకు పారిజాతము దొరికినట్టు లభిస్తుందని గ్రహించాలి ఒకప్పుడది కాసుల పేరు కావచ్చు, మరొకప్పుడది పండుగకు క్రొత్త చీరెకావచ్చు. అది ఏదైతే నేమి స్త్రీ ఆ బ్రహ్మాస్త్రము వేయగానే అది లభించుట తథ్యము.

ఈ స్త్రీల ప్రత్యేక బ్రహ్మాస్త్ర సంగీత రోదనమున్నదే—ఒక్కొక్కప్పుడు మాంచి రసవత్తరమైన ఘట్టాలతో దయానురాగ రసాలతో కూడుకొని వుంటుందట అది రసికాగ్రేసరులకు తప్ప తెలియక పోవచ్చునట. కొంత వరకైనా రసికతవుంటే అట్టిఘట్టాలలోని రమ్యత బాగా ప్రత్యక్షమై హృదయానికి ఆనందాన్ని కలిగిస్తుందట.

అందుకనే మానవులు, కవులు కథానాయకులు పనిగట్టుకొని స్త్రీలచేత, నాయికలచేత, ఆరున్నొక్క రాగముతో ఆలాపింప చేస్తారట..

ఈ చిత్తవృత్తి సామాన్య మానవులకు, సామాన్య కవులకే గాక మహామహులకూ ఇదే అలవాటు. కొందరు "కలస్వనంబుతో" ఏడ్పించితే, మరికొందరు "బాలపల్లవ గ్రాసకషాయ కంఠ కలకంఠివధూకల కాకలీధ్వని" తో ఏడ్పించారు. దానితోకూడా తృప్తిపడనివారు 'కిన్నెర వధూరాజత్కరాంభోజ కాంభోజీమేళ విపంచికారవ సుధా పూరంబు తోరంబుగా' ఏడ్చే కచ్చేరి చేయించి ఆ ఏడ్చే భామామణికి "సంగీతకళారహస్యనిధి" అని బిరుదు కూడా ఇచ్చారు.

ఈవిషయాన్ని కవులభాషలోచెప్పాలంటే రామకృషుని మాటల్లోనే చెప్పాలి.

"అల్లసానివాడు అల్లనల్లన యేడ్చె
ముక్కు తిమ్మన ముద్దుముద్దుగా యేడ్చె
భట్టుమూర్తి బావురుమని యేడ్చె"

అంతవరకూ బాగానే వున్నది కాని "సంగీత కళా రహస్యనిధి" బిరుదుకుపోటీపడి ఎక్కడపడితే అక్కడ కచ్చేరి పెట్టినా లాభముండదు. రికమెండేషను చేయించుకున్నా లాభముండక పోవచ్చును.

మామూలు సంగీతమైతే అందరికీ రాకపోవచ్చును గాని, ఈ పైరకము సంగీతముతో మన కందరికీ ఇంతో అంతో పరిచయజ్ఞాన మున్నది. కాని ఎప్పుడైన ఇటువంటివి ప్రదర్శించే వారికన్నా ప్రేక్షకులే ఆనందిస్తారన్న విషయము గ్రహించుకొని ఎల్లప్పుడు ప్రేక్షకులలో ఒకరుగానే వుండటము వివేకము.

ఉత్ప్రేక్ష

శ్రీ కన్నెకంటి ప్రభాకరశాస్త్రి

చేత కత్తినిబట్టి శ్వేత యశ్వమునెక్కి 'జాన్సీ' రణంబున జారునాడు
కొంగున ముడివేసి కొదమసింగంబుగా నాయకి నాగమ్మ నడచునాడు
స్వాతంత్ర్య సిద్ధికై సత్యాగ్రహముచేయ కస్తూరి ముందుకు కదలునాడు
సాహిత్య శంఖంబు చక్కగా పూరించి శ్రీ సరోజినిదేవి మసలునాడు
పుట్టి యుండక పోయితి పుడమియందు పుట్టి యుండిన పాడనే పుణ్యచరిత
హృదయ సాహిత్య సంగీత సదనమందు వీణతంత్రుల మీటుచు వేడుకలర!

భాషా సమితి బహూకృతినందిన :

శ్రీమతి పి. సీతారాజ్యలక్ష్మి



చిన్న వయస్సులోనే సాహితీ రంగంలో ముందడుగు వేసిన ఘనత శ్రీమతి సీతారాజ్యలక్ష్మికి దక్కుతుంది. మార్చి 1936 లో జన్మించిన యీ యువతిది ఏలూరు. అక్కడే సెయింట్ థెరిస్సా బాలికోన్నత పాఠశాలలో స్కూలుఫైనలు పరీక్ష వ్రాసయారు.

గుంటూరు స్నేహలతా వరకట్న నిర్మూలనా శాఖ ఆధ్వర్యం క్రింద ఏప్రెల్ '56 లో పోలూరు సత్య నారాయణ గారికీ, ఈమెకీ వివాహం జరిగింది.

అన్నగారి ప్రోత్సాహంతో పిల్లల కథొకటి రాసి, చందమామ పత్రికకు ప్రచురణార్థం పంపితే, వారు ప్రచురిస్తాం అని తెలియచేయడమే యీమె పిల్లలకై రచనలు సాగించడానికి తగినంత ప్రోత్సాహాన్ని యిచ్చిం దట. రెండు సంవత్సరాల క్రితం కల్గిన యీ వుత్సాహం పురస్కరించుకొని పోటీకై నాటికలని యీమె వ్రాశారు. చందమామవారు కథని ప్రచురించలేదు కాని, పోటీకై పంపిన నాటకాలు మటుకు విజ్ఞుల దృష్టిని ఆకర్షించి బహుమానాన్ని కొట్టుకొని వచ్చాయి.

బహుమతి పొందిన నాటకాలు ఆరు : కొయ్యగుర్రం; దేవరహస్యం; బడిగంటలు; గుడితలుపులు; తల్లీ-కొడుకూ; మణిప్రభావం అన్నవి. వీటిలో కొన్ని విజయ వాడ రేడియో కేంద్రంనుంచి ప్రసారితం అయాయి. కాల క్రమాన మిగిలినవి కూడ ప్రసారితం కావచ్చు. త్వరలోనే విశాలాంధ్ర ప్రచురణాలయం వారు యీ ఆరు నాటికలనీ పుస్తకరూపంలో తీసుకు రానున్నారు.

పిల్లలకి రాయాలనే ఉత్సాహం కల యీమె కలకాలం వర్ధిల్లి - పిల్లలని సంతోషపెట్టే ఎన్నెన్నో రచనలు చేయాలని ఆశిద్దాం.



స్వర్ణ కంకణం

గ్రహీత
శ్రీమతి రామలక్ష్మి ఆరుద్ర

ఈ సంవత్సరం గృహలక్ష్మి స్వర్ణకంకణము శ్రీమతి రామలక్ష్మి ఆరుద్రకు బహూకరింప బడినది. సాహిత్యము, లలితకళలు, సంఘసేవలలో అభినివేశముగలవారికి ఏటేట ఒకరికి ఈకంకణము బహూకరింపబడుటకు కీ. శే. కేసరి గారు ఏర్పాటు చేసిన విషయము అందరకు తెలిసినదే. వారి అనంతరము కూడ ఈ ఏర్పాటు కొనసాగిస్తున్న గృహలక్ష్మి సంస్థ ప్రశంసించ తగ్గది.

ఇదివరలో శ్రీమతులుకాంచనపల్లికనకాంబ, కనుపర్తి వరలక్ష్మమ్మ, ఉన్నవ లక్ష్మీబాయమ్మ, బెంగుళూరు నాగరత్నమ్మ, గిడుగు లక్షీకాంతమ్మ, వూటుకూరి లక్ష్మీకాంతమ్మ, కొమ్మూరి పద్మావతీదేవి మొదలుగాగల విదుషీమణులు ఈ కంకణముచే అలంకరింప బడినారు.

శ్రీమతి రామలక్ష్మి ఆంగ్లభాషయందు పట్టభద్రురాలే కాక, మాతృభాషయందు మిక్కిలి అభిరుచియు, రచనా సామర్థ్యమును గల తరుణి. పత్రికా రచనయందు ఆమెకు గల ఆసక్తి ప్రభుత్వోద్యోగమునుండి విరమింప జేసినది. అనేక పత్రికలలో వివిధ విషయములపై వ్యాసములనూ, కథలనూ రచించి యున్నది. స్వతంత్ర పత్రికయందు తన రచనా వైదుష్యమును కనుపరచినది.

ఈ స్వర్ణ కంకణమునకు తగియున్న శ్రీమతి రామలక్ష్మినీ, గృహలక్ష్మి సంస్థనూ అభినందించుచున్నాము.

★ కలసిన బంధువులు ★

కుమారి జంధ్యాల సరోజ

ఆ రోజు మధ్యాహ్నం కమలపాఠాలు చదువుకోటానికి రాలేదు. సరళా, విమలా వచ్చేరు. కమలకోసం కాస్సేపు ఆగారు, కానీ కమల ఎంతకీ రాకుంటే వాళ్ళిద్దరూ "మాకు చెప్పెయ్ యీవాళకి" అన్నారు నళినితో. నళిని స్కూలుఫైనలు పాసయింది. ఏదో తోటి స్త్రీలకి యింత సాయపడి వృద్ధిలోకి తేవాలని వాళ్ళకి తనకొచ్చిన చదువూ, సంగీతం, ఇంకా ఇతర విషయాలు ఎన్నో చెప్పేది. చదువుకున్నానన్న గర్వం నళినికి ఏకోశానాలేదు. వాళ్ళతో చాలా చనువుగా ఉంటుంది. కానీ వాళ్ళిద్దరికన్నా కమలకూ నళినికే చాలా స్నేహం. వాళ్ళా మాట అనగానే నళిని వాళ్ళకారోజు పాఠాలు చెప్పేసింది ఎట్లో.

సాయంత్రం నళిని కమల యింటికి వెళ్ళింది. కమల విచారంగా కూచునివుంది నళిని వచ్చేవేళకు. నళిని వెళ్ళి "ఏం కమలా అట్లావున్నావ్?" అనగానే కమలలేనినవ్వు తెచ్చిపెట్టుకుని "ఏంలేదే" అంది. "అదుగో ఏదో దాస్తున్నావు. ఈవేళ పాఠాని కెందుకు రాలేదు?"

కమల నళినితో చెప్పింది దాచి లాభంలేదని, "మా ఆయన ఇకమీదట మీయింటికి వెళ్ళవద్దన్నారు."

"ఎందుకూ?"

"అలా వెళ్ళటం ఆయనకేం బావులేదట. పరాయి వాళ్ళింటికెళ్ళి ఏం చదువులు? వాళ్ళింట్లో మగాళ్ళుండరా అన్నారు. ఇంకా వాళ్ళ చెల్లెలు ఇట్లాగే రోజూ ముగ్గులు నేర్చుకోడానికని వెళుతూండేదిట. ఆరోజు అట్లాగేవెళ్ళి ఇంతవరకూ అజాపజా లేదట. ఆయనకి ఆ చెల్లిఅంటే చాలా ప్రేమట. రోజులు బాగాలేవు వెళ్ళొద్దన్నారు"అని ముగించింది.

కమల చెప్పటం చాలిస్తూనే నళిని ఒక్కసారి ఎట్లాగో అయిపోయింది. భయం, ఆశ్చర్యం ఒక్కసారి ఆమెలో ఉద్భవించాయి. కమల నళినిని చూడలేదు. నళిని తర్వాత కొంచెంసేపు మాట్లాడి ఇంటికి వెళ్ళిపోయింది. నళిని కమల యింటికి ఎప్పుడన్నా వస్తూవుంటుందిగాని ఆమె భర్తను ఎప్పుడూ చూళ్ళేదు. నళిని ఇంటికెళ్ళి కుర్చీలో కూచుని ఏదో ఆలోచిస్తోంది. ఆమె స్మృతిపథంలో ఎన్నో ఆలోచనలు రేగుతున్నాయి. ఒక్కసారి ఆమె మనోవీధిలో గతం స్ఫురించేసింది.

2

నళినీ ప్రకాశరావూ హైస్కూల్లో చదివేరోజుల్లో క్లాసుమేట్సు. వాళ్ళిద్దరికీ ఒకరి హృదయాలు ఒకరికి తెలిశాయి. ఒకరి అభిరుచులు ఇంకొకరికి సరిపడ్డాయి. వాళ్ళిద్దరూ ప్రేమించుకున్నారు. కానీ యీ సంగతి పిట్టక్కూడా తెలీదు. నళిని స్కూలుఫైనలు పాసుకావటంతో ఆమె చదు వాగిపోయింది. పై చదువు ఆ వూళ్ళో లేని కారణాన. ప్రకాశరావు మాత్రం బస్తీలో కాలేజి చదువు సాగిస్తోన్నాడు. ప్రకాశరావూ నళినిని ప్రేమించాడు అన్న మాటే కాని అతనికి ఆమె విషయం తప్ప ఇంకెవ్వరీ సంగతీ తెలీదు. నళిని యింటివైపు క్కూడా వెళ్ళేవాడుకాదు.

ఒక్కసారి కాలేజి సెలవులకు ప్రకాశరావు వచ్చాడు. తండ్రి జబ్బుతోవుండి ప్రాణం విడిచాడు. ఇక అతనికి "నా" అనేవాళ్ళెవరూలేరు. ఆ వూళ్ళో తనదీ అని చెప్పుకోడాన్కి ఆ యిల్లొకటేవుంది. దాంతో అతడి చదువుకు "బ్రేక్" పడింది. నళిని రోజూ ముగ్గులు నేర్చుకోడానికంటూ వెళ్ళి ప్రకాశరావు యింటి కొచ్చేది. ప్రకాశరావు నీతి, నిజాయితీ ఉన్న మనిషి. అతడు నళినిని మనసారా ప్రేమించాడు. కానీ ఆమె తల్లిదండ్రుల్ని "ఆమెను తనకివ్వమని" అడిగే ధైర్యం లేకపోయింది. ఆమె చూస్తే ధనవంతుల బిడ్డ. తన కేముందిగనుక?

వాళ్ళు ఒక నిశ్చయానికొచ్చారు. బస్తీకెళ్ళి ఏదన్నా ఉద్యోగంలో చేరదామని. దానికి నళిని అంగీకరించింది. ఇద్దరూ చదువుకున్నవాళ్ళే. తమ బ్రతుకు గడుపుకోడానికి కష్టపడక్కర్లేదనే ధైర్యంతో రైలెక్కారు.

ప్రకాశరావు కాపూళ్ళో ఒక కంపెనీ మేనేజరు తెలుసు. అతడు ప్రకాశరావుకన్నా ఓ నాలుగేళ్ళు పెద్దవాడు. వాళ్ళిద్దరికీ అదేవూళ్ళో చదువుకునేరోజుల్లో స్నేహమైంది. ప్రకాశరావు ఇంటరులో ఉన్నప్పుడు అతను బి. యే. చదువుతున్నాడు. క్లబ్బులో వారికి బాగా స్నేహమైంది. వీళ్ళిద్దరికీ టేబుల్ టెన్నీసంటే చాలా యిష్టం. వాళ్ళకు తోడు లేకపోవటంతో బాగా స్నేహం పాతుకుపోయింది. అతను చదువులోనూ, ధనంలోనూ, ప్రకాశరావుకన్నా ఎక్కువే. అయినప్పటికీ అతడు ప్రకాశరావును పాణమిత్రుడుగా చేసుకున్నాడు.

ప్రకాశరావు వచ్చినరోజునే ఓ ఇల్లు చూచి అందులో నళినిని దిగబెట్టి నేరుగా తన స్నేహితునివద్ద కెళ్ళాడు. అతడు ప్రకాశరావునుచూస్తూనే ఆనందభరితుడైపోయి ఉద్యోగం లేకున్నా ప్రత్యేకంగా అతనికై ఒకటి కల్పించి అందులో ఇరికించాడు. ప్రకాశరావు చాలా వుత్సాహంగా వుంటూ పనిచేస్తున్నాడు. నళినికేపనిచెయ్యాల్సిన అవసరం లేకపోయింది. తర్వాత కొన్నాళ్ళకే ఇద్దరూ రిజిస్టర్డ్ మారేజి చేసుకున్నారు.

వాళ్ళ జీవితం హాయిగా నడిచిపోతూంది.

నళిని ఒక నిట్టూర్పు విడిచింది గతాన్ని తల్చుకొని. ఇంతలో వాకిట్లో బూట్లచప్పుడు విని ఆమె తలెత్తి చూచింది. బూట్లు విప్పుకుని కాళ్ళు కడుక్కొని గదిలో కొచ్చాడు. "ఏమండీ యివాళ యింత ఆలస్యం చేశారేం" అంది. "ఆఁ ఏం లేదు. మా ఆఫీసరుగారి భార్యకు ఓ ప్రయివేటు టీచరు కావాలిట. (ఆడ) అందుకోసం ఇంత ఆలస్యమైంది. మంచి సంస్కారం ఉన్న మనిషిలే. చదువురాని ప్రకృతిబడిలో పెరిగిన పల్లెపడుచును పెళ్ళాడేడు. ఇప్పు డీమెకు చదువుకావాలనుందిట.

నళిని కామాటలు ఒళ్ళంతా కంపరమెత్తించాయి. ప్రొద్దునో సంఘటన, ఇపుడు మరోటి. ఏమవుతుందో? యీనాటకం" అనుకుంది.

"ఏంనళినీ ఏమంటావు మరి?" అన్నాడు ప్రకాశరావు.

"ఏమిటండీ?"

నువ్వామెకు టీచరుగా పనిచేస్తావా?" నవ్వాడు ప్రకాశరావు. "ఓ మరి ఎప్పట్నుంచి చేరాలేమిటి?" ప్రశ్నించింది నళిని.

ప్రకాశరావన్నాడు "రేపాదివారంకదూ, రేప్రొద్దుట వాళ్ళింటికి వెళదాం" అని.

ఆరోజు ఆదివారం.

గిరిరావు భార్యతో అన్నాడు "నాఫ్రెండు ప్రకాశరావుకి చెప్పాను. ఒక ఆడ టీచర్ని వెతకమని. వా డీ రోజు వస్తాడు. ఏం చదువుకుంటావా? ఇక్కడికేవచ్చి చెప్పే ఏర్పాటు చేస్తాను" అన్నాడు.

కమల తలూపింది. కాని స్నేహభావంలో హాయిగా చదువుకోడంవేరు. యీవయసులో ఒక టీచర్ను జీతానికి పెట్టుకుని చదువుకోటం వేరు. ఆమె ఆలోచనల్లో పడ్డది.


పావుగంటగడిచింది. ఇంటిముందు ఏదో గుఱ్ఱపుబండీ ఆగింది. అందులోంచి ప్రకాశరావు దిగాడు. గిరిరావు ఎదురొచ్చి "ఏమిటీ ఒక్కడవే వచ్చావ్" అన్నాడు. "అదిగో వస్తోంది" అంటూ ప్రకాశరావు బండివైపు చూపించాడు. నళిని గుండెల్లో రైళ్ళు పరుగెడ్తున్నాయి. ఆమె బండి దిగి తలొంచుకుని నడుస్తూవుంది. గిరిరావు ఆమెవైపుచూస్తూ ఏదోగ్రహించిన వాడిలా కంగారయ్యాడు. "నువ్వా చెల్లీ" అంటూ వచ్చాడు. "అన్నయ్యా" అంటూ నళిని గిరిరావు కాళ్ళమీదపడింది. ప్రకాశరావు అన్నదగ్గరే పనిచేస్తున్నాడని నళినికి తెలీదు. ప్రకాశరావే నళినిని పెళ్ళాడేడని గిరిరావుకి తెలీదు. నళిని తన మేనేజరు చెల్లెలని ప్రకాశరావుకి తెలీదు. తన స్నేహితురాలు తనభర్త చెల్లెలని కమలకు ఏం తెలుసు?

సుజాత

కె. జలజ

పూర్వము 'సేనానిపురము' నందు సుజాత సత్యరయలను దంపతులు నివసించుచుండిరి. సుజాత అందాలరాశి. సుగుణాలప్రోవు. అసమాన పాండితీప్రకర్ష కలది. కళలయందు కల్పవల్లి. తన సర్వస్వమును భర్తసేవకు అర్పించిన సాధ్వీలలామ. ఈమె యాచకులను ఎన్నడూ మరువలేదు. ఎట్టివేళలైనను యాచకులు తనింటికి యేతెంచిన, ఆతిథ్యమిచ్చి గౌరవించెడిది. ఆదంపతులెన్నో సత్క్రియలు గావించిరి. కాని వారికి సంతానము కలుగలేదు.

సుజాత కాలమున దేశమంతటను భీకరక్షామము చెలరేగినది. ప్రజలు తిండిలేక తిప్పలుపడసాగిరి. త్రాగుటకు నీరులేక యెందరో ప్రజలు చనిపోయిరి. అట్టి క్షామమున సుజాత చలివేంద్రలు, అన్నసత్రములను నెలకొల్పినది. వచ్చినవారి కే కొరతలు లేక వారికోర్కెలను మన్నిస్తూ ప్రజలను కాటకమునుండి రక్షింప యత్నించుచుండెను. తన వొంటిమీది నగలతో సహా అన్నార్తులకై వెచ్చించిన సాధ్వీమతల్లి. దుర్భిక్షము పోయినది. వర్షములు కురిసినవి. దేశము మరల పాడి పంటలతో సుభిక్షమైనది. ప్రజలందరు అది యెంతయు సుజాత పుణ్యఫలమని ఆమెను వేనోళ్ళ కొనియాడిరి. సుజాతకు సంతానప్రాప్తి కలుగునని పెక్కు దీవనలిచ్చిరి. కొలది దినములకు సుజాత నోములు పండి ఒక శుభ ముహూర్తమున పుత్రుని కనెను. పుత్రుడు పుట్టిన పిదప ప్రజలతోపాటు తానును దైవదర్శనమునకు వెళ్ళెను. ఒక చెట్టుక్రింద మహాపురుషుని దర్శనమాయెను. సుజాత వినయ ప్రపత్తులతో ఆ పురుషునికి పాయసమును ఒక గిన్నెయందుంచి యిచ్చెను. ఆకలితోనున్న పురుషుడు ఆపాయసమును ఆప్యాయమున ఆరగించెను. సుజాత ఆ పురుషుని తేజస్సునకు అబ్బురపడి ఆతడు భగవంతుని స్వరూపుడని అనుకొనెను. ఆమె మనసునందలి సంకోచమును గ్రహించిన ఆ పురుషుడు తాను దేవుడనుకానని. తనపేరు సిద్ధార్థుడని తెలిపి శాంతి కలుగు మార్గమును చూపుమని ఆమెను అడిగెను. మానవుల మంచి చెడ్డల వలన సుఖదుఃఖములు ప్రాప్తించునని దానికై దైవమును నిందించుటవలన లాభములేదని సుజాత చెప్పెను. గౌతముడు సంతోషముతో యెంతో బుద్ధిగలవారమని విర్రవీగువారు నీకడకువచ్చి శాంతిమార్గమును యెరుగ వలయును అని చెప్పెను.



పుష్పాంజలి

చిత్రణ : శ్రీ వెల్లటూరి పూర్ణానంద శర్మ.

సర్వప్రాణులయెడ కరుణయు దయయుగల నీవంటి వారు ఉన్నంతకాలము విచారింపవలసినది యేదియులేదు. అని పెక్కురీతుల నామెను కొనియాడెను.

కొలది దినములు గడచినవి. తాను సేవించిన పురుషుడు బుద్ధుడని తెలిసికొని తనజన్మ సాఫల్యమైనదని సుజాత సంతోషించినది. ఆమె బ్రతికినన్నాళ్ళు సాటివారిని ఆదరించుచు కాలము గడిపినది. ఆమె దేవత్వమందినది. ఆమె ఆదర్శ జీవితము చిరస్థాయిగా మహిళాలోకమున వెలుగొందుచున్నది. ★

చీకటి - వెలుగు

కుమారి కొమ్మూరి ఉషారాణి

[మార్గరెట్ బాండ్‌ఫీల్డు సోమర్‌సెట్‌లో జన్మించింది. 1898 సం॥లో షాపు అసిస్టెంటు యూనియనుకి సహాయకార్యదర్శి అయింది. 1923 వ సం॥లో టి. యు. సి. అధ్యక్షురాలయింది. ఆ సంవత్సరమే శాసనసభలో ప్రవేశించింది. 1929 వ సం॥లో లేబర్ మంత్రి పదవి నలంకరించింది. రామ్సే మాక్డొనాల్డు కింద. కాబినెట్‌లో అడుగుపెట్టిన ప్రథమ స్త్రీ మార్గరెట్.

మనదేశం ఎన్నో విధాల మార్పు చెందుతోంది. చట్టదృష్ట్యా. సాంఘికదృష్ట్యా. స్త్రీల పరిస్థితి ఎంతో అభివృద్ధి చెందుతోంది. కానీ. స్త్రీలు ఎంతమటుకు తమకి లభించిన అవకాశాలు సద్వినియోగం చేసుకుంటున్నారు అనేది సమస్య అయి కూర్చుంది. స్త్రీల మనసుల్లో బోలెడంత అనుమానం, అవిశ్వాసం, అసంతృప్తి మిగిలివున్నాయి. ఏది అభ్యుదయం ? ఏది పురోభివృద్ధి ? నాచుట్టూ జరుగుతున్నదేమిటి ? నేను యింకా ఎక్కడ వున్నాను ? అని బాధపడుతున్న స్త్రీలోకానికి మార్గరెట్ ఆత్మకథ ఒక మణిపూసలాటి సందేశాన్ని అందిస్తుంది.]

నా జీవితం ఒక క్రమ పద్ధతిలో, సాఫీగా గడిచిపోలేదు. జీవితంలో అడుగడుగునా నన్ను ఎన్నో విచిత్ర సంఘటనలు, యిబ్బందులు చుట్టు ముట్టాయి. కానీ, వాటి వల్ల నాలో నైరాశ్యం, పిరికి తనం కలగలేదు. ఆ కష్టాలు, యిబ్బందుల వల్ల నేను ప్రపంచపు విలువలని గురించి ఎంతో తెలుసుకో గలిగాను. నాకు నేనుగా ధైర్యంగా కొన్ని నిర్ణయాలు చేసుకోవటం, ఎటువంటి క్లిష్ట పరిస్థితిలోనైనా ఆత్మ విశ్వాసంతో మెలగటం నేర్చుకున్నాను.

నేను ఒక సామాన్యమైన మధ్యతరగతి కుటుంబంలో పుట్టాను. మా నాన్న ఒక ఫ్యాక్టరీలో పనిచేస్తుండే వాడు. మా తల్లి తండ్రులకి మేము పదకొండు మంది పిల్లలము. మా కుటుంబ మంతా ఒకేచోట స్థిరపడకుండా, చెల్లా చెదరై పోయింది. అయిదేళ్లు నిండకముందే నేను నా అమ్మమ్మ దగ్గిర కొన్నాళ్లు, తర్వాత మా పెద్దక్కయ్య దగ్గిర కొన్నాళ్లు గడిపాను. ఒక చోట నిలకడ లేకుండా పెరుగుతుండటం వల్ల, నాకు చదువు సంధ్యలు సరిగా అబ్బలేదు. నా ఎనిమిదవ ఏట నాన్నకి హఠాత్తుగా ఉద్యోగం పోయింది. దాంతో మా కుటుంబ పరిస్థితులు మరింత విషమించాయి.

ఆ తర్వాత ఒక బోర్డు స్కూలులో చేరి, నేను చదువు ముగించాను. ఓ మాటు శలవులకి అక్కయ్య దగ్గిరకి, బ్రైటన్ వెళ్లాను. అక్కడ అక్కయ్య స్నేహితురాలొకావిడ, తన బట్టల దుకాణంలో నాకు వుద్యోగమిస్తానంది. అప్పటికి నాకు పదహారేళ్లు. దుకాణంలో పని చాలా కష్టంగా వుండేది. ఒక్క ఆదివారాలు మటుకు కాస్త విశ్రాంతి తీసుకునేందుకు వీలయేది. ఖర్చులకి పోగా, చేతిలో అట్టే డబ్బు మిగిలేది కాదు. కానీ కుటుంబ పరిస్థితులని బట్టి, కష్టమో సుఖమో నా కాళ్ళమీద నేను నిలబడ వలసిన

అవసరం కలిగింది. నా పరిస్థితిని పూర్తి గ్రహించుకుని, లేనిపోని నిరాశలు, దిగుళ్లు పెట్టుకోవటం మానేశాను.

ఆ తర్వాత కొన్నాళ్ళకి నా వుద్యోగం పోయింది. ఇక నా అవస్థలకి అంతులేదు. ఎక్కే గుమ్మం, దిగే గుమ్మం. ఏ ఆఫీసులోనూ నాకు పని దొరకలేదు, ఎన్నో సిఫారసులతో ప్రయివేటు కంపెనీల చుట్టూ తెగ తిరిగాను. కానీ లాభం లేకపోయింది. మూడు నెలలపాటు అష్ట కష్టాలు పడ్డాను. ఒక్కొప్పుడు కడుపునిండా తిండి కూడా వుండేది కాదు.

చిట్టచివరికి ఒక దుకాణంలో ఉద్యోగం దొరికింది. అక్కడి జీవితం చాలా సరదాగా వుండేది. ఎంతో మంది స్నేహితులు దొరికారు. గొప్ప వారితో పరిచయం కలిగింది. దుకాణంలో పని చేసే కార్మికులకి ప్రత్యేకం ఒక క్లబ్బు ఏర్పాటు చేశారు. నేను అందులో మెంబరుగా చేరాను. నేను, నాదుకాణమే కాదు, నా చుట్టూ జరుగుతున్న దేమిటి, మన రాజకీయ, ఆర్థిక పరిస్థితులేమిటి అని ఒక్కొక్క విషయాన్నే గురించి ఆలోచించడం మొదలు పెట్టాను. అంతే కాదు! కార్మికుల పరిస్థితి మార్పు చెందాలనీ, దేశ రాజకీయ, ఆర్థిక వ్యవస్థల్లో ఏదో లోప ముందనీ నా హృదయం ఆరాట పడేది. ప్రతి నెలా ట్రేడ్ యూనియన్ పత్రికకి ఒక వ్యాసం రాసి పంపేదాన్ని, హాస్టలులో చాలా మంది అమ్మాయిలకి నా భావాలు, యూనియన్‌లో నేను సభ్యురాలిగా చేరటం, గిట్టేవి కావు. బహిరంగంగా నన్ను విమర్శించటం, తూలనాడటం మొదలుపెట్టారు. కానీ నేను అవేమి పట్టించుకోకుండా, దులుపుకు తిరిగేదాన్ని. కొన్నాళ్లకి దుకాణంలో పనిచేస్తున్న తతిమ్మా అమ్మాయిలు నాకు బాగా సన్నిహితులయారు. పోను పోను వారిలో ఒక విధమైన మార్పు కనిపెట్టాను. చాలా మంది అమ్మాయిలకి ఉద్యోగం పట్ల, స్వతంత్ర జీవనం పట్ల ఆసక్తి సన్నగిల్లింది. త్వరగా వివాహం చేసుకుని, స్వతంత్రంగా బ్రతకదలచుకున్న స్త్రీ ఎదుర్కోవలసిన కష్టాల నుండి పారిపోవాలని తాపత్రయ పడేవారు. నాకు మటుకు ఆ తత్వం నచ్చలేదు. ఒక సారి సముద్రంలోనికి దూకాక, అది నన్ను ఎటువైపుకి కొట్టివేస్తుందో చివరంటా చూడా లనిపించింది.

1896 వ సం॥ లో వుమన్సు ఇండియన్ కౌన్సిలు వారు, స్త్రీ కార్మికుల పరిస్థితి పరిశీలించేందుకు నిశ్చయించారు. అందులో నేను రెండేళ్ల పాటు పరిశోధకురాలిగా నియమింపబడ్డాను. ఆ పని నాకు ఎంతో తృప్తినీ ఉత్సాహాన్నీ యిచ్చింది. ఆ తర్వాత 1898 వ సం॥ నుంచీ వరుసగా పదేళ్లు నేను యూనియన్ అధ్యక్షురాలిగా పనిచేశాను. ఆ పదేళ్లలోనూ నేను ఎన్నో పుస్తకాలు చదివాను. ఎంతో విజ్ఞానం ఆర్జించాను. జి. బి. షా, విలియమ్ మారిస్, వెబ్బు, బ్రౌనింగు, టెన్నిసన్ మొదలు టాల్‌స్టాయి, హెచ్. జి. వెల్సు, బ్రాంటీ, జేన్ ఆస్టిన్—ఒకటేమిటి ఎన్నో పుస్తకాలు చదివాను. అంతే కాదు; ఎస్. డి. ఎఫ్, సభ్యురాలిగా జి. బి. షా, ఆనీ బెసెంట్, కాతరిన్ గ్లాసియర్ మొదలైన మేధావులతో కలసి పనిచేశాను. వారి స్నేహ సంపర్కాలు నాలో ఎంతో మార్పు తెచ్చాయి. నా భావాలకి, ఆశయాలకి ఒక రూపం కల్పించాయి. సోషలిస్టు భావాలపట్ల నాకు ప్రత్యేక అభిమానం ఏర్పడింది. లేబర్ పార్టీలో చేరి, ప్రప్రథమంగా రాజకీయాలలో అడుగుపెట్టాను.

ఓ రోజు ఆదివారం చర్చికి హాజరుకానందుకు మత గురువు నన్ను చివాట్లు పెట్టాడు. యూనియన్ సమావేశానికి వెళ్లాననీ యిక ముందు కూడా నెలకి ఓ మాటు సమావేశానికి వెళ్ళవలసి వస్తుందనీ చెప్పాను. అతను కళ్లెఱ్ఱచేశాడు. అయితే చర్చికి రానవసరం లేదని పొమ్మన్నాడు.

నా ఆశ్చర్యానికి అంతులేదు ! దానితో మళ్ళీ ఇరవై సంవత్సరాల వరకూ నేను చర్చి ప్రాంగణంలో అడుగుపెట్టలేదు. అంత మాత్రాన భగవంతుని పట్ల, భక్తిపట్ల నాకు విశ్వాసం నశించిందని కాదు. రాజకీయంగా, ఆర్థికంగా ఎన్నో ఒడిదుడుకులనీ, హెచ్చు తగ్గులనీ ఎదుర్కొంటున్న ఈ విశ్వమంతా నాదే-ఈ ప్రజలందరూ నా వాళ్లే— వాళ్ల శాంతి సౌఖ్యాలు, పవిత్రత నావే- అనే ఒక విశాల దృక్పథం ఏర్పడి, జీవితాంతం వరకూ భగవంతుని పట్ల నా విశ్వాసానికి అదే ప్రతిబింబంగా నిలిచి పోయింది. నన్ను నేను మరచి పోగలగటం, యితరులని విమర్శించక పోవటం, ఏ పనినైనా సంపూర్ణ హృదయంతో చేయగలగటం — యివే నాకు మితిలేని శాంతి సౌఖ్యాలనిస్తాయని నమ్మాను. యూనియన్ మూవ్మెంటు, లేబర్ పార్టీ, కోఆపరేటివ్ మూవ్మెంటు, ఈమూడు సంస్థలలోనూ నిర్విరామంగా కృషిచేశాను. అలాంటి అవకాశం దొరికినందుకు ఎంతో గర్వపడ్డాను.

బాహ్య ప్రపంచంలో అడుగు పెట్టి, ఒక స్త్రీగా, సాంఘిక సేవకురాలిగా, విప్లవ కారిణిగా, ఎన్నెన్నో కష్టాలు అనుభవించాను. ఎంతో జీవతాన్ని చవి చూచాను. జీవితం నుంచి నేను నేర్చుకున్న దేమిటి? అని ఒక్క సారి వెనక్కి తిరిగి చూసుకుంటే, చప్పున కొన్ని విషయాలు స్ఫురిస్తాయి. అధర్మం, అన్యాయం, అవినీతి అనేవి కేవలంనీచసంస్కారానికి చిహ్నాలవంటివి. ఆత్మని చంపుకుని, అథఃపాతాళానికి దిగజారటం వంటివి. అంతేకాదు; ఎదటివారి లోపాలనీ, దౌర్బల్యాలనీ విమర్శనా దృష్టితో దుయ్యపట్టటంలో అర్థంలేదు. వారి చుట్టూ వున్న వాతావరణాన్ని, పరిస్థితులని గమనించి, వీలయినంత వరకు వారికి చేయూతనివ్వాలి. వారిని ఆ సుడిగుండాల నుంచీ, అవాంఛనీయ వాతావరణం నుంచీ పైకిలాగి, తోడ్పడేందుకు ప్రయత్నించాలి. లేకుంటే మనుష్యులు ఒకరికొకరు దగ్గిరగా జరగలేరు. ప్రేమించుకోలేరు. మానవులంతా ఒక్కటే అన్న పరమ సత్యాం గ్రహించగలగటం మన జీవితానికి ఒక కొత్త బలాన్ని చేకూరుస్తుంది.. జీవితంలో ఓ కొత్త అందాన్ని ఒలకబోస్తుంది. జీవితంలో సుడిగుండాలు, అవమానాలు, ఆవేదనలు కనపడవు. బ్రతుకంతా ఒక వెన్నెల బాటగా, ఉత్సాహంగా, ఆనందంగా గడచి పోతుంది.

సందేహడోల

శ్రీ పణతుల రామచంద్రయ్య

స్వాతి సమయ పవిత్ర ఝుంఝూ
పాత ఫలముగ గర్భమందు వి
శుద్ధమౌక్తికములను దాల్చెడి
శుక్తి కేలా గర్భ విచ్ఛిత్తి?

భీకరతమో వలయి తాఖిల
లోకముల సద్యోతితీక్ష
శోభతో నలరించు శంపా
జ్యోతికేలా తత్‌క్షణక్షయము?

సాంద్ర సికతాస్థలుల హల్లీ
సకము లాడుచు దివ్యతీర్థ
ప్రదేశమ్ములఁ బాఱు గంగా
నది కదేల దురధ్వ పాతమ్ము?

తల్లి యొడిలో తరుణపల్లవ
తల్పమం దాడుచు సమీర కు
మారులకు సౌరభము పూసెడి
మల్లికేలా మరణ పాశమ్ము?

మహిళా సమాజాలు

"మహిళా మండలి"

గురజాల

గుంటూరు జిల్లా పల్నాడు తాలూకాకు ముఖ్య కేంద్రమైన గురజాల గ్రామంలో స్త్రీ జనాభ్యుదయంకొరకు మహిళామండలి క్రిందటి నెలలో స్థాపించబడ్డది. ఈ మండలికి శ్రీమతి లంకా అఖిలాండేశ్వరమ్మగారు అధ్యక్షురాలుగను, శ్రీమతి నున్నా ప్రసూనాంబగారు కార్యదర్శిగను ఎన్నికయినారు. శ్రీమతులు కల్యాణి, సుశీల, నాగేంద్రమ్మ, రాజేశ్వరి గార్లతో కార్యనిర్వాహకవర్గము ఏర్పడినది. ఇరువదిమంది సభ్యురాండ్రు మండలి కార్యక్రమములలో వుత్సాహముతో పాల్గొనుచున్నారు.

ప్రస్తుతం, కుట్టుపని, ఎంబ్రాయిడరీ నవారు నేత మొదలగు గృహ పరిశ్రమలు సభ్యురాండ్రు అభ్యసిస్తున్నారు. ప్రతి అదివారము ఒక్కొక్క సభ్యురాలిచేత ఒక్కొక్క విషయమును గూర్చి వుపన్యాసము ఏర్పాటు చేయబడును.

వెనుకబడ్డ ప్రాంతమైన పల్నాడులో ఇదే ప్రథమ మహిళా సంస్థ. ప్రభుత్వ సహాయముతో, పౌరుల సహకారముతో మహిళా సంక్షేమ కార్యక్రమముల నొక్కొక్కటిని కడుత్వరలో ప్రారంభింప చేయనుత్సహించుచున్నారు.

13-4-57 న ఇందుపల్లి గ్రామములో మహిళా క్లబ్ ప్రారంభోత్సవము

కృష్ణాజిల్లా, గన్నవరం తాలూకా ఇందుపల్లి గ్రామములో వీరవల్లి బ్లాకువారు మహిళా క్లబ్‌ను స్థాపించారు.

వీరవల్లి బ్లాక్ మహిళాశాఖ నిర్మాణకర్త్రయగు శ్రీమతి యం. ఆర్. సరస్వతమ్మగారు ప్రారంభోత్సవమును జరిపిరి.

సమావేశమునకు గన్నవరం తాలూకా మహిళా సంఘ కార్యవర్గ సభ్యురాలు శ్రీమతి పెనుమకూరి లక్ష్మీకాంతమ్మగారు అధ్యక్షత వహించారు. గ్రామ సంఘ కార్యదర్శిని శ్రీమతి గద్దే సీతామహాలక్ష్మమ్మగారు గత నాలుగు సంవత్సరాలుగా మహిళా సంఘం ప్రసూతి శిశుపోషణాలయం, మహిళా సంక్షేమశాఖను నెలకొల్పవలసినదిగాను చేస్తూవచ్చిన ఆందోళన, సాధించిన విజయాలను గురించి సమీక్షిస్తూ ప్రభుత్వమువారు నేటికి యీ క్లబ్‌ను స్థాపించి కుట్టు యంత్రాన్ని, అల్లిక పరికరములను, ఆటవస్తువులను సరపరా చేసినందులకు కృతజ్ఞతను తెలియజేశారు.

బ్లాక్ మహిళా ఆర్గనైజరు గారు ప్రభుత్వం గ్రామాలలో క్లబ్‌లను ఏర్పాటు చేయుటలో గల ఉద్దేశాలను విపులీకరించారు. గ్రామపంచాయిత్ బోర్డువారి ఆర్థిక సహకారంతో గ్రామ స్త్రీలు క్లబ్‌ను ఏర్పాటు చేసుకోగలిగినందులకు సంతోషాన్ని వెల్లడిస్తూ ప్రతిదినము స్త్రీలు తమ విరామ సమయములో క్లబ్‌కు విచ్చేసి కుట్టుపని, అల్లిక పనులు నేర్చుకోవలెననియూ, గ్రంథాలు, పత్రికలు అధ్యయనం చేసి తమ విజ్ఞానాన్ని వృద్ధిచేసుకోవాలని విజ్ఞప్తి చేసిరి. పిమ్మట జిల్లా సంఘం అధ్యక్షురాలు ద్రోణవల్లి అనసూయగారు ఇదివరకు క్లబ్‌లనేవి పట్టణములకే పరిమితి అయి వుండేవనియూ, నేడు ప్రభుత్వము వీటిని గ్రామాలకు కూడా విస్తృతపరచడం చాలా సంతోషమన్నారు. క్లబ్‌లను ఏ కొద్ది గ్రామములకో గాక ప్రతి గ్రామానికి వీటిని వ్యాప్తిజేసి స్త్రీలకు వృత్తిపనులు కలుగజేయవలసినదని, స్త్రీల విజ్ఞానస్థాయి పెంపొందించుటకు తగిన అవకాశాలను కలుగజేయవలసినదిగనూ కోరిరి. అనంతరం సమావేశ అధ్యక్షురాలు క్లబ్బులకు నవారుమగ్గములు, కాగితపు పరిశ్రమ సబ్బు తదితర చేతిపనులకు సంబంధించిన పరిశ్రమలకు అవుసరమైన పరికరములను సరఫరా జేసి, తయారైన వస్తువులకు వాణిజ్య సౌకర్యములను కలుగజేయవలసినదిగాను విజ్ఞప్తి చేస్తూ గ్రామీణ స్త్రీలు క్లబ్‌కు నిత్యము హాజరై సద్వినియోగపరచుకోవాలని కోరిరి.

పిమ్మట ఆహ్వాన సంఘంవారి అభివందనములతో సభ సమాప్తమైనది.

తదుపరి సభికులకు తేనేటివిందు చేయబడినది.

మహిళా సంఘము

శ్రీకాకుళము

అధ్యక్షురాలు పదవికి జిల్లా కలక్టరు సతీమణికు శ్రీమతి జయలక్ష్మీ సుందరేశన్ గారి పేరును శ్రీమతి గుడివాడ సూర్యాకాంతముగారిచే ప్రపోజు చేయగా

శ్రీమతి దిగుమర్తి సువర్ణాబాయిగారు బలపరచిరి. ఆటు పైని సభ్యులు ఏకగ్రీవముగా జయలక్ష్మీ సుందరేశన్ గారిని అధ్యక్షురాలుగా సంఘమునకు ఎన్నుకొనిరి. సంఘ సెక్రటరీ అగు శ్రీమతి గుడివాడ సూర్యకాంతముగారు మన సంఘమునకు జయలక్ష్మీగారి పేరులోనున్నటువంటి జయము, లక్ష్మీ కలుగుననియు, మన సంఘమునకు శాశ్వత భవనము ఆమె అధ్యక్షురాలుగా ఉన్నప్పుడే తయారు అగునని ఆశించుచున్నానని చెప్పిరి.

తరువాత సుమారు 15 దినములనుండి జరుగుచున్న ఆటల పోటీలలో గెలిచిన సభ్యులకు సంఘ అధ్యక్షులు జయలక్ష్మీ సుందరేశన్ గారిచే బహుమతులు పంచడమయినది.

సంఘసభ్యులగు కుమారి డి. రేవతి, కుమారి కె. కమల, కుమారి డి. ఉమ, కుమారి ఎల్. లక్ష్మీగార్లచే "అరాంగి", "ఇంటిగుట్టు" అను రెండు నాటికలు వేయబడినవి. కుమారి వై. నరసుబాయి గారిచే గానకచేరి చేయడమయినది.

తదుపరి కార్యదర్శిని అగు శ్రీమతి గుడివాడ సూర్యాకాంతమ్మ గారిచే వందన సమర్పణ చేయడమయినది.

భారతసేవక సమాజం - మహిళాశాఖ

గుంటూరు

వికలాంగుల శరణాలయం

వికలాంగుల శరణాలయ విద్యార్థులు మార్చిలో అస్పృశ్యతా నివారణా ప్రచారమును బుర్రకథరూపంలో, బుడంపాడు, లాం, తక్కెళ్ళపాడు, ఉప్పలపాడు నారాకోడూరు, ఎటుకూరు, గోట్టిపాడు గ్రామాలలో ఉత్తేజవంతంగా జరిపారు. ఆంధ్రప్రదేశ్ హరిజన సంక్షేమ డైరక్టరు శ్రీ యాగంటిగారు జిల్లాకలెక్టరు శ్రీ గ్విన్ గారు ఈ కార్యక్రమాలకు హాజరైనారు. తరువాత శాంతపేటలో పండరీపురం మహిళాశాఖవారి ఆధ్వర్యమున హరిజనులతో సహపంక్తి భోజనములు జరిపినారు ఈ సందర్భమున జిల్లా కలెక్టరుగారు, మునిసిపల్ కమీషనర్ గారు, ఇంకా ఇతర పురప్రముఖులతో హరిజన వాడలో సమావేశము జరిపిరి. అస్పృశ్యతా నివారణకై భారతసేవక్ సమాజ జిల్లాకన్వీనరు శ్రీ డాక్టరు వీరయ్యా చౌదరిగారు, మహిళా కన్వీనరు శ్రీమతి ఆవుల జయప్రదా సాంబశివరావుగారు. సమాజ ఆదర్శములకై కృషిసలిపిరి.

బాలవిజ్ఞాన, వినోద సంఘ మహిళాశాఖల వార్షికోత్సవములు

మండపాక

ది. 15-5-57 తేదీన మండపాక బాలవిజ్ఞాన వినోద సంఘ మహిళాశాఖ వార్షికోత్సవము శ్రీమతి దేవరకొండ భాస్కరమ్మగారి భవనంలో శ్రీమతి చర్ల సుశీలమ్మగారి (మహిళా సంఘాధ్యక్షురాలు, నిడదవోలు) అధ్యక్షతను జయప్రదంగా జరిగింది. శ్రీమతి వై. భానుమతి బి. ఎ. బి. ఎల్. గారు 'మహిళా సరస్వతిని' గూర్చి కూలం కషంగా ఉపన్యసించారు. శ్రీమతి ఇ. లక్ష్మీదేవి యమ్. బి. బి. యస్. గారు ఆరోగ్య సరస్వతిని గూర్చి స్త్రీల-ఆరోగ్య విషయములపై ఉపన్యసించినారు. అధ్యక్షులు తమ ఉపన్యాసంలో ఈ గ్రామంలో నడుపబడుచున్న మహిళాశాఖ కార్యక్రమమును గూర్చియు, అందలి కార్యవర్గ సభ్యులనుగూర్చి వివరపరచి, భవిష్యత్తులో ఈ సంఘం స్త్రీ జనాభ్యుదయాన్ని సాధించగలదని ఆశీర్వదించారు. పిదప సంఘకార్యదర్శి శ్రీ అనిపెద్ది వెంకటరత్నం మహిళాశాఖా నిర్వాహకులు శ్రీమతి దేవరకొండ భాస్కరమ్మగారు వందనసమర్పణ చేశారు. సభకు పలువురు స్త్రీలు హాజరైరి.

15-5-57 తేదీ రాత్రి శ్రీ యర్రమిల్లి నరసింహారావు గారి అధ్యక్షతను బాలలకు వార్షికోత్సవం జరిగింది. శ్రీ గోవెళ్ళ రామమూర్తి శ్రీ ఎన్. నరసింహారావు. శ్రీ వడ్లమాని సోమశేఖరంగార్లు భాష, క్రీడ, హిందీసారస్వతముపై ఉపన్యసించిన పిదప సంఘబాలురు "శ్రావణభాద్రపదములు" అన్న నాటికను ప్రదర్శించారు.

అనాథ బాలబాలికలకు ఉచితపాలకేంద్రం

ఏలూరు బాలానందంవారి ఆదర్శకృషి

ఏలూరు బాలానంద సంఘ భవనములో మే 14 న వుదయం 9 గంటలకు జిల్లాకలెక్టరుగారి సతీమణి శ్రీమతి కె. యస్. ప్రకాశరావుగారు ఉచిత పాలకేంద్రానికి ప్రారంభోత్సవం చేశారు. బీద బాల బాలికలకు పాలు, నెయ్యి పోశారు. ఆసందర్భంలో ఆంధ్రప్రదేశ్ గవర్నరుగారి సతీమణి శ్రీమతి కుసుంత్రివేది గారి భూరి విరాళంతో వారు కోరిన ప్రకారం అనాథ బాలబాలికలకు, స్త్రీలకు నూతన వస్త్రదానం చేశారు.

కలెక్టరుగారి సతీమణి తమ ఉపన్యాసంలో—"ఏలూరు బాలానంద సంఘం తన మూడేళ్ళ జీవితంలోనే చాలా ఘనకార్యాలు సాధించింది. ఇది ఆటపాటలకే పరిమితం కాకుండా శారీరక. మానసిక, వికాసాలకు ఎంతో కృషి చేసింది. నిజానికి, ఈ సంఘం ఆదర్శ సంస్థగా రూపొంది, పట్టణ బాలికల సమష్టి శ్రేయస్సుకు అత్యంత శ్రద్ధాసక్తులతో అవిరళకృషి చేస్తున్నది. కాని ఈసంఘానికి ఒక స్వంతభవనం, అంటూలేక పోవటం విచారకరమే! నేను ఈ సంఘభవనానికి, సంఘాభివృద్ధికి అన్నివిధాలా చేయూతనిచ్చి సహకరించడానికి ప్రయత్నిస్తాను" అని వాగ్దానం చేశారు.

సంఘాధ్యక్షురాలు శ్రీమతి మూల్పూరి చుక్కమ్మగారి వందన సమర్పణతో ఉత్సవసభ జయప్రదంగాముగిసింది.

భారత జాతీయ మహిళాసమాఖ్య

ద్వితీయమహాసభకు సన్నాహాలు—

ఆహ్వానసంఘం ఏర్పాట్లు

జూన్ 5-9 తేదీలలో విజయవాడలో జరుగనున్న మహిళాసభకు సన్నాహాలు చేసేందుకు విజయవాడ భారత మహిళామండలి భవనంలో సమావేశానికి కృష్ణా, గుంటూరు పశ్చిమగోదావరిజిల్లాలనుండి వివిధరంగాలలోను, వివిధ వృత్తులలోను వున్న స్త్రీలు పాల్గొన్నారు.

విజయవాడ భారతమహిళామండలి సహాయకార్యదర్శిని శ్రీమతి వి. నారాయణమ్మగారు అధ్యక్షత వహించారు దేశమును ప్రేమించుమన్నా అనే గురజాడ వారిగీతముతో సమావేశము ప్రారంభమైనది. కృష్ణాజిల్లా మహిళాసంఘ అధ్యక్షురాలు శ్రీమతి ద్రోణవల్లి అనసూయగారు భారత మహిళాసమాఖ్య కార్యక్రమము. అదినడిపినఉద్యమాలు, సాధించినవిజయాలు, ముందుతీసుకోవలసిన కార్యక్రమాలు వివరించారు. విజయవాడ పట్టణమహిళాసంఘ కార్యదర్శిని శ్రీమతి జోస్యభట్ల సుబ్బమ్మగారు మహాసభప్రాముఖ్యతను వివరించి, మహాసభ ఏర్పాట్లను, నిర్వహించవలసిన కర్తవ్యాలను గురించి తెలియజేశారు.

ఆహ్వానసంఘమునకు శ్రీమతి తోలేటి శేషమ్మగారు (వర్కింగుకమిటీ మెంబరు, హిందీ ప్రేమీ మండలి, రాజమండ్రి) అధ్యక్షులుగను, శ్రీమతి ద్రోణవల్లి అనసూయ గారు కార్యదర్శినిగను, శ్రీమతి కాట్రగడ్డ వెంకటలక్ష్మి గారు కోశాధికారిణిగను, ఇంకా ఏడుగురు ఉపాధ్యక్షులు గను, 25 గురు సభ్యురాండ్రుగను ఎన్నుకొనబడిరి. ఆహ్వాన సంఘ అధ్యక్షురాలు శ్రీమతి తోలేటి శేషమ్మగారు మాట్లాడుతూ ఐక్యమహిళా ఉద్యమ ఆవశ్యకతనుగూర్చి వివరించారు. జాతీయ గీతము 'జనగణమన' గానంతో సభ ముగిసింది.

సంక్షేమం



ANDHRA MAHILA
JUNE '57 (SAMKSHEMAM)

దారిచూపిన దీపకళికలు:

శ్రీమతి సరోజినీనాయుడు

(1879—1949)

డాక్టరు సరోజిని నాయుడు 1879 ఫిబ్రవరి పదమూడవ తేదీన జన్మించింది. ఈమె తల్లినుండి మానవదయార్ద్రితనీ, కవితాత్మక హృదయాన్ని; తండ్రివద్దనుండి ప్రజాసేవ ఇంకా ఇంకా తెలుసుకోవాలనే తృష్ణనూ పుణికిపుచ్చుకుంది.

దారిద్ర్యం, మూర్ఖత, కులభేదాలు, సాంఘిక దుస్థితులు దేశంపై వాని చెడ్డప్రభావం బాల్యంనుండీ తెలుసుకొని బాధపడుతుండేది. పెద్దయిన తర్వాత వాని నెదుర్కొనడానికి నడుము కట్టినది.

ఈమె తన మతమునకుగాని కులమునకుగాని చెందని డాక్టరు ఎమ్. గోవిందరాజులు నాయుడుని పెండ్లాడడమే, బూజుపట్టిన హిందూధర్మాలను మొట్టమొదటిసారిగా ఎదురుకొనడం. హిందూ సంఘాన్ని ఒంటరిగా చేసివేసిన కులమతభేదాల్ని ఈ విధంగా ఛేదించి ముందడుగు వేసింది.

శ్రీమతి సరోజిని మతమునకు ఎటువంటి ప్రత్యేక గౌరవమును ఈయలేదు. ఈమె హిందూ ముస్లిములను వేర్వేరుగా చూడలేదు. ఈ సౌజన్య భావానికి కారణం ఆమె ముస్లిమ్ ప్రదేశమైన హైదరాబాదున పెరగటమే అయియుండవచ్చు. ఈమె హిందూ ముస్లిమ్ ఐక్యతకొరకు జీవితాంతం పాటుపడింది. హిందూ ముస్లిమ్ సమావేశాలలోని ఆమె ఉపన్యాసాలు ముస్లిముల పట్ల ఆమెకున్న సహృదయతను, ఓర్పును చాటుతాయి. కుల మత సమైక్యతా విషయాలలో ఈమెపై గాంధీజీకి పరిపూర్ణ విశ్వాసముండేది. "ఇండియా ఐక్యతను నీకు అప్పజెప్పుతున్నాను" అని ఆయన 1922 లో జైలు వెళ్ళుతూన్నప్పుడు ఆమెతో అన్నారు.

సరోజినీదేవి సంఘసేవా తత్పరత బహుముఖమైనది. హిందూ స్త్రీల హక్కుల పోరాటంలో ఈమె ఒక ముఖ్య సైనికురాలు. స్త్రీల సుక్షేమంలో ఈమె ఆసక్తివారి అనేక అవసరాలపై కేంద్రీకరించబడింది. బాల్య వివాహాల వ్యతిరేకి యీమె

1919 లో స్త్రీలకు వోటింగు హక్కుకోసం అప్పుడు ఇండియాకు సెక్రటరీ ఆఫ్ స్టేట్‌గానున్న ఇ. ఎస్. మాంటేగ్ వద్దకు ఒక డెలిగేషనును తీసుకొని వెళ్ళింది. జెనీవా ఇంటర్నేషనల్ కాన్ఫరెన్సునకు ఇండియా ప్రతినిధిగా యీమె 1920 వ సంవత్సరములో వెళ్ళినది. 1930 వ సంవత్సరం అఖిలభారత స్త్రీల సమావేశానికి అధ్యక్షత వహించింది. 1931 లో లండనులో జరిగిన రౌండు టేబిల్ కాన్ఫరెన్సుకు హిందూ స్త్రీల ప్రతినిధిగా వెళ్ళింది.

భారత స్వాతంత్ర్యసిద్ధి తర్వాత ఈమె యు. పి.కి గవర్నర్‌గా నియమింపబడినది. ఈమెయే ప్రప్రథమ స్త్రీ గవర్నర్. ఈమె 1949 వ సంవత్సరం మార్చి రెండవ తేదీన స్వర్గస్థురాలైనది.

తెలుసుకోదగిన

మా ముందుచూపు



శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్

సంవత్సర సంచిక రోజులు వచ్చాయంటే సంస్థకు స్టాక్ చెకింగు, ఛైర్మన్ సమావేశాలు బోర్డు మీటింగులు క్రొత్త సంవత్సరం మొదటవుండే సాధారణమైన తొందర లన్నీ వుంటాయి. ఏప్రెలు నెలలో చేసిన పనులను గూర్చి ముందు జరిపించబోయే పనులను గురించీకూడా యోచిస్తూవుంటాము.

1957 ఏప్రెలు మాసం మాకొక సవాల్‌ని విసిరింది. మా పల్లె కార్యక్రమాల విస్తరణను విపరీతంగా భారీ చెయ్యడమే ఈ ఛాలెంజి. కమ్యూనిటీ డెవలెప్‌మెంటు వారు సూచించినట్లు స్త్రీల, పిల్లల, శారీరకంగా అవధ్యులైనవారి సంక్షేమ కార్యక్రమాన్ని కమ్యూనిటీ డెవలెప్‌మెంటు బ్లాకులలో ప్రారంభించవలసి వుంటుందని మాలో చాలా మందికి తెలుసు. ప్రధానిచే అధ్యక్షత వహించబడ్డ సెంట్రల్ కమిటీ ఆఫ్ ప్లేనింగు కమిషన్ ఈ సూచనను ఆమోదించింది.

మా భుజాలను సువిశాలం చేసుకుంటున్నాము:

మా భుజాలను విశాలం చేసుకొని కొత్త బాధ్యతలను మాపై వేసుకుందుకు నిర్ణయించుకొన్నాము. ఈ విషయం మాకు ప్రయాణ ప్రారంభంలోనే స్పష్టమైంది. ఇంత ఎక్కువైన పనిని మాకు అప్పగించారంటే, విశ్వాసం, పల్లెటూళ్ళవారు వారిలోనుండి నేర్చుకొన్న విశ్వాసాన్ని నిరూపిస్తుంది. కొత్తరూపులో మావల్ల జరుగవలసిన పనిని మేమే పూర్తిగా అర్థం చేసుకొనవలసివుంది. హిందూదేశపు స్త్రీలు వారి కాలాన్ని, శక్తినీ ఇండియాలోని అతిపేద స్త్రీలు, పసిబిడ్డ, అవధ్యుడు లాభం పొందేటందుకు సద్వినియోగం చేయడానికి సన్నిద్ధులని తెలియజేయడానికి మనమందరంకూడా మనలోని ప్రతి అణువుని ఈ విషయంలో ఉపయోగించడానికి ధారపోయాలి.

ఏప్రిలు 1957 నుండి నూరు కమ్యూనిటీ డెవలెప్‌మెంటు బ్లాకులలో స్త్రీలు, పిల్లల, అవధ్యుల (చెమిటి, గ్రుడ్డి, కుంటివారు) సంక్షేమం ప్రారంభించవల్చాము. ఈ సంవత్సరం అక్టోబరు నాటికి మరియొక నూరు బ్లాకులు మా అధీనం క్రిందకు వస్తాయి. ఒక బ్లాకు అంటే నూరు గ్రామాలని మీరు తెలుసుకున్నప్పుడు వెంటనే వేయి గ్రామాల సంక్షేమం అమలులోనికి వస్తుందనీ మా బాధ్యత ఎంత పెద్దదో మీకు తెలుస్తుంది. శీతాకాలం ప్రవేశించే నాటికి ఇది రెట్టింపు అవుతుందని కూడా మీకు తెలుస్తుంది.

వెంటనే తెలిసే ఈ పథకం యొక్క ఫలితాలు; (1) ఏప్రిలునుండి ప్రారంభించబడు ప్రతి కమ్యూనిటీ

ప్రారంభించబడుతుంది. (2) అమలులోనున్న పథకం ప్రకారం ఇరవైఐదు గ్రామాలతో పనిచేసే ప్రతి డబ్ల్యు. ఇ. పి. ఇకమీదట నూరు గ్రామాలతో పనిచేస్తుంది.

గ్రామంలో ఆరోగ్యం :

పల్లెలలో ఈ కొత్త నిర్వహణ కార్యక్రమం ఎలా జరుగుతుందో తెలుసుకోవాలని మీకు సహజంగావుంటుంది. బ్లాకు ప్రాంతంలో సి. డి. సిబ్బందితో ఎలా పనిచేయాలనేది తెలుసుకోవాలని వుంటుంది. అందుచేత సాధారణంగా సి. డి. బ్లాకులో ఏమేమి అందుబాటులో వుంటాయో తెలుసుకోవాలి. ఒక డాక్టరు, లేడీ హెల్తు విజిటరు, నలుగురు మంత్రసానులువున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఒకటి ప్రతి బ్లాకులోనూ వుంటుంది. వీరందరు వుండుటచే మనము జీతాలిచ్చి సిబ్బందిని నియమించవలసిన పనిలేదు. ముందునుండీ అలవాటుగా పెట్టుకొంటున్న ఐదుగురు దాయీలను మాత్రం పెట్టుకుంటే సరిపోతుంది. ఈ విధమైన కలయికవల్ల పల్లె ఆరోగ్యరక్షణలు అభివృద్ధి చెందడం, కమ్యూనిటీ డెవలెప్‌మెంటు ప్రక్కన ఇదివరకు అసాధ్యమైన ఇంటింటికి పోయి చూడడం వంటి నిశితమైన పనులకుకూడా మంచి అవకాశం వుంటుంది.

కమ్యూనిటీ డెవలెప్‌మెంటు బ్లాకు ప్రత్యేకంగా సహాయం చేయగల్గింది విద్యారంగంలో. ఇదివరకటిలాగే ఒక సాంఘిక విద్యానిర్వాహకురాలు ఇద్దరు గ్రామ సేవికలు అందరూ శిక్షితులే నియమింపబడతారు. నిర్వహణ విషయంలో వీరు జీతాలు పుచ్చుకొందుకు శలవులు సరిగా పొందడానికి బి. డి. ఓల క్రిందనే వుంటారు. మిగిలిన అన్ని విషయాలకి ప్రాజెక్టు ఇంప్లిమెంటింగు కమిటీ క్రిందవుంటారు. మీ సిబ్బంది నియామకం ముందువలెనేవుంటుంది. కాని ఇప్పుడు అందరూ కలిసి మొత్తం ముప్పై ఒక్క మంది సభ్యులుంటారు. అందుచేత పదిమంది గ్రామసేవికలు, ఇద్దరు చేతిపని నిపుణులు వుంటారు. కొద్ది గౌరవవేతనముతో పదిమంది స్థానిక స్త్రీలు బల్వాడీస్, అక్షరాస్యతా విషయాలలోను సహాయకురాలుగా వుండడానికి నియమింపబడతారు. పైన చెప్పబడిన ఆరోగ్యశాఖ సిబ్బందియేకాక వారిపై అజమాయిషీకి ఒక ముఖ్య సంక్షేమ నిర్వాహకురాలు, ఒక సాంఘిక విద్యానిర్వాహకురాలు వుంటారు.

ఒక పెద్ద మార్పు :

ఒక ప్రోజక్టుకు ఐదు కేంద్రాలనే మా వుద్దేశ్యం మార్పు చెందవలసివుంది. ఒక్కొక్క స్త్రీ సేవిక ఐదు గ్రామాలను చూచుకోతగ్గట్టు తగిన స్థలాల్లో ఇరవై మంది ఫీల్డు పనివారిని ఐదుగురు దాయిలను సరిగా నియమించవలసి వుంటుంది. ప్రసూతి కేంద్రాలకు అందుబాటులో వుండేటట్లు ఈ ఐదుగురు దాయిలని నియమించాలి. ఒక్కొక్కరు ఇప్పటికంటే ఎక్కువ పరిసరాలను సందర్శించాలి.

క్రొత్తపథకాల ఆర్థిక విశదీకరణలలోనికి ఇప్పుడు పోవలసిన పనిలేదు. రాష్ట్ర ప్రభుత్వాలు, పి. ఐ. సిల భాగాలు సమంగా అలాగే వుంటాయిగాని చందాలు వసూలుచేసే ప్రదేశాలు ఇంకా ఎక్కువ చేయవలసి వుంటుందని చెప్పక తప్పదు.

కొత్తపథకంలో నూరు గ్రామాలకొక డబ్ల్యు. ఇ. పి జీపు ఇవ్వబడుతుంది. ఇది ఎక్కువగా ఫీల్డువర్కర్ల అందుబాటులోనే వుంటుంది.

గ్రామంలో అవధ్యులు :

మీకు ఇంకా ఆసక్తి కల్గించే విషయం ఇంకొకటి అవధ్యులకోసరం వేయబడుతున్న కార్యక్రమాలు. మా సిబ్బంది సభ్యులు అన్ని స్థలాల్లోను పర్యటించి, గుడ్డి, చెమిటి, కుంటివారలకు, మానసికంగా వెనకబడ్డ పిల్లలకు ఎటువంటి సహాయమవుసరమో తెలుసుకోగల్గారు. సి. డి బ్లాకుల పరిమితులలో పైన చెప్పబడినవారికి, చిన్న చిన్న సంస్థలను ప్రారంభించడం పల్లెలతో సహతలమైన పనులతో అభివృద్ధికరమైన ఐకమత్యముతో సులభతరమౌతుందని అంచనా వేస్తున్నాం. ఇది చెప్పుకోతగినంత పెద్ద విషయమేకాని వారికి సహాయం చేయడానికి మనమందరము వారి సమస్యలనుగూడా క్షుణ్ణంగా చదువుకొని సుశిక్షితులుగావాలి. బధిరాంధులను గూర్చి ఎక్కువగా చెప్పిన ఈ మధ్య వచ్చిన "సాంఘిక సంక్షేమం" పత్రికలు ఈ అవుసరానికి నిదర్శనలు.

ప్రతి ఒక సి. డి బ్లాకు ఈ క్రొత్తపథకం క్రింద నూరు గ్రామాలను చూస్తుంది కనుక ఒక ప్రత్యేకమైన పి.ఐ.సి కూడా వుంటుంది. ఈ విధమైన పి.ఐ సిలో, ఒక ఛైర్మను, సి. ఎస్. డబ్ల్యు. బి చే ఎన్నుకోబడిన ఆరుగురు సభ్యులు, ముగ్గురు అఫీషియల్ సభ్యులు (ఒక బి. డి. ఓతో కల్పుకొని) బ్లాకు సలహాసంఘం [illegible]

హృదయం సువిశాలం కావాలి:

మనముందు ఏమున్నదో మీకు తెలుసు. మన మనసులను, ప్రణాళికలనుకూడా సువిశాలం చేసుకొని, అనుకోని కంటేకూడా ప్రవయుక్తకరం అయిన ఫలితాల కోసం తాపత్రయపడాలి. ఇంతవరకు సద్వినియోగం చేసుకోని అన్ని ప్రభుత్వ సహాయాలను ఇప్పుడు సద్వినియోగం చేసుకోవాలి. ఉదాహరణకి మీలో ఎంత మంది అఖిలభారత చేతిపనుల సంస్థకు వెళ్ళి మీమీ లలితకళలను అభివృద్ధి పర్చుకొందుకు అమ్మక విషయాలలో సలహాలను పొందారు? ఇప్పుడు సహాయంచేసే అధికారులవద్దకు పోయి మీరు సలహాలు పొందవచ్చు. చాలా మంది అఖిలభారత ఖాదీ, గ్రామ పరిశ్రమలబోర్డు వద్ద సహాయాలను పొందారు. ఇంకా చాలా మంది ఇప్పుడు సహాయం పొంది, వారి నిపుణుల సలహాలను క్రమంగా పొందవచ్చును. క్రొత్త అంబరుచర్ఖా ప్రణాళిక మనముందువుంది.

మీమీ కేంద్రంలో కూర్చొని సలహాలనివ్వడమే పని అని అనుకోకండి. క్రొత్త నిర్వహణ పద్ధతిలో క్రొత్త సమస్యలున్నాయి. ఇదివరకటికంటే ఇప్పుడు మా బాధ్యతలు, పనికూడా ఎక్కువ అయ్యాయి. ప్రతి సి.ఎస్.డబ్ల్యు.బి అనధికార సభ్యునకు దగ్గర దగ్గరగా నున్న రెండు, మూడు రాష్ట్రాలు అప్పచెప్పబడుతాయి. ఆమె పర్యటనచేసి, మీకు మా పథకాలను తెలియజెప్పి, మీకూ మాకూ మధ్య రాయబారిగానుండి, రాష్ట్ర సంస్థల కష్టాలను తెలుసుకొని కేంద్ర సంస్థతో తగిన రీతిని సంప్రదించి రాష్ట్ర, కేంద్ర బోర్డులకు, ప్రభుత్వాలకి మధ్యనున్న బాంధవ్యాలను గట్టి పరుస్తుంది. ఈ కార్యక్రమం పల్లెలకు మాత్రమే నియమితంగాక రాష్ట్ర పరిధిలోనున్న సంస్థలన్నిటికి చెందుతుంది. వారి బాధ్యతలతో అందజేసే శిక్షణ సదుపాయాలనుకూడా తమ దృష్టిలో వుంచుకుంటారు.

ప్రతియొక్క రాష్ట్ర సంస్థ సభ్యురాలికి కొంత నియమితమైన పరిధి అప్పచెప్పబడి ఒక్కొక్కరికి తమ రాష్ట్రములోని కొన్ని జిల్లాలు ఇవ్వబడుతాయి. ప్రతి పి.ఐ.సి సభ్యురాలుకూడా కొన్ని గ్రామాలు, కొన్ని కేంద్రాలు చూచుకొంటుంది. మాలో ప్రతి ఒక్కరికి నియమితమైన పని, హద్దువుంటుంది. ఈ విధంగానైనా కొన్నికొన్ని ప్రాంతాలలో పి.ఐ.సి ఛైర్మను కొందరు సభ్యులు ఎదుర్కొన్న కష్టాలవంటివి తగ్గుతాయని ఆశిస్తున్నాం. కొన్ని స్థలాల్లో పి.ఐ.సి ఛైర్మను కొద్ది మంది సభ్యులూ ప్రోజక్టు బాధ్యతలను పూర్తిగా పైన వేసుకొని పనినంతా చేస్తూంటే మిగిలినవారు తమ తమ విధులను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు.

ఎంతో వెనుకన వున్నాం:

ఒక ఐచ్ఛికసేవకుని వద్దనుండే ఆశింపదగ్గదానికంటే కూడా వెనకబడివున్నామని ఈ విషయాలన్నింటివల్ల తెలుస్తోంది. మేము చేయడం ద్వారా నేర్చుకొంటున్నాము. సేవయొక్క ఉద్యోగస్తోమతలను మాలో చాలా మంది నేర్చుకున్నారు. చాలామంది వారి విశ్రాంతి సమయాలు, పనివున్న సమయాలు చాలా భాగం భావి భారతదేశానికి ఆయువుపట్టయిన గ్రామ కార్యక్రమ నిర్వహణలకు వినియోగించారు.

మన ప్రజలందరు ఈ ప్రోజక్టులు ఏవిధంగా పని చేస్తాయి అని తెలుసుకొందుకు మనం ఉపకరించాలి. ఓర్పుతో వారికి విశదీకరించాలి. కలిసి పనిచేయడం ద్వారా ఏదైతే ప్రోజక్టు అని చెపుతున్నామో అదే గ్రామ పునరుద్ధరణకు, కమ్యూనిటీ డెవలెప్మెంటుకు ఇండియాలోని అన్ని రాష్ట్రాలను తనలో నిముడ్చుకొని ముందుకు తీసుకుపోయే ఒక ఉద్యమంగా మారగలదని వారికి తెలియజెప్పాలి. మనముందు ఒక ఘనత వహించిన క్రొత్త సంవత్సరంవుంది.


హైందవ కుటుంబంలో చిన్న పిల్లలు

ప్రొఫెసర్ యం. యం. దేశాయ్
(టాటాస్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్)

ఏ దేశంలోనైనా యువజన మూర్తిత్వము, ఆ దేశము యొక్క వ్యక్తిగత, సాంఘిక శక్తుల ప్రభావముచే "జాతీయశీలము" క్రింద ఘనీభవిస్తుంది. ఏ దేశపు వయోజనమూర్తిత్వాన్ని దాని ఆశయాల్ని, భయాల్ని, రక్షణలను, సంతోషాలనుబట్టి తెలుసుకోవాలంటే ఆ దేశంలో ప్రతి యింటిలోను దేశం మొత్తంమీద పసిపిల్లల జీవితాలను పరిశీలించవలసివుంటుంది. విశాల ప్రపంచంలో జ్ఞానవంతులైన వ్యక్తులక్రింద పరిగణించబడాలంటే వారు కుటుంబాలలో పెంచబడే విధానాలనుబట్టి వుంటుంది. పిల్లయొక్క వయస్సు, ఆడపిల్లో, మగపిల్లో, వాని మానసిక, భౌతిక పరిణామాలనుబట్టి వారిపై పెద్దవారి ఆదరాభిమానాలు పెంచే విధానమూ ఆధారపడి వుంటాయి. ఇదేవిధంగా వారి స్వీయమూర్తిత్వము, ఆచారాలు, అలవాట్లు, సాంఘిక సంప్రదాయములు మొదలైన వానిని బట్టి పెద్దవారి మాతృత్వ అనుభూతులు, ఆశయాలు ఆధారపడివుంటాయి.

దురదృష్టవశాత్తు సువిశాలమైన భారతదేశంలో పిల్లల అంతర సంబంధాల పరిశోధనకు ఎక్కువ అవకాశాలున్నా చాలాతక్కువగా సరియైన పరిశోధనలు జరిగాయి. అందుచేతనే ఇప్పుడు సువిస్తృతంగా విడమర్చి చెప్పే వివరాలన్నీ హిందూ కుటుంబములోని పిల్లలతో సన్నిహిత అనుభవముతో వ్రాసినవేకాని నిర్ణయించబడ్డ విషయాలు కావని తెలుసుకొనడం ముఖ్యం. ఇక్కడ ఉదహరించబడిన కొన్ని ప్రదేశాలు నిర్లక్ష్యము చేయబడిన ఈ విషయాలలో పరిశోధనలు చేయాలనే వుత్సాహాన్ని కల్గి

సాంప్రదాయకంగా విశాలమైన హిందూ కుటుంబం సాంఘికంగాను, ఆర్థికంగాను, మతసంబంధాలతోను దగ్గరగా అల్లబడిన ఒక సంఘము. ప్రస్తుతకాలపు జీవితాలవల్ల లేచిన సమస్యలవల్ల ఈవిధమైన కుటుంబాలు క్రమక్రమంగా తలిదండ్రులు పిల్లలు మాత్రమే వుండే చిన్న చిన్న కుటుంబాలక్రింద విడిపోతున్నాయి. అందులోను ముఖ్యంగా పెద్ద పెద్ద పట్టణాలలోను నగరాలలోను ఈవిధంగా జరుగుతోంది. సమిష్టికుటుంబాలలోని సామాన్య సంప్రదాయాలు, సామాన్య మతం, సాంఘిక అలవాట్లు, భౌతికంగా తరతరాలుగా వస్తూండడంచేత వుద్రేకపూరిత సంబంధాలను మార్చుకోవడం అంత సులభంకాదు. సమిష్టికుటుంబపు సభ్యులు పుట్టుకలు, చావులు, వివాహాలు, మతసంబంధమైన, సాంఘిక వుత్సవాలు మొదలైన సందర్భాలలో ఇంకా కలుస్తూనే వున్నారు. పల్లెటూరిలోని చిన్న స్థలంగాని ఇల్లుగాని ఇటువంటి సమావేశాలకు అనుకూలంగా వుంటోంది. అక్కడికి వెళ్ళకుండా ఆసభ్యులు వుండలేరు, ఈవిధమైన పెద్దకుటుంబములో పెంచబడిన బిడ్డ, అన్నివయస్సుల ఆడ మగ సభ్యుల మధ్య పెరగడంచేత సంఘంలో ఎలాజీవించాలో తెలుసుకొంటాడు. అందుచేత జీవితంలో ఎక్కువ నమ్మకము స్థిరమైన అనుభవము పొందగలుగుతాడు. హిందూ పిల్లలు వారి కుటుంబములలో జీవించటమంటే కుటుంబములోని ఇతరులతో కలసి జీవిస్తారన్నమాట. పెద్దవారు దుకాణాలకి వెళ్ళినపుడుగాని స్నేహితులను చూడడానికి వెళ్ళినప్పుడుగాని పిల్లలను



వారు సాధారణంగా ఒంటరిగా ఒదలబడరు. ప్రేమాభిమానాలు, సుఖదుఃఖాలు అన్నీకూడా సర్వసాధారణంగా అందరికీ చెందినట్లు అందరూ ఒక్కటైనట్లుగానే కనిపిస్తాయి. ఉద్రేకాలు అణచివేసుకునే అవసరంలేదు. ఎల్లప్పుడూ వానిని బయటపెట్టవచ్చు. అందరితో పాలు పంచుకోవచ్చు. ఈవిధంగా వుద్రేకాలను అనుభవించి వేయడంమూలంగా పిల్లలలోగాని పెద్దలలోగాని వుద్రేకపూరకమైన మానసిక సంక్షోభం కలిగే అవసరం తగ్గిపోతుంది. తను అందరిని ప్రేమించవచ్చు. తనకు అందరి ప్రేమా లభ్యమౌతుందనే ఆశవున్నప్పుడు మానసికంగానూ భౌతికంగానూ ఏవిధమైన అవధ్యతలువచ్చినా కూడా ఒకవిధమైన ధైర్యం కలుగుతుంది. వారి వుద్రేకాలు, మానసిక అనుభూతులు వారి పెరిగే జీవితాలలో భాగాలే అయినా ఒక్కొక్క సమయాలలో వారి మనస్సులను మేఘావృతంచేసి, వారిదృష్టిని మందపరచి. వారిని వారు అరికట్టుకోవడం. స్వీయవిమర్శలలోకూడా అంతరాయం కల్గించవచ్చు. హిందూ కుటుంబంలో పిల్లవాడు సాధారణంగా అందరిచేతులలోను ఎత్తుకోబడి ముద్దుపెటుకోబడతాడు. పెదవారి దగరగా తానుపొందే భౌతిక అనుభూతివల్ల తన చుట్టూవుండే మానవ ప్రపంచపు విలువలను క్షుణ్ణంగా తెల్సుకోకల్గుతాడు. ఈమాదిరి అనుభవాలు వుయ్యాల మంచాలలోను ప్రత్యేకస్థలాలలోను పెంచబడే పిల్లలు పొందుతారు.

హిందూ దేశంలో సాధారణమైన పిల్లవాడు చాలా తక్కువ వయస్సులోనే పెద్దవాళ్ళ కార్యక్రమాల్లో పాల్గొనడానికి నేర్చుకొంటాడు. తన చిన్ని చెల్లెలిని చూసుకోవడం. తల్లి బంధువుల ఇంటికి వెళ్ళినపుడు తమ్ముని ఆడించడం, తల్లికి ఇంట్లో చిన్న చిన్న పనులలో సహాయపడడం, సాంఘిక, మతసంబరాలలో పాల్గొనడం మొదలైన వాటిలో పాల్గొనడం మూలంగా పెద్దల జీవితంలో అన్నిరంగాలలోను భాగం పంచుకుంటూ పిల్లలప్రపంచానికి, పెద్దవారి ప్రపంచానికి వంతెనకట్టి, తన భావిజీవితానికి స్వభావసిద్ధమైన పద్ధతులలో బాధ్యతలను స్వీకరించడానికి అనువుగా వుంటుంది. తల్లి, తండ్రి మాత్రమేకాక ఎక్కువమంది సభ్యులున్న కుటుంబంలో పెరిగి, జీవించే అవకాశం వుండడంవల్ల పిల్లవాని ప్రేమ ఇదరిపెకీ కేంద్రీకరించబడక [illegible]

అవకాశం కల్గుతుంది. దీనివల్ల తల్లీ, తండ్రీ అనిమాత్రమే చేసుకొనే పిల్లవాని విపరీత భావాలు అరికట్టబడతాయి. మేనత్తలు, పినతండ్రులు, అమ్మమ్మ, తాత మొదలైన వారుంటే, పిల్లవానికి తల్లి దండ్రుల ప్రేమ కొంచెం తగ్గినా బాధ వుండదు. వారి నిర్లక్ష్యం, వదలవేయబడడం, దూషణలు అంతగా బాధించవు. కుటుంబంలోని సన్నిహిత బాంధవ్యంవల్ల తల్లి, తండ్రులపై కేంద్రీకరించబడే వుద్దేశాలు కుటుంబంపై కేంద్రీకరించబడతాయి. కుటుంబ గౌరవాన్ని నిల్పడం, వంశమర్యాదల్ని పాటించడం, కుటుంబానికి తగినట్లు ఆత్మబలి చేయటం మొదలైనవి ఆదర్శ హిందూ కుటుంబానికి తగిన హంగులు. కుటుంబం మీద అధికప్రేమ, పిల్లలమీద అధిక అభిమానం వుంటే అది మంచిదేకాని, ఒక్కొక్కప్పుడు పిల్లలు ఒకరిమీద ఆధారపడి వుండడానికి అలవాటు పడిపోతారు. అందుచేత సాహసాలు, ప్రయోగాలు చేయాలనే ఆసక్తి వారిలో నసించుతుంది. ఒక్కొక్కప్పుడు కుటుంబ బాధ్యతలు తమపైకివస్తే కుటుంబశక్తులకు ఎదురుతిరగాలనే ఇచ్ఛ పుడుతుంది. కుటుంబంతో విడిపోవడం అనుకోకుండాగాని, బలవత్తరమైన ఉద్రేక పూర్వక అసంతృప్తివల్లగాని, ఒత్తిడివల్లగాని జరిగితే, పిల్లవాని మనసు అందులోను కౌమారావస్థలో రాజకీయ నిర్వహణలు, ముఠాలు, మతవిషయిక ఆశ్రమాలు మొదలైనవాటి వైపుకు ఎక్కువగా మరలిపోతుంది. ముఖ్యంగా పనివానికి కుటుంబంలోని వారితో గట్టి అభిమానము ఆదిలోవుండి, అది క్రమముగా అసూయ ద్వేషములక్రింద మారి, పెద్దలయెడ నిర్లక్ష్యభావము పెరిగి ఈవిధమైన పరిస్థితులలోనికి దారితీయును. చిన్నతనంలో ఎక్కువ పెద్దలపైన ఆధారపడి వారికి దగ్గరగా నుండి, క్రమేణ సంప్రదాయ పద్ధతులలోనున్న జీవితంలోని ఉద్దేశాలు, పంథాలు మొదలగువానితో సంఘర్షణ పడి, తన నిదానమును కోల్పోతున్న కళాశాల విద్యార్థులు ఇండియాలో కొరతగాలేరు. ఇదే విపరీతరీతులలో పెద్దవాళ్ళు చెప్పినట్లు పతనావస్థయని అది సాధారణంగా సంప్రదాయకంగాగాని, వ్యక్తిగత గడచిన జీవితాలనుండి కాని వస్తుందని అనుకోవాలి.

హిందూ కుటుంబములోని పిల్లవాడు పెద్దవాళ్ళతో కలిసి జీవించడంచేత చిన్నతనంనుండీ బాధ్యతలను స్వీకరించడంచేత నిశ్చింతాయుతమైన బాధ్యతారహితమైన జీవితం జీవించే అవకాశం వుండదు. అతని వయస్సుకు తగనిరీతిలో ఆలోచించి మసులుకోవడంచేత చిన్న వయస్సులోనే అన్నీ తెలిసినవానిలాగా కనుపిస్తాడు. కాని పెద్దల మధ్య పిన్నలమధ్య నున్న అగాధమునకు వంతెనవలె ఈ అనుభవము పనిచేస్తుంది. అందులోనూ కుటుంబముతో అతని సంబంధము గరిష్ఠమైనదైతే మరీను. తమ తమ పిల్లలయొక్క కొత్త ఉద్దేశాలను అనుభవాలను పాత ఆచారయుతమైన అలవాట్లను తొలగించుకొని కూడ పెద్దవారు క్రమక్రమంగా ఎంతో ఆసక్తితో ప్రవేశపెట్టుతూండడం చూస్తే ఆశ్చర్యంగా వుంటుంది. క్రింద చెప్పబడే ఉదాహరణ ఇందుకు చక్కని నిదర్శన. రోహిత్ కళాశాలకువెళ్ళే ఒక ఇరవై ఏండ్ల యువకుడు, ఇరవై ఏండ్లక్రిందట అతని కుటుంబం బొంబాయికి తరలివచ్చింది. అతని తల్లి ఇంట్లో వంట చేయడానికి హిందువుకు తప్ప ఎవ్వరూ పనికిరారని ఆచారానికి తగదని ఒప్పుకొనేదికాదు. రోహిత్ పెద్దవాడై కాలేజీకి వెళుతూన్నప్పుడు ఒక మహమ్మదీయ బాలునితో స్నేహమైంది. మొదట్లో అతని మహమ్మదీయ స్నేహితుని ఇంటికి తీసుకురావడానికి వీలయేదికాదు, నెమ్మదిగా ఇంటికి తీసుకువచ్చేవాడు. అప్పుడు ఇంటికి వచ్చిన అతిథికి టీ ఇవ్వకుండా వుంటడం మర్యాదకాదని టీ, బిస్కట్లు ఇవ్వడానికి వప్పుకొంది. కాని అతను తిన్న పాత్రలు దూరంగా వుంచివేయాలని షరతు పెట్టింది. ఈపద్ధతికూడా అట్టేబాగులేదని కొంచెం రోజులలోనే తెల్సుకుంది. పాత్రలు కలిసిపోవడం మొదలు పెట్టాయి. రోహిత్ తక్కిన స్నేహితులను ఎలా ఆదరిస్తాడో ఈ మహమ్మదీయ స్నేహితుని కూడా అలాగే చూచే అవకాశం క్రమ క్రమంగా కలిగింది. చాలా ఆచారవంతురాలు అవడంచేత తన వస్తువులను మాత్రం వేరుగా పెట్టుకొనేది. తల్లికిగాని, రోహిత్‌కుగాని, స్నేహితునికిగాని ఈపద్ధతిలో ఏమీ విపరీతము కనిపించలేదు. ఈవిధంగా యువక తిరుగుబాటులలోని ఒక సాధారణ ముఖ్యఘట్టం చక్కగా పరిష్కరింపబడింది. ఒకరి నొకరు చక్కగా అర్థంచేసుకొనిపోతే కలసి జీవించడం ఎంతో సంతోషదాయకం.

అణకువ, తలిదండ్రులయందు గౌరవముచూపించడం విషయాలలో ఒత్తిడి వల్ల చాలా మంచి నడతను కనుపర్చినా ఒక్కొక్కప్పుడు స్తబ్ధత్వం కనపడుతుంది. వుయ్యాలలోనుండి స్మశానంవరకూ తనను ఒక సంఘం సంరక్షిస్తూ, తన జీవితనిధానం, దైనందిన కార్యక్రమం పెద్దవాళ్ళు నిర్ణయిస్తూ, పారంపర్యంగా వస్తూన్న జీవిత విధానం తప్పించి మరి యేపద్ధతిని తెలుసుకోకుండా

పూర్వం జరుగుతూ వుండేది. కాని ప్రస్తుతం ఇది సంభవంకాదు. మానవుని అనుభవాలను విస్తరింపచేయడానికి ఒకరి అనుభవాలను మరియొకరికి తెలియజేసే సౌకర్యాలు విపరీతంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఏండ్ల తరబడిగా వస్తూన్న సాంప్రదాయాలు అలవాట్లు అనే గోడలమధ్య ఇక మీదట జీవించలేడు. అతడు సర్వదా కొత్త ఉద్దేశాలను అనుభవాలను ఎదుర్కొంటున్నాడు. ప్రజాస్వామ్యము. స్వాతంత్ర్యము వల్ల కలిగే కొత్త ఉద్దేశాలు నియమాలను చేయడంలో చాకచక్యాన్ని, బాధ్యతలను స్వీకరించడానికి ప్రోద్బలాన్నిస్తున్నాయి. సంప్రదాయకమైన హిందూ కుటుంబములో పెరిగిన పిల్లవాడు ఈ కొత్త పాత్ర వహించుటకు తగిన హంగులను కలిగియుండడు. నెమ్మదిగానైనా నిశ్చయంగా బహుముఖంగా అభివృద్ధి చెందుతూన్న ఈ సంఘంలో ఒక సమర్థుడైన వ్యక్తిగా జీవించాలంటే అతడు ఎవరిపైనా ఆధారపడకుండా జీవించు బాధ్యతలను తనపై వేసుకోవడం, నిరాశలను ఎదుర్కోవడం, అందిన వాటితోనే తృప్తిపడడం, మొదలైనవి క్షుణ్ణంగా నేర్చుకోవాలి. హిందూ కుటుంబం కొన్ని పాత విలువలపైననే కొత్తపద్ధతిలో పిల్లలను పెంచడానికి పునాదులు వేయాలి. ఈపద్ధతులు పిల్లవాడు పెద్దవాడయాక తన పాత్రను సంతుష్టికరంగా పోషించకగ్గేలా గుండాలి.

తలిదండ్రుల విశాల దృక్పథం కారణంగా పిల్లల ఆహార, మలమూత్ర విసర్జనలవంటి స్వేచ్ఛాయుతమైన శారీరక అలవాట్లు కొన్ని పిల్లవానికి చిన్నతనంలోనుండీ రావడానికి అవకాశంవుండే ఉద్రేకపూరిత దుష్క్రియలు రాకుండా కాపాడుతున్నాయి. నిజానికి ఒక అచ్చమైన హిందువుల పిల్లవాని పసితనం. చెప్పుకోతగినంత స్వేచ్ఛాయుతమైనది, సంతోషపూరకమైనదీను ; పిల్లవాని ఎదుగుదలకు తగినన్ని అవకాశాలు, తన్ను తాను బహిరంగ పర్చుకొనుటకు వున్నవి. సాంప్రదాయకంగా జానపదపద్ధతులలో, చిత్రలేఖనం, సంగీతం, నృత్యం మొదలైన సాంకేతిక లలితకళలలో పిన్నలూ, పెద్దలూ స్వేచ్ఛగా, సమానంగా పాల్గొంటారు. ఈ పెద్దలతో సహజీవనంవల్ల పిల్ల పెరుగుదల శీఘ్రగతిలో జరిగిపోతుందనే వుద్దేశంకంటే అసలు పెరుగుదల క్షీణించిపోతుందనే భయమే ఎక్కువగా కనిపిస్తుంది.

హిందూ సంఘం, సెక్సు సహజాతం మానవ జీవితంలోని ముఖ్యాంశమని గుర్తించింది. ఇది స్త్రీ, పురుష మూర్తులను పూజించుట ద్వారా వెల్లడౌతోంది. మానవులలోవలెనే దేవతలలోకూడా, ప్రేమ, వివాహము, గర్భధారణ సహజముగానే గుర్తింపబడుతోంది.



హైందవ చిత్రలేఖనము, సాహిత్యము, జానపదసాహిత్యం, మతములు మొదలైనవాటిలో మానవునికి, దేవునికి గల సంబంధం, మానవాతీతులకుకూడా, మానవ సంబంధమైన జీవిత విషయాలు ఎంతో భావ గర్భితంగా చిత్రించారు.

హిందూ కుటుంబాలలో స్వాభావికంకాని అస్వాభావిక నడతల నిర్ణయాన్ని ఆయా వ్యక్తులయొక్క తెలివి, మూర్తిత్వాల ద్వారా కాకుండా అతని మాటలు, చేతల ద్వారా నిర్ణయిస్తారు. ఒక పిల్లవాని నడత సామాన్యానికి దగ్గరగావుంటే ఆ పిల్లవాడు సామాన్యమైన వాడని తలుస్తారు. వుదాహరణకు మంచి బాలుడంటే పెద్దవారి మాటకు జవదాటకుండా, పెద్దలను గౌరవించుతూ, తరతరాలుగా సాంప్రదాయసిద్ధమైన అలవాట్లనూ ఆచారాలనూ శిరసావహించేవా డన్నమాట. పిల్లలకు ఈ నడవడి పద్ధతులన్నీ, గుర్తించే విధానాలవల్లా, అనుకరణలవల్లా సులభంగానూ, ఎక్కువ కష్టపడకుండాను పట్టుబడుతున్నాయి. హిందూ తలిదండ్రులు సాధారణంగా తమ పిల్లవాడు శుభ్రంగా లేకపోయినా, పొరుగువారి పిల్లవానిలా చురుగ్గాలేకపోయినా, తెలివైనవాడు కాకపోయినా కూడా ఎక్కువ బాధపడరు. పసితనంలో వారివల్ల అపేక్షించబడే విషయాలు చాలా తక్కువ. సాంఘికంగా విపరీత నడవడి కలవారని నిర్ధారణ చేయబడిన వారు చాలా అరుదు. ఛాందసమైన హిందూ కుటుంబములోని తలిదండ్రులు ఎంతవిపరీతమైన నడవడులు కలవారినైనా సహిస్తారుకాని, ఆహారం, ఆరాధన, వివాహం మొదలైన విషయాలలో ఎదురు తిరిగితే ఓర్పును చూపించలేరు.

ప్రస్తుత కాలపు హిందూ సమాజం జీవితపంథాల ననుసరించి తగు మార్పులను పొందుతూ వస్తోంది. సంప్రదాయాలు, మూఢనమ్మకాలు యువకతరం చేతనేకాక బాహ్య ప్రపంచ జీవితాన్ని చవిచూచిన పెద్దలచేతకూడా తిరుగుబాటు చేయబడ్డాయి. ఇప్పటి హిందూ తలిదండ్రులు ముఖ్యబాధ్యత తమ పిల్లలను సాంప్రదాయకమైన పద్ధతులను, తరహాలను అనుకరింపజేయుటయేకాక, పాతవానిలోనుండి కొత్త విషయాలను తయారుచేసి జీవితం సులభతరం చేసుకొనేటట్టు చేయడానికికూడా. నిర్ణీతమైన వారి కుటుంబాలకే గౌరవమర్యాదలు చూపడం కాకుండా క్రమంగా సంఘానికీ, దేశానికీ, ప్రపంచానికికూడా గౌరవ ప్రపత్తులు చూపించేటట్టు చేయాలి.

మాతా శిశు సంరక్షణాలయ ప్రారంభోత్సవము

విశాఖజిల్లా ఓడచీపురుపల్లి గ్రామమునందు జిల్లా కలెక్టరు శ్రీ ఎన్. జె. కామత్‌గారిచే ద్వితీయ సంక్షేమ విస్తరణ ప్రణాళిక ఆధ్వర్యమున మాతా శిశు సంరక్షణాలయ ప్రారంభోత్సవము 12-4-57 తేదీ శుక్రవారం జరిగినది. శ్రీమతి శాంతికామత్, చైర్మన్, జిల్లాప్రాజెక్టు ఇంప్లిమెంటింగ్ కమిటీ, శ్రీమతి బుర్రా కమలాదేవి, శ్రీమతి ఇందిరా శేషగిరిరావు సభా వేదిక నలంకరించిరి. శ్రీమతి కమలాదేవి తమ యుపన్యాసము నందు సంక్షేమ సంస్థ ఆశయములు, ప్రజల సహకారము మున్నగు విషయములు మాట్లాడిరి. కలెక్టరుగారు తమ యుపన్యాసమునందు కేంద్రమును చీపురుపల్లియందు స్థాపించినట్లు తమకు ఎంతయు ఆనందముగ నున్న దనియు ప్రజలు సహకరించి దీనిని వృద్ధిలోనికి గొనిరావలసినదనియు పేర్కొనిరి.

కేంద్రమునకు శ్రీకృష్ణా సాల్ట్ వర్క్సు ప్రొప్రయిటర్ శేఠ్ దుర్గాప్రసాదుగారు 300 రూపాయలు, భారత మైనింగ్ కంపెనీ మేనేజరు శ్రీ హెచ్. యు. బెనర్జీ గారు 500 రూపాయలు విరాళముల నిచ్చిరి.

చీఫ్ వెల్‌ఫేర్ ఆర్గనైజరు కుమారి సీతాలక్ష్మిగారు శ్రీ దిగుమర్తి రామస్వామిగారి సందేశమును చదివి సంక్షేమ కేంద్రముయొక్క ఆశయములు, కేంద్రముపై ప్రభుత్వ బాధ్యత ప్రజల బాధ్యత మున్నగు విషయములను తెల్పి కేంద్ర స్థాపనకు కృషిచేసిన వారందరికీ కృతజ్ఞతాభివందనము లర్పించిరి. ★

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమ సలహా బోర్డు

10-2-2 ఎ. సి. గార్డ్సు, హైదరాబాదు 4. (దక్కన్)

గ్రాంట్-ఇన్-ఎయిడ్ దరఖాస్తులు

(1) స్త్రీల, (2) పిల్లల, (3) బాలనేరస్థుల, (4) శారీరకంగా, మానసికంగా, అవధ్యులుగానున్నవారి, (5) కౌశలం లేనివారి, (6) అనాధశిశువుల, నిరాధారులైన స్త్రీల, (7) ఆఫ్టర్‌కేర్-రక్షణ కోరేవ్యక్తుల సంక్షేమ విషయాల్లో పనిచేస్తూన్న స్వచ్ఛందసేవా సంఘాలనుండి సహాయార్థం దరఖాస్తులు ఆహ్వానింపబడుతున్నాయి.

సంస్థలు ఈ క్రిందివిధంగా విభజింపబడ్డాయి ;

(1) పది సంవత్సరముల క్రిందట ప్రారంభించబడ్డవి.

(2) ఐదు సంవత్సరముల క్రితం స్థాపించబడినవి.

(3) ఆఫ్టర్-కేర్ రక్షణ, వికలాంగులు, అవధ్యులు, దురదృష్టవంతులు మొదలైనవారి సంరక్షణకు కేంద్ర సాంఘికసంక్షేమసంస్థ ప్రత్యేకకార్యక్రమాలననుసరించడానికి ప్రత్యేకంగా ప్రారంభించబడిన క్రొత్తసంస్థలు.

(4) కొత్త సంస్థలు.

(5) ఉద్యోగం చేసుకొనే స్త్రీల వసతిగృహాలు.

దరఖాస్తులు పంపుటకు కొన్ని వివరాలు

అర్హతలు 1 : వారి కొత్త కార్యక్రమపు సాధారణ ఖర్చులు నియమితమైన కాలంలో 60,000 రు. కాని అంతకుమించికాని వుంటే, 1957-61 వరకు 40,000 రు. విరాళాన్ని పొందడానికి అర్హత పొందివుంటారు.

అర్హత 2 : సంస్థయొక్క కొత్త కార్యక్రమం, సాధారణ ఖర్చు, నియమితకాలంలో 30,000 రు.లు మించివుంటే, 1957-61 వరకు రూ 20,000 లు సహాయాన్ని పొందడానికి అర్హత కల్గియుంటుంది.

అర్హత 3 : సంస్థయొక్క కొత్త కార్యక్రమం, సాధారణ ఖర్చులు నియమితకాలంలో రూ 60,000 లకు మించివుంటే, 1957-61 వ సంవత్సరం వరకూ రూ 40,000 లు సహాయాన్ని పొందడానికి అర్హత కల్గివుంటుంది.

అర్హత 4 : వారి కార్యక్రమం ఖర్చులు రూ 6,000 లకు మించివుంటే ఒక సంవత్సరమునకు రూ 3,000 లు సహాయాన్ని పొందే అర్హత కల్గివుంటుంది.

అర్హత 5 : భవన నిర్మాణం, మరమ్మత్తులు, విస్తరణ, లేక సామగ్రి, వికాస, విషయాలు, భవనానికి అద్దెలో భాగం మొదలైన ఖర్చుల క్రింద, పనిచేసే స్త్రీలకు వసతి గృహాలు నడిపే సంస్థలకు రూ 15,000 లకు ఎక్కువ కాకుండా సహాయం చేయబడుతుంది.

'ఒకటి', 'రెండు' సంస్థలు "ఎ" ఫారమ్‌లోను, 'మూడు' వ సంస్థ 'బి' ఫారమ్‌లోను నాల్గవ సంస్థ "సి" ఫారమ్‌లోను ఐదవ సంస్థ ప్రత్యేక ఫారమ్‌లోను దరఖాస్తులను పంపుకోవాలి. ఈ ఫారమ్సు అన్నీకూడా సంస్థల కోరికపైన సరఫరా చేయబడుతాయి.

ఒకటి కేంద్ర సాంఘిక సంక్షేమ సంస్థకు, రెండు కాపీలు రాష్ట్ర సంస్థకు, వెరసి మూడు దరఖాస్తులను పంపవలెను. సంస్థలు దరఖాస్తు ఫారమ్‌లోని అన్ని విషయాలను క్రమంగా పూర్తిచేసి, జరిగిన మూడు సంవత్సరముల ఆడిట్ చేయబడిన జమాఖర్చుల రిపోర్టులను జతపర్చి పంపవలెను.

ఐదేండ్లవరకు సహాయాన్ని ఇంతకుముందే పొందిన సంస్థలు, సహాయంగా పొందిన ధనాన్ని ఇంకా పూర్తిగా ఖర్చుచేయని సంస్థలు ప్రస్తుతం దరఖాస్తులను పంపనవసరంలేదు.

అన్ని వివరములు పూర్తిగా ఇవ్వాలని. రిజిస్టరు గాని సంస్థల దరఖాస్తులు అంగీకరింపబడవు.

ఈ దిగువ సంతకము చేసినవారికి 1957 జూను ఐదవ తేదీలోపుననే దరఖాస్తులు చేరవలెను.

(సం). శ్రీమతి ఎ. సి. కృష్ణారావు
ఛైర్మన్

పంచవర్ష ప్రణాళికలో

మూగబధిరాంధులకి విద్యాసౌకర్యాలు

శ్రీ వెంపటి సుదర్శనరావు

[తెనాలి బి.ఏ., బి.కాం., బి.ఇడి. బహుళార్థ సాధక పాఠశాల అసిస్టెంటు]

ప్రస్తుతం, భారత ప్రభుత్వాన్ని ఎదుర్కొంటున్న సమస్యల్లో ముఖ్యమైంది వికలాంగుల సమస్య. గ్రుడ్డి, మూగ, చెవిటివారివంటి వికలాంగుల్ని, సమాజానికి భారంగా పరిగణించరాదు. సమాజం అభివృద్ధికి వారు కూడా యథాశక్తిని తోడ్పడగలరు. వారి మేధాశక్తినీ, మిగిలిన అవయవాలనీ సక్రమంగా వినియోగించుకుంటే, ఇతరులకి ఎంతమాత్రం తీసిపోరు. సాంఘికసేవ చేయడానికి వారికి సంపూర్ణావకాశాలు సమాజం కల్పించాలి. ప్రభుత్వమూ, స్వచ్ఛంద సంస్థలూ సహకరించి పరిష్కరించవలసిన సమస్య ఇది.

శారీరక వికలాంగుల్లో గ్రుడ్డివారు అధిక సంఖ్యాకులు. సరైన లెక్కలు లేకపోయినా, ఈనాడు మనదేశంలో ఇరవైలక్షలమంది నేత్రహీను లున్నట్లు అంచనా. అనగా ప్రతి వెయ్యిమందికి అయిదుగురు అంధులన్నమాట. ప్రపంచంలోని మొత్తం గ్రుడ్డివారి సంఖ్యలో ఇది అయిదవవంతు. ఈజిప్టు తర్వాత మన దేశంలోనే ఎక్కువ మంది ఉన్నారు. అవకాశమిస్తే వీరు సమాజానికి ఎంతో సేవ చేయగలరు. గ్రీకు మహాకవి అయిన 'హోమర్', ఆంగ్ల మహాకవి అయిన 'మిల్టన్', భక్తాగ్రేసరుడైన 'సూరదాస్' - వీరు దృష్టిహీనులైనా ప్రపంచ సాహిత్యంలో విఖ్యాత పురుషులయ్యారు. గ్రుడ్డివారిలో ఎందరో గొప్ప గాయకులు, పండితులు, నాయకులు, న్యాయవాదులు ఈనాటికీ మనదేశంలో వున్నారు. వీరి తోడ్పాటుతో మన ఆర్థిక వ్యవస్థ పటిష్టంకాగలదు. కనుకనే, గ్రుడ్డివారి విద్యాభివృద్ధికీ, సాంఘిక క్షేమానికీ, ప్రభుత్వమూ, సేవాసంస్థలూ తీవ్రంగా పాటుబడుతున్నాయి.

గ్రుడ్డివారి విద్యాసంస్థలు ప్రపంచంలో నూటయాభై సంవత్సరముల క్రితమే ఏర్పడ్డాయి. అట్టిది మనదేశంలో మొదటగా డెబ్భయిఏండ్ల క్రితం అమృత్సర్‌లో స్థాపించబడింది. విద్యార్థిదశలోనున్న గ్రుడ్డివారు ఈరోజున మన దేశంలో ఒక లక్షమంది ఉన్నారు. కాని వారి సంస్థలు సుమారు అరవైఆరు మాత్రమే ఉన్నాయి. మొత్తం రెండువేల మందికి శిక్షణ లభిస్తోంది! విదేశాలతో పోలిస్తే, మన దేశంలో అంధ సంక్షేమ సంస్థలు బహు తక్కువ. ఇంగ్లండులో ఎనభైఆరువేల మందికి నూటపది సంస్థలు, జపానులో డెబ్బయిఆరువేల మందికి తొంభై సంస్థలూ ఉండగా, మన దేశంలో ఇరవైలక్షల అంధులకి, అరవైఆరు సంస్థలు మాత్రమే ఉన్నాయి. అందులోనూ మన రాష్ట్రంలో, హైద్రాబాదులో ఒక స్కూలు, కడపలో ఒక స్కూలు, గుంటూరుజిల్లాలో ఒక మిషనరీస్కూలు మాత్రమే ఉన్నాయి. గ్రుడ్డి శిశువులకి, గ్రుడ్డి స్త్రీలకి ప్రత్యేక పాఠశాలలు దేశంలో లేవని చెప్పొచ్చును. కాని ఈ మధ్యనే పాలంకోటలో ఒక అంధ శిశుపాఠశాల, అహ్మదాబాదులో అంధ కన్యా పాఠశాల ఒకటే స్థాపించబడ్డాయి. గ్రుడ్డివారి శిక్షణ కేంద్రాలుకూడా దేశంలో చాలినన్ని లేవు. డెహరాడూన్‌లోని అంధజన శిక్షణ కేంద్రం, కొద్ది మందికి మాత్రమే శిక్షణనీయగలుగుతోంది. ఇటీవల, బొంబాయిలో నేత్రహీనులకి ఒక వ్యవసాయ శిక్షణ కేంద్రాన్ని ప్రభుత్వం స్థాపించింది. ఇండియాలో ఇది ఏకైక సంస్థ గ్రుడ్డివారి సంక్షేమం విషయంలో బొంబాయి రాష్ట్రం ముందంజ వేసిందని చెప్పొచ్చును. ఇటీవల అచ్చట అఖిలభారత నేత్ర హీనుల సమావేశం జరుపబడి, వారి సంఘం ఒకటి స్థాపించబడింది. ఆ ప్రాంతంలోని దృష్టిహీనులకి ఉపయోగపడేందుకు 'ఒక మాట్లాడే పత్రిక'కూడా ఈ మధ్యనే నడుపబడుతోంది.

దాదాపు ఒక శతాబ్దానికి పైగా గ్రుడ్డివారికి బ్రయిల్లీ పద్ధతి ద్వారా చదువు నేర్పుతూవచ్చారు. 'బ్రయిల్లీ' అన్నతను ఈ పద్ధతిని ఒక శతాబ్దం క్రితం కనిపెట్టాడు. ఉబ్బెత్తుగావుండే చిన్న చిన్న చుక్కలతో ఇది వ్రాయబడి ఉంటుంది. ఈ పద్ధతిలో వ్రాయబడ్డ గ్రంథాలు ప్రమాణంలో పెద్దవిగా ఉంటాయి. మామూలు పుస్తకాలనుకూడా, దృష్టి హీనులు చదివేందుకు 'విద్యుత్ నయనం' గల యంత్రాన్ని ఈ మధ్యనే కనిపెట్టారు. ఇదేగాక, ధ్వనుల మేళవింపుతో అక్షరస్ఫురణగావించే ఒక శబ్దయంత్రంకూడా కనుక్కోబడింది. అంధుని జీవితంలో ఈ రెండు 'చదివే యంత్రాలు' విప్లవాన్ని తీసుకురాగలవు.

1955 ఏప్రిల్‌లో ముస్సోరీలో జరిగిన 'అంధుల సెమినార్' చాలా ప్రధానమైంది. అందు ప్రఖ్యాత అమెరికన్ అంధురాలు 'హెల్లెన్ కెల్లర్' నేత్రహీనుల సంక్షేమాన్ని గూర్చి చాలా సూచనలనిచ్చింది. ద్వితీయ పంచవర్ష ప్రణాళికాకాలంలో ప్రతి రాష్ట్రంలోనూ గ్రుడ్డి బాలురకి విద్యాసౌకర్యాల ఏర్పాట్లు జరుగుతున్నాయి. సాధారణ పాఠశాలల్లో మిగిలినవారితోపాటు వీరికికూడా విద్యనేర్పే విషయం పరిశీలిస్తున్నారు. అంధజన శిక్షణ కేంద్రాన్ని స్థాపించి వారికి చేనేత, నవారునేత, టైపు రైటింగు, సంగీతం-మొదలైనవాటిల్లో శిక్షణనీయదలచారు. ముస్ముందుగా, డెహరాడూన్‌లోని అంధుల జాతీయ కేంద్రాన్ని ప్రభుత్వం ఆదర్శప్రాయంగా చేయదల్చింది.

ప్రముఖ భారతీయభాష లన్నింటిలోనూ, బ్రయల్లీ గ్రంథాలను ముద్రించటానికి అవకాశాలు కల్పించబడుతున్నాయి. అన్ని ప్రాంతీయ భాషలకు ఒకే కోడ్‌గల 'భారత బ్రయల్లీ' నెలకొల్పబడింది. అంధుల విద్యా పరికరాల్ని విదేశాలనుండి దిగుమతి చేసుకొనడం మాని దేశంలోనే తయారుచేయనున్నారు. కేంద్ర విద్యాశాఖలో గ్రుడ్డివారికిగాను ప్రత్యేక శాఖ నెలకొల్పబడింది. వారి విషయమై ప్రభుత్వానికి సలహానిచ్చేందుకు కేంద్రసలహా సమితి స్థాపింపబడింది. అంధుల సాంఘికరక్షణగూర్చి చర్చించేందుకు, ఈ మధ్యనే, ముస్సోరీలో విద్వద్గోష్టి ఒకటి ఏర్పరుపబడింది. అనేక దేశాలనుండి ప్రతినిధులు హాజరయ్యారు. నేత్ర హీనులకి శిక్షణ సౌకర్యాలు ఇతోధికంగా ఏర్పరుచాలనీ, శిక్షణపొందినవారిని పరిశ్రమల్లోనూ, వ్యవసాయ, వ్యాపారాదుల్లోనూ అవసరమయితే శాసనాలు చేసిఅయినా, ఉద్యోగాలు కల్పించాలనీ తీర్మానించబడింది. ఇట్టిగోష్టి జరగడం ఆసియాలో ఇదే మొదటిసారి.

ఇహ చెవిటి, మూగవాళ్ళ విషయం చూస్తే ప్రస్తుతం మన దేశంలో ఏడులక్షలమంది ఉన్నట్లు అంచనా. అందులో ముప్పదిఅయిదువేల మంది విద్యార్థిదశలోని వారు. కాని రెండువేల మందికే శిక్షణనీయగలుగుతూ, వారి సంస్థలూ నలభై రెండే ఉన్నాయి. మన రాష్ట్రానికి కాకినాడలో ఒకే ఒక చెవిటి, మూగ పాఠశాలఉంది. చెవిటి మూగవాండ్ర సంక్షేమ కృషి ఇహముందు ఎక్కువగా జరగవలసి ఉంటుంది.

కేంద్ర విద్యాశాఖవారు వీరి విద్య, సంక్షేమాన్నిగూర్చి చర్చించడానికి ఇటీవల ముస్సోరీలో ఒక సెమినార్ జరిపారు. రెండవ పంచవర్ష ప్రణాళికాకాలంలో ప్రతీ రాష్ట్రంలోనూ చెవిటి, మూగవాండ్రకి నర్సరీపాఠశాలలు, ఉన్నత పాఠశాలలు, వయోజన శిక్షణకేంద్రాలూ స్థాపింపదల్చారు. వారికి జీవనోపాధికల్పించే కార్యక్రమాల్ని తయారుచేయిస్తున్నారు. వారి విద్యాభ్యాసం దృశ్య, శ్రవణవిధానంపై జరగాలి కాబట్టి, దేశంలోనే ఆయా యంత్రాల్ని తయారుచేసే ప్రణాళికలు వేస్తున్నారు. 'ఫోనెటిక్స్' పరిశోధన జరిపే కేంద్రాన్నొకదానిని ప్రభుత్వం స్థాపింపదల్చింది.

ఇటీవల అమెరికాలో చెవుడుకు శస్త్రచికిత్సను 'శామ్యూల్ రోజన్' అనే నిపుణుఁడు కనుక్కొన్నాడు. ఈ నూతన విధానంవల్ల అనేక దేశాల్లో లక్షలాది చెవిటివారు ప్రయోజనం పొందుతున్నారు. మన దేశంలోకూడా ఈ విధానం ప్రచారం కాబోతోంది. ఇదేవిధంగా అంధత్వాన్నికూడా అధిగమించే విధానాన్ని కనుగొనేందుకు కృషి జరుగుతోంది. ఇవన్నీ ఫలప్రదమైతే, వికలాంగుల జీవితాలు ధన్యమైనట్టే.

చెవుడు, గ్రుడ్డి, మూగవంటి వైకల్యాల విషయంలో చిన్నతనమందే తగిన శ్రద్ధచూపితే చాలవరకు నివారణ కాగలవు. కాబట్టి నిరాశచెందియున్న వికలాంగుల తల్లిదండ్రులకు తగిన సలహాలనిచ్చేందుకు ప్రభుత్వం సంఘసేవకులని నియమింపదల్చింది. వికలాంగుల విషయమై పరిశీలన జరిపేందుకు 'ఆల్బర్ట్‌వీఫింగ్' అనే బ్రిటిషు నిపుణుని మన ప్రభుత్వం ఈ మధ్యనే నియమించింది. అంతేగాక కేంద్ర సాంఘిక సంక్షేమ సమితిని నెలకొల్పి వికలాంగుల సేవాసంస్థలకి కావలసినసహాయమిప్పిస్తోంది. ఇంతవరకు సుమారు రెండువందల సంస్థలు అట్టి సహాయాన్ని పొందాయి. వికలాంగుల సమస్యల్ని పరిశీలించేందుకు ప్రత్యేక కమిటీలను నెలకొల్పి వారిచే రెండవ ప్రణాళికాకాలంలో చేయవలసిన కార్యక్రమం తయారుచేయిస్తోంది. లోకజ్ఞానం పొందేందుకు, వికలాంగులకి ఉచితప్రయాణ సౌకర్యాలు కల్పింపబోతోంది. ఈ రెండవ ప్రణాళికాకాలంలో సంఘక్షేమ కృషికిగాను భారత ప్రభుత్వం 28 కోట్ల రూపాయిలు కేటాయించింది.

సంఘసేవా కార్యక్రమం ఏ దేశంలోనైనా త్వరితగతిని సాగబోదు. దేశ ఆదాయం, సంఘసేవకులకొరత దీనికి కారణాలు. పైగా వికలాంగుల సమస్య అన్నది బృహత్తరమైన సాంఘిక కార్యక్రమం. కాబట్టి ప్రభుత్వ ప్రోత్సాహంతో, ప్రజల ఉత్సాహంతో, నిర్విరామకృషి జరగవలసిఉంది. శ్రేయోరాజ్యమగు స్వతంత్ర భారతమందు. వికలాంగులకిగల విశిష్టస్థానాన్ని సమాజం గుర్తించాలి. స్థానిక సంస్థలుకూడా యథాశక్తిని ఇందు భాగస్వాములు కావాలి. అయినా, దేశం పారిశ్రామికంగా అభివృద్ధి అయిన కొద్దీ వికలాంగుల పునరావాసం విస్తృతం కాగలదు. పంచవర్ష ప్రణాళికల లక్ష్యంకూడా తప్పక సిద్ధించగలదని ఆశిదాం. (రేడియో ప్రసారితం)

తగ్గుతున్న శిశు మరణాల సంఖ్యలు

ఒక సమాజంలో పసిపిల్లల మరణ సంఖ్య తగ్గుతోందంటే, అర్థం ప్రజలయొక్క ఆరోగ్య పరిమితులు పెరుగుతున్నాయని. 1948 నుండి, మొదటి, రెండవ పంచవర్షప్రణాళికల క్రింద ప్రారంభించబడి, అభివృద్ధి చెందుతున్న ప్రసూతి, శిశు సంరక్షణల యొక్క ప్రభావంవల్ల పిల్లల మరణ సంఖ్యలలో కొంచెం తగ్గుదల కన్పిస్తూంది.

1932 కు పూర్వం బాలెంత చావుల సరియైన లెక్కలు దొరకలేదు. బాలెంత చావులు పట్టణాల్లోకూడా ఎక్కువగా వుండేవనేందుకు సందేహంలేదు. 1939 లో ప్రతి వేయిలోను ఇరవై బాలెంత చావులని స్పష్టంగా తెలుస్తూంది. 1954నాటికి పల్లెప్రాంతాలలో వేయికి పదిమంది, సంక్షేమ సేవలు బాగా వుండడంచేత పట్టణాలలో వేయికి ఇద్దరు మాత్రమే మరణిస్తున్నారు.

పసిబిడ్డల చావులు కూడా తగ్గాయి. 1910 లో వేయికి 212 వుండేవి. 1950 లో 127 వుండేవి. 1954 నాటికి 116 కి తగ్గాయి. పిల్లల సంక్షేమ కేంద్రాలు విరివిగా పనిచేస్తూన్న ప్రదేశాలలో ఈ సంఖ్య వేయికి 96 వరకు తగ్గినట్లు తెలుస్తూంది.

ప్రసూతి, శిశు సంరక్షణశాఖల సంఖ్యను ఎక్కువ చేయడం, అందులోను పల్లెప్రాంతాలలో మంత్రసాని పనులను అభివృద్ధి చేయడం దేశం మొత్తంమీద పట్టుదలతో జరుపబడుతోంది. ఇటువంటి కేంద్రాలసంఖ్య 3,000 వరకు పెరిగింది.

ఆధునిక పద్ధతులలో దాయీలను నియమించడానికి రెండవ పంచవర్ష ప్రణాళికలో తొంభై లక్షల రూపాయలు కేటాయించబడ్డాయి. ముప్పై ఆరువేల దాయీలకు ఆరుమాసముల శీఘ్ర శిక్షణనీయాలని సలహా యీయబడింది ఈశిక్షణ ఆరోగ్య కేంద్రాలలోనూ, ప్రస్తుతం వుంటూన్న ప్రసూతి, శిశు సంరక్షణ కేంద్రాలలోను ఇవ్వబడుతుంది.

మొదటి పంచవర్ష ప్రణాళికలో ఆరువందల హెల్తు విజిటర్లను, రెండువేల నాలుగువందల మంత్రసానులను తయారు చేయాలని అంచనావేశారు. రెండవ పంచవర్ష ప్రణాళికక్రింద అమలులోనున్న ఆరోగ్య కేంద్రాలని విస్తరింపజేసి ఇంకా కొత్త ఆరోగ్య కేంద్రాలను ప్రారంభించి పదిహేడు వందలమంది హెల్తు విజిటర్లను తయారుచేయాలని అంచనా వేశారు.

ఎక్కువ వెనుకబడియున్న పల్లెప్రాంతాలలో ప్రసూతి, శిశు సంక్షేమ సహాయాలకు, విస్తరణలకు రెండవ పంచవర్ష ప్రణాళిక క్రింద ఏభై లక్షల రూపాయలు కేటాయించబడ్డాయి. ఇప్పుడు అమలులోనున్న వైద్యశాలల సహకరణతో అరవైనుండి డెభైవేల జనాభా యున్న ప్రదేశాలలో ప్రారంభించబడిన శిశు సంక్షేమ దళాలు ఈకార్యక్రమంలోచేరినవే. ఒక ముఖ్య కేంద్రం, దానికి సంబంధించిన మూడు ఉప కేంద్రాలకు కలిపి నియమింపబడ్డ సిబ్బంది ఒక హెల్తు విజిటరు, నలుగురు మంత్రసానులు.

కమ్యూనిటీ ప్రాజెక్టు డెవలెప్‌మెంటు ప్రోగ్రాములు, ఎన్. ఇ. ఎస్. బ్లాకులలోని ఆరోగ్య కార్యక్రమాలుకూడా మాతా శిశువుల సంక్షేమాన్ని అందిస్తాయి. ప్రసూతి శిశు సంరక్షణలకు సిబ్బందికి శిక్షణ నీయడానికి, వెనుకబడిన ప్రాంతాలలో మాతా శిశువులకు రక్షణ నీయడానికి ప్రత్యేకసౌకర్యాలు కల్పించబడ్డాయి.

రెండవ పంచవర్ష ప్రణాళికా కాలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పథకం క్రిందకి మూడువేల నేషనల్ ఎక్స్‌టెన్షన్ బ్లాకులను తీసుకురావాలని చూస్తున్నారు.

పిల్లల ఆరోగ్య విషయాలలో తగిన రీతిని సేవచేసే అవకాశంకోసం, పిల్లల జబ్బులు, ఆరోగ్య (పీడియాట్రిక్స్) విషయాలలో ప్రత్యేక శిక్షణ లివ్వడానికిగాను వైద్యకళాశాలలకు రెండవ పంచవర్ష ప్రణాళికలో నలభై ఐదులక్షల రూపాయలు కేటాయించబడ్డాయి.

డబ్ల్యు. హెచ్. ఓ. తోను యు. ఎన్. ఐ. సి. ఇ. ఎఫ్‌తోను కలిసి పన్నెండు రాష్ట్రాలు పరిపూర్ణ ప్రసూతి, శిశు ఆరోగ్య కార్యక్రమాలను ప్రారంభించాయి. యు.ఎన్.ఐ.సి.ఇ.ఎఫ్. సాంకేతిక పరికరాలను సద్దుబాటుచేస్తే, శిక్షిత సిబ్బందిని డబ్ల్యు హెచ్.ఓ. సద్దుబాటు చేస్తుంది.

చాలా అనధికార సంఘాలుకూడా మాతా శిశు సంరక్షణ విషయాలలో శ్రద్ధవహిస్తున్నాయి. బొంబాయిలోని "మదర్స్ అండు చిల్డ్రన్స్ వెల్‌ఫేర్ సొసైటీ" బీహారు ప్రసూతి, శిశు సంరక్షణ సంఘం, న్యూఢిల్లీలోని "కస్తూర్బా మెమోరియల్ ట్రస్టు", "ఇండియన్ కౌన్సిల్ ఫర్ ఛైల్డు వెల్‌ఫేర్", "ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ" మొదలైనవన్నీ ఇటువంటి సంస్థలే. ప్రసూతి, శిశు సంరక్షణల విషయంలో అభివృద్ధి చూపడంకోసరం కేంద్ర సాంఘిక సంక్షేమ సంస్థ రాష్ట్రసంస్థలకు తగిన సహాయం చేస్తుంది.

★

రాష్ట్రసంక్షేమ సంఘాలు : అధ్యక్షులు :

శ్రీమతి పుష్పాబెన్ మెహతా

శ్రీమతి పుష్పాబెన్ మెహతా బొంబాయి గవర్నమెంటు సంఘ సంక్షేమ బోర్డులో అధ్యక్షులు. ఈమె సిద్ధాంతములు రచనాత్మక కార్యక్రమములయందు ఎక్కువ విశ్వాసం ఉంచుతారు. సంఘములో చిన్న చిన్న ఉపేక్షింపబడిన వర్గముల క్షేమకార్యములకు తమ అమూల్యమైన సహాయమును, సమయమును ఇచ్చి ఎప్పుడూ సహాయపడుతున్నారు.

ఈమె 21 మార్చి 1905 లో సౌరాష్ట్రములో జునాఘడ్‌లో జన్మించారు. ప్రారంభమునుండి ఎం. ఏ. దాకా ఇంటిలోనే చదివి, ఎం. ఏ. పరీక్ష కార్వే విశ్వవిద్యాలయమున ఉత్తీర్ణులైరి. సంఘ విజ్ఞానం ఇంకా ఇతర విషయాలలోకూడా ఈమె ఎక్కువ తెలిసికొన్నవారు.

శాంతస్వభావ ఆత్మవిజ్ఞాని. ఆలోచనాపరురాలు. నిస్వార్థసేవా పరురాలు అయిన ఈమె సౌరాష్ట్రానికి మంచి పరిచితురాలు. ఈమెకు అనేక సంఘసేవా సంస్థలయందు ఎక్కువ సంబంధమున్నది. అన్నిటికంటె ముందు ఈమె 1934 లో మహిళా సంక్షేమమునకు సంబంధించిన జ్యోతి సంఘములో ప్రవేశించి తమ నిస్వార్థసేవా భావములకు ఆకారము కల్పించిరి. "వికాస గృహము"లో అధ్యక్ష పదవిలోనుండి అనాథ పిల్లలకు, పరిత్యక్త స్త్రీలకు పునరావాసము కల్పించడంలో అత్యంత మహత్వపూర్ణమైన, ప్రశంశనీయమైన కార్యములను చేసియున్నారు.

ఈమె సౌరాష్ట్రములో "మాలాధారీ సంఘము" నకు అధ్యక్షులుగ కూడ నుండిరి. ఇది సౌరాష్ట్రములో "యయావర్"జాతిని పునరుద్ధరించుటకు ప్రయత్నము చేయుచున్నది. ఈమె సేవాపరాయణతకు, సంఘోద్ధరణకార్యతత్పరతకు సౌరాష్ట్రమందు విద్యామంత్రి తరువాత పదవి నొసగి గౌరవించిరి.

జునాఘడ్‌లోని సుప్రసిద్ధ "శిశుమంగళ్" సంఘమునకు కూడ అధ్యక్షులు. ఇంకా ఇతర మహిళా సంక్షేమ ఉద్దేశముతో పనిచేయుటలో సేవాసంస్థలతో ఈమెకు ఘనిష్టమైన సంబధమున్నది. ఈమె సౌరాష్ట్ర ప్రభుత్వ సలహా బోర్డులో అధ్యక్షులుగ కూడ నుండియున్నారు. వీరు సంఘసంక్షేమ సంబంధమైన మాస పత్రికకు కూడ ప్రకాశకులు.

దేశ, సంఘసేవాతత్పరురాలైన శ్రీమతి మెహతా నిష్కామకీర్తివంతురాలు నిస్వార్థసేవకురాలు. ఈమె నిస్వార్థ దేశ, సంఘ సేవకు మెచ్చి భారత ప్రభుత్వము "పద్మ భూషణ"ము నిచ్చి గౌరవించిరి.

ANDHRA MAHILA SABHA

NURSING HOME & NURSES' TRAINING CENTRE

REPORT FOR APRIL 1957

IN-PATIENT MATERNITY

No. of Patients admitted for Deliveries	158
" " Medical cases treated	35
" " Surgical cases treated	3
" " Gyneac and Abortions	32
" " Post Natal	2
" " babies admitted	133
Grand total	363
" " normal Deliveries	117
" " abnormal Deliveries forceps 11, I. P. V. 1	12
Total	129

OUT-PATIENT DEPARTMENT

No. of Surgical cases	71
" " Medical cases	911
" " Gyneacological cases	173
" " Ante-natal cases	290
" " Post-natal cases	122
" " E.E.N.T. cases	75
Total No. of New patients	1642
Total No. of Old patients.	2508
Grand Total	4150

NURSES' TRAINING CENTRE

The first batch of Auxiliary Nurse Midwives discharged from the institution, numbering 11, are all employed now. The second batch of 30 trainees completed their training in July and will be taking their final examination this month. They will all be immediately taken into service, some in the Community Development Blocks, Andhra Government and the rest in the Welfare Extension Projects, Andhra State. Third batch of 15 trainees are continuing their II year of study in midwifery. They have all finished conducting 25 cases each in the hospital. 5 of them have finished their domiciliary midwifery training. All of them are attending lecture between 2 p m to 4 p.m. and conducting their ward work in the hospital. Fourth batch of 15 traines are waiting for their preliminary examination in Nursing & First aid. They have finished their preliminary training period and six months of Nursing in the Government General Hospital. They are having revision classes in First aid and General Nursing. Fifth batch of trainees numbering 30 have finished their preliminary training and are continuing their second month of training in Nursing at the General Hospital.

Mrs. V. LAKSHMI PARVATHI
Secretary and Convenor

Mrs. A. C. KRISHNA RAO
Administrative Secretary

Dr. M. PAVANA BAI
Medical Superintendent

దివ్యమానినీ

కె. పార్వతీదేవి

నీవొక దివ్యమూర్తివి - వినిర్మల కాంతవు - రోగజీవులన్
గావగ దీక్షబూని నిజ గౌరవమేమిటొ - బోధచేయుచున్
జీవిత పారమార్థమున చింతలబాపుచు జ్ఞానదివ్వెలో
త్రోవను జూపు ధన్యమయి - తోడ్పడు దైవము నీకు సోదరీ !

ఉదయము లేచి దీనులకు ఓర్పును నేర్పును జూపి వారిచే
ముదమున నౌషధంబులను మ్రింగగ జేయుచు - మాతృమూర్తివై
చెదరిన గుండె బాధలను చెండుచు నుంటివి - దివ్యమానినీ
వదనము చూడ సంతసము వర్థిలు సాధ్వివి నీవు సోదరీ !

హాసము చిందుమోము పరిహాసమెరుంగని దివ్యవాక్కులున్
మోసము లేని భావముల మేల్మిని బోలెడి శీలసంపదల్
దోస విఘాత చేష్టలకు దోహదమివ్వని శాంతవంటి నీ
ఆశకు తావులేని పరమార్థపు జీవివి నీవు సోదరీ !



ఇంగ్లాండులోని డెన్‌హామ్ కాలేజీ 1948 వ సంవత్సరంలో పల్లెటూరి పడుచుల విద్యకై స్థాపించ బడినది. అందు ఇప్పటికి పదివేల యువతులు డిగ్రీలు పొందియున్నారు. ఇందు రీడింగ్ యూనివర్సిటీ డైరెక్టరు పాత్రలు చేయు విధానమును గూర్చి విద్యార్థులకు ఉపన్యసించు చున్నారు.

కనువిప్పు

రచన :
'కుమారి ఎ. పద్మావతి'

శేఖర్ ఇంటరు చదివే రోజుల్లో, తండ్రి మరణం సంభవించటంతో, తన పట్నం చదువుకు డబ్బుపంపి యింటిభారం నెత్తిన వేసుకొనే అండలేకపోవటంతో అతని చదువుకు అంతరాయం కల్గింది. కాలేజీ విడవాలంటే శేఖర్‌కు మొదట్లో చాలా కష్టమనిపించింది. కాని ఆ పరిస్థితులలో చదువుకు స్వస్థిచెప్పటమే మంచిదని తోచింది. తండ్రి మిగిల్చిపోయినది ఒక విధంగాచూస్తే పెద్ద ఆస్తి ఏమీ కాదనే చెప్పాలి.

శేఖర్ ఆవూరి వారందరి సలహామీదా వ్యవసాయంలోనికి దిగాడు. అతనికొక చిట్టిచెల్లెలు తల్లి తప్ప మరెవ్వరూ లేరు. అతని మేనమామ మాత్రం రాజమండ్రీలో ఏదో కంపెనీలో మేనేజరుగ ఉంటున్నారు. ఆయనకు మాత్రం వీళ్ళ సంసారం నెత్తిన వేసికొనే తీరుబడిలేదు. ఆయన ఏకైక పుత్రిక పేరు శారద. శారద అంటే తల్లీ తండ్రికి మహాగారాబం. శేఖర్ కంటే శారద రెండేళ్ళు చిన్న. చిన్నప్పుడు శారద కంటే శేఖర్ ఎక్కువ క్లాసు చదివేవాడు. కాని శేఖర్ చదువుకు ఆటంకం కల్గడంవల్ల శారద యిప్పుడు బి. ఎ. చదువుతోంది. శేఖర్‌కు మొదటినుంచీ శారద అంటే చాలా యిష్టం. శేఖర్ తల్లి సుందరమ్మ గార్కికూడ శారదను తన కోడలిగ జేసికోవాలని ఉండేది. ఒకనాడు శేఖర్ భోంచేస్తూవుంటే సుందరమ్మగారు అతనితో "మామయ్యకు ఉత్తరం వ్రాద్దామనుకుంటున్నాను నాయనా" అంది. "ఏమనమ్మా" అన్నాడు. "ఏమనేమిట్రా శారదను ఈ ఇంటికోడలిగాచెయ్యమని"అంది. శేఖర్‌కు తెలుసు శారద తనని చేసికోడానికి నిరాకరిస్తుందని. ఆవిషయమే తల్లితో చెప్పాడు. కాని ఆవిడ ఆశమాత్రం పోలేదు. అందుకని తనే స్వయంగా వెళ్ళి కనుక్కొని వస్తానంది. తల్లిని నిరుత్సాహ పరచడం ఇష్టంలేక మరునాడు ప్రక్క వూరికి పోయి రైలు ఎక్కించి వచ్చాడు. పోయిన నాల్గురోజులకే తలి తిరిగి వచ్చింది.

ఆరోజు రాత్రి భోంచేస్తూ వుంటే "ఏమన్నాడమ్మా మామయ్య" అన్నాడు. "ఏమనడమేమిటి నాయనా శారద మునపటి శారదకాదు. ఒక్కనిముషం ఇంట్లో ఉండదు. మొగ స్నేహితులతో కలిసి సినీమాలు, షికార్లూనూ. మామయ్య, అత్తయ్యకూడ తమకు పట్టనట్టే వూరుకునేవారు. ఏమిటోనాయనా నాకుమాత్రం చాలాఆశ్చర్యమేసింది. నేను వెళ్ళిన మూడోనాడు "ఎప్పుడొచ్చావు అత్తయ్యా" అంది. ఈ వరసంతా చూస్తే నాకు అడగాలనే అనిపించలేదు. అయినా చిన్నతనం మన యింటికివస్తే అదే సర్దుకు పోతుందిలే అని ఆరాత్రి మామయ్యనుకదలేశాను. మామయ్య కూడ దాని వరుణ్ణి వెతుక్కునే భారం దాని మీదే పెట్టానన్నాడు. ఇంతలోకి శారద ఆ గదిలోకివచ్చి ఏమిటి నాపెళ్ళి శేఖర్ బావతోనా? ఓ! చాలా బావుంటుంది జంట. అయినా శేఖర్‌కు ఇంగ్లీషులో సంతకం చేయడమైనా వచ్చో రాదో అని నా అనుమానం. నాన్నా! నేను యిప్పుడు పెళ్ళి చేసుకోను అంటూ వెళ్ళిపోయింది. అంతే ఒక్కక్షణం అక్కడవుండబుద్ధికాలేదు వచ్చేశాను" అంటూ ముగించింది. శేఖర్ ఒక నిట్టూర్పు విడిచి మజ్జిగమ్మా అన్నాడు. భోజనం ముగించి ఆలోచిస్తూ పడుకున్నాడు.

శేఖర్‌కు ఆవూళ్ళో మంచి పలుకుబడి ఉంది. ఎవరికి ఏతగువు వచ్చినా అతనిదగ్గరకు వచ్చేవారు. ఎంతో నేర్పుతో వారితగువు తీర్చి పంపేవాడు. ఆ సంవత్సరం ఎక్కువ ఓట్లతో ఆవూరి ప్రెశిడెంటుగా కూడ ఎన్నికయ్యాడు. వీళ్ళింటికి ఎదురుగా ఆవూరి పెద్దకాపు గారి యిల్లుండేది. ఆయనకు శేఖర్ అంటే ఎంతో ప్రేమ. ఆయన రోజూ ఒకగంటసేపైనా శేఖర్‌తో గడిపేవారు. ఆయనకు పురుషులతో సమానంగా స్త్రీలుకూడా చదవాలని పట్టుదల. అందుకే ఆయన తన కూతురైన నిర్మల స్కూలుఫైనలు పూర్తిచెయ్యగానే రాజమండ్రీలో బంధువుల యింటవుంచి కాలేజీలో చేర్పించారు.

వేసవి శలవులకు నిర్మల ఇంటికి వచ్చింది. ఒకరోజు శేఖర్, నిర్మలతండ్రి కూర్చొని దేనినిగురించో చర్చించు కుంటున్నారు. అదే సమయంలో నిర్మల స్నేహితురాలింటికి పోయివస్తోంది. తండ్రి నిర్మలను పిలిచి "అమ్మా శేఖర్ గురించి నీకు తెలిసే ఉంటుంది. నీకు తెలియని దేదైనా ఉంటే అతన్నడుగమ్మా" అన్నాడు. "అల్లాగే నాన్నా" అంది. ఆమరునాడు నిర్మల ఒక పుస్తకం తీసికొని శేఖర్ దగ్గరకు వెళ్ళింది. అప్పుడు అతను తన లైబ్రరీ హాలులో కూర్చొని ఏదో చదువుకుంటున్నాడు. శేఖర్ నిర్మలను కూర్చోమని కుర్చీ చూపాడు. నిర్మల అతని లైబ్రరీ చూచి ఆశ్చర్యపోయింది. తరువాతపుస్తకం తీసి తనకు కావలసింది తీసి చూపించింది. శేఖర్ అది చదివి బాగా అర్థమయ్యేలాగ చెప్పాడు. నిర్మల తన ఈ ఏడాది చదువులో ఏ లెక్చరర్ కూడ యింత బాగా చెప్పడం వినలేదు. అంతా వినిన తరువాత అతనివద్ద శలవు తీసికొని వెళ్ళిపోయింది. నిర్మల ఆరాత్రంతా అతన్ని గురించి ఆలోచనలతోనే నిద్రపోయింది.

రోజూ నిర్మల శేఖర్‌తో ఏదో ఒకదాన్ని గురించి చర్చించేది. అతనితో కూడా అప్పుడప్పుడు తోటలోనికి పోయి అతనికి సహాయపడుతూ శలవలు చాలాఉల్లాసంగా గడుపుతోంది. అల్లా అల్లా శేఖర్ స్నేహంలో శలవలు యిట్టే గడిచిపోయాయి. కాలేజీ తెరిచేరోజులు దగ్గిరపడే కొలదీ నిర్మలకు ఎందుకో దిగులుగావుంటోంది. ఎప్పుడు వేసవి శలవలు వచ్చినా, ఎప్పుడు మళ్ళా స్కూలు తెరుస్తారా అని ఎదురుచూచేది. కాని ఈసారి మాత్రం కాలేజీకి పోవాలంటే ఏదో తెలియని బాధ పట్టుకుంది. మరునాడు కాలేజీ తెరిచేరోజు. ఆ సాయంత్రమే నిర్మల రైలుకు వెళ్ళాలి. అందుకని తన సామానంతా సర్దుకొని తండ్రితో బండికి పంపమని చెప్పి సుందరమ్మగారింటికి పోయి వస్తానని చెప్పి బయలుదేరింది. శేఖర్ గదిలో కూర్చొని ఏదో వ్రాస్తున్నాడు. నిర్మల వెళ్ళి అతనిప్రక్కన నిలుచుంది. శేఖర్ తలపైకెత్తి చూశాడు. నిర్మల తన ప్రయాణం సంగతి అతనితో చెప్పింది. ఎందుకో నిర్మల ఎంత ఆపుకుందామనుకున్నా ఆ కన్నీళ్ళు ఆగలేదు. శేఖర్ అప్రయత్నంగా లేచి నిర్మలను దగ్గరకు తీసుకున్నాడు. నిర్మల అతని గుండెలమీద వాలిపోయింది. శేఖర్ నిర్మలతల నిమురుతూ "బాగా చదివి ఫస్టుక్లాసు తెచ్చుకో నిర్మలా" అన్నాడు. "ఊ" అని మాత్రం అని ఇంటికి వెళ్ళిపోయింది.

ఇంటిదగ్గర సామానంతా బండిలో పెట్టించి తనకోసం సిద్ధంగా ఉన్నారు. నిర్మల తండ్రి "ఎక్కమ్మా బండి" అన్నారు. ఆమె "నేను వెళ్ళను నాన్నా సామానుదింపి బండిని పంపేయి"అన్నది. అది విని అదేమమ్మా వంట్లో బాగాలేదా అని ఆయన తెల్లబోయారు. అదికాదు నాన్నా నేను యిక కాలేజీకి పోను. నాకింక ఆ డిగ్రీతో పనిలేదు. "శేఖర్‌కు నన్నిచ్చి...." అని యింక సిగ్గుతో చెప్పలేక తలవంచుకుంది. తండ్రి ఆమెభావంగ్రహించి "అదాతల్లీ! అంతకంటే మాకు మాత్రం కావలసినదేముంది" అని బండివాణ్ణి పంపి సుందరమ్మగారి దగ్గరకు బయలుదేరారు. సుందరమ్మగారు అంతా విని నిర్మల తనకోడలవు తున్నందుకు చాలా సంతోషించారు.

పెళ్ళిపనులు అటు ఇటుకూడ జోరుగాసాగుతున్నాయి. సుందరమ్మగారు తన కొడుక్కి ఆ వూరులోనే ఒక సంబంధం కుదిరినట్లు, శేఖరుకు మూడుముళ్ళు పడే భారం ఆయనమీద వున్నదన్నట్లు పెళ్ళికి వారంరోజులు ముందుగానే రావలసినదనీ కోరుతూ తమ్ముడికి ఒక ఉత్తరం వ్రాసింది. బంధువులలో బావుండదని పెళ్ళి రా త్రనగా అ సాయంత్రం దిగా రాయన. మొదట శారద పెళ్ళికి రానంది. తరువాత ఏమనుకుందో కాని వచ్చింది. శారద గుమ్మంలో అడుగుపెడుతూ ఇంట్లో వుండే వస్తువులు వాటి అలంకరణ చూసి శేఖరుకు యింత నాగరికత తెలుసా అనుకుంది. తరువాత శేఖర్ చెల్లెలు శారదకు ఒక్కొక్కగదే చూపెడుతోంది. చివరకు అతని లైబ్రరీ ఉన్న గదిలోనికి వచ్చారు. ఇది అన్నయ్య చదువుకొనేగది అంది అతని చెల్లెలు. శారద షెల్ఫులో ఉండే ఒక్కొక్క పుస్తకమేతీసి చూడసాగింది. ఇంతలో శారదను ఎవరోపిలిస్తే క్రిందకు వచ్చేశారు.

పెండ్లి ముహూర్తం దగ్గరకువచ్చింది. పెండ్లికూతుర్ని తీసికొనివచ్చి కూర్చోపెట్టారు. శారద పెళ్ళికూతుర్ని చూసింది. ఆ నిర్మల ఎవరోకాదు వాళ్ళ కాలేజీలో చదువుతూ జాయింటుసెక్రటరీగా ఎన్నిక అయి అందరితో చాలా కలివిడిగా వుండే నిర్మలే. ఇంక శారదకు ఒక్క క్షణం అక్కడ కూర్చోబుద్ధికాలేదు. వచ్చి గదిలో పడుకుంది. బుర్ర ఆలోచనలలో దిమ్మెక్కుతోంది. శేఖర్, అతని లైబ్రరీ, నిర్మలా ఒక్కొక్కటే కళ్ళముందు తిరుగుతున్నాయి. శేఖర్‌లో యింత గొప్పతనం యిమిడి వుందా అని ఆశ్చర్యపోయింది. తన్ను తాను ఎంతగానో నిందించుకుంది. ఏమనుకుంటే ఏంలాభం శేఖర్ బావకు

పెళ్ళి అయిపోతోంది. ఆనాడు అత్తయ్యదగ్గిర అతని గురించి ఎంత హేళనగా మాట్లాడింది తను. అబ్బ! తను యింక శేఖర్ ముఖం ఏవిధంగా చూడగలదు. ఈ ఆలోచనలతోనే తెల్లవారింది.

మరునాడు తనకు వంట్లో బాగుండలేదనే వంకతో తల్లినీ తండ్రినీ ప్రయాణం చేసింది. నిర్మల శారదను గుర్తించి ఎంతో ఆప్యాయంగా తన స్నేహితురాండ్రను గురించి, కాలేజీని గురించి అడిగింది. శారద ప్రయాణం సంగతి విని మరికొన్ని రోజులు వుండమని బలవంతం చేసింది. ఇంతలోకి శేఖర్ కూడా అక్కడకువచ్చి ఒక్క వారం రోజులైనా తమతో గడిపివెళ్ళమని చెప్పాడు. సుందరమ్మ గారుకూడ వుండమని బలవంతం చేసింది. ఎవరెన్ని చెప్పినా శారదకు వంట్లో బావుండలేదని మంచి డాక్టరుకు చూపించాలని చెప్పి బండి ఎక్కారు.

శారద ఎందుకు యింత తొందరగ వెళ్ళిపోతోందో తెలిసికోలేని ఆ దంపతులు బండి కనుచూపుమేర దాటే వరకూ చూస్తూ అలాగే నిలబడ్డారు.



పాణి మామయ్య

శ్రీ బి. వి. నరసింహారావు బి.ఏ., బి.ఇడి.

'అందరూ తెగచెప్పుకునేలాగ తనకు పేరురావడం ఎలాగా' అని పాణి మామయ్య ఆలోచించడం మొదలు పెట్టాడు. అందరూ తన పేరు గొప్పగా చెప్పుకుంటుంటే విని ఆనందించాలని పగటి కలలు కంటున్నాడు.

తన పేరు ఊరికే చెప్పుకోమంటే ఎవరైనా చెప్పుకుంటారా ? చెప్పుకోరు. ఏం చెయ్యాలి ? మార్గమేమిటి? పోనీ పత్రికల్లో తన పేరు పడితే ? పడితే అందరూ ఇదిగా చెప్పుకుంటారు.

దేశంలో లక్ష పత్రికలున్నాయి. దిన పత్రికలు. వార పత్రికలు, పక్ష పత్రికలు, మాస పత్రికలు — రకరకాల పత్రికలున్నాయి. పిల్లలకూ, పెద్దలకూ, స్త్రీలకూ ప్రత్యేక ప్రత్యేక పత్రిక లున్నాయి.

పత్రికల్లో పేరు పడడానికి ఏం చెయ్యాలి ? ఏమీ లేదు. ఏదో ఒక కథ, ఒక పద్యం. లేదా ఒక పాట వ్రాసి పంపిస్తే, పత్రికలవాళ్ళు వేసుకుంటారు. రచయిత ఫలానా అని పేరు ప్రకటిస్తారు. పేరు ముందు ఏదైన కొంచెం బిరుదుకూడ తగిలించుకోవచ్చు. ఇదో బ్రహ్మాండమైన విషయంకాదు.

కథలు. పద్యాలు. పాటలు వ్రాయడమంటే పా మామయ్యకు పెద్ద కష్టమైన పనికాదు. తెలుగు బా తెలుసు. చదువుకునే రోజుల్లో తనకు ప్రతిక్లాసులో తెలుగులో ఫస్టుమార్కు వచ్చేది. ఇక భావాలంటారా వాటికీ లోటులేదు. అనుభవంచేత. రకరకాల పుస్తకాలు చదవడంచేత, గొప్ప గొప్పవాళ్ళతో స్నేహం చేయడం చేత, నాలుగు ప్రదేశాలు చూచిరావడంచేత, బోలెడన్ని భావాలు తాను సంపాదించుకున్నాడు.

ఇక పేరుకోసం వ్రాయడం ప్రారంభించాడు పాణి మామయ్య.

జలజల పువ్వులు
కలకల నవ్వులు

గణగణ గంటలు
కణకణ మంటలు

తళతళ మెరుములు
ఫెళఫెళ ఉరుములు.

గుసగుస మాటలు
మిసమిస తోటలు.

బడబడ వానలు
దడదడ బానలు

ఘుమఘుమ ధూపము
ధుమధుమ కోపము.

ఈడూ జోడూ వుంటేగా
ఇంపూ సొంపూ తెలిసేది.
చదువూ సంధ్యా లుంటేగా
సరసం, విరసం తెలిసేది.

రాళ్ళూ రప్పా లుంటేగా
ఇళ్ళూ గుళ్ళూ కట్టేది.
బిడ్డా పాపా లుంటేగా
అడ్డం దిడ్డం తిరిగేది.

చైనా అనుదేశమెప్పు
డైనా చూశావ?
క్వైనా అనుమందునెప్పు
డైనా కొన్నావ?
పైనాపిలుపండునెప్పు
డైనా తిన్నావ?——

ఇలాంటివెన్నో పాటలు వ్రాశాడు మామయ్య.

ఎన్నో రకరకాల రచనలుచేసి పాణి మామయ్య పత్రికలన్నిటికీ పంపించాడు. దానివలన అతడు డబ్బు సంపాదించుకోవాలని ఎప్పుడూ ఆశపడలేదు. అతని కున్న ఆశల్లా - పెద్ద పేరు, ఘరానా పేరు సంపాదించు కోవాలన్నదే. తన రచనల్లోని అర్థాలు, అందాలు ఒక వేళ అందరూ గ్రహించుకోలేరేమోనని, వాటన్నిటికీ వివరాలుకూడ వ్రాసి, జోడించి పంపించాడు.

తన రచనలన్నీ పెద్ద పెద్ద అక్షరాల్లో అందంగా అచ్చవుతాయి. అందరూ చదివి ఎంతో సంతోషిస్తారు. అభినందనలు, ప్రశంసలు పంపిస్తారు. దేశం నాలుగు మూలలా తన పేరు మారు మ్రోగుతుంది. అంతకంటే తనకు కావలసిందేముంది?

పంపించిన రచనలన్నీ పత్రికలవాళ్ళు దగ్గరనుంచి "ప్రకటించడానికి వీలుపడలేదు" అని తిరిగివచ్చాయి పాణి మామయ్యకి. తిరిగివచ్చినందుకు అతడే మాత్రం విచారించలేదు. ఆ రచనల్లోని గొప్పతనాన్ని తెలిసికోలేక పత్రికలవాళ్ళు త్రిప్పి పంపించి ఉండాలి. లేదా ఆ రచనలను ప్రకటిస్తే మిగిలిన రచనలకు దెబ్బ తగులు తుందని భయపడి వాళ్ళు అలా చేసివుండాలి - అని సమాధానపడ్డాడు పాణి మామయ్య.

"ఈ పత్రికల్లో పడితే వచ్చే పేరు ఏమాత్రం? నా రచనలన్నీ కొన్ని పుస్తకాలుగా అచ్చువేసి, అందరికీ అందిస్తా. గొప్ప గొప్పవాళ్ళు చదివి తమ తమ అభిప్రాయాలను వెల్లడిస్తారు. అప్పుడైనా యీ పత్రికల వాళ్ళు వచ్చినట్లు ఆ పెద్దల అభిప్రాయాలను ప్రచురించి తీరతారు. నా గౌరవానికి తగినట్లు నా పేరు పైకివస్తుంది" అని ఎన్నోవిధాల ఊహించుకున్నాడు పాణి మామయ్య ఊరటకోసం.

పుస్తకాల అచ్చుకి డబ్బు తగలేస్తుంటే ఇంట్లోవాళ్ళు బంధువులు, స్నేహితులు "ఎందుకు వచ్చినదూబరా?" అని హెచ్చరించారు పాణి మామయ్య. కాని "పేరు మజా వీళ్ళకేమి అర్థమవుతుంది?" అని అనుకొని అతడు అచ్చుపని పూర్తిచేశాడు.

మూడు సంపుటాలుగా వేశాడు రచనలన్నీ. మొదటిది, కథల సంపుటి - వెయ్యి కాపీలు: రెండవది పద్యాల సంపుటి - వెయ్యికాపీలు: మూడవది గేయసంపుటి - వెయ్యి కాపీలు. ప్రతి సంపుటిమీద పసందైన బిరుద మొకటి పేరుకుముందు ఏర్పాటుచేశాడు.

అచ్చు వేయించిన పుస్తకం ఒక్కటికూడ అమ్ముడు పోలేదు. ఉచితంగా అందుకున్న వాళ్ళల్లో ఒక్కడైనా బాగుంది అని అభిప్రాయం పత్రికా ముఖాన కాకపోయినా, వుత్తరం ద్వారానైనా అందించినవాడు లేకపోయాడు. మూడువేల కాపీలు అచ్చువేయిస్తే ముద్దుగా ముగ్గురైనా తన పేరు చెప్పుకున్న పాపానపోలేదని పాణిమామయ్య తనలో తాను కొంచెం అనుకున్నాడు.

పాణి మామయ్య మేనల్లుడు రవిబాబు. ఆ అబ్బాయి అక్షరాలు, గుణింతాలు, పూర్తిచేసి యిప్పుడే మాటలు పుస్తకం పట్టాడు. పేరులు కూడబలుక్కొని చదవ గలడు. పుస్తకాల అట్టలుమీదవున్న పేరులుగాని, సినిమా పేపర్లలోగాని పేర్లుగాని పెద్దచ్చులోనివి చూసి చదవగలడు.

ఒకసారి రవిబాబు బీరువాలో వున్న మామయ్య పుస్తకాలు చూశాడు. పై కనబడిన పేరు చదివి ఎంతో సంబరపడుతూ "పాణి మామయ్యా! నీ పేరు చూశా" నంటూ పరుగెత్తాడు గదిలో కుర్చీమీద కూర్చున్న మామయ్య దగ్గరకి.

"ఎక్కడ చూశావురా?" అని ఆత్రంగా అడిగాడు మామయ్య, ఒకవేళ తనపేరు ఏపత్రికలోనైనా పడిం దేమోననుకొని.

రవిబాబు మామయ్య చెయ్యి పట్టుకుని బీరువాదగ్గరకు తీసుకువెళ్ళి "చూడు నీ పేరు బోలెడు పుస్తకాలమీద వుంది" అని చూపించాడు. ఇంత భూప్రపంచంలో యీ మాత్రం ఎవరూ అచ్చులోవున్న తన పేరు ఉచ్చరించిన వారే లేకపోయారు. రవిబాబు ఎంతో సర్దాగా తన పేరు అన్నిపుస్తకాలమీద వరసగా చూపిస్తూ చదువుతూంటే, పాణి మామయ్యకు గిలిగింతలు పెట్టినట్లయింది.

బోలెడు పుస్తకాలమీద మామయ్య పేరుండడం చూచినప్పటినుంచి రవిబాబు తనపేరు కూడా వాటిమీద వుంటే? ఎంతో బాగుండు ననుకున్నాడు. దానికి మార్గ మేమిటా అని చాలా ఆలోచించాడు.

వాళ్ళ బళ్ళో కొందరు పెద్దపిల్లలు రబ్బరు ముక్కల మీద బ్లేడుతో పేర్లు చెక్కుకొని, సిరా రాసి తెల్లకాగితాల మీద అచ్చు గుద్దుకోవడం చూశాడు. రవిబాబు తానుకూడా 'రవి' అన్న రెండక్షరాలు ఒక రబ్బరు ముక్కమీద ఎవరితోనో చెక్కించుకొని తెచ్చుకున్నాడు మామయ్య. మామయ్య అచ్చుపుస్తకాలన్నిటిమీద తెలుపు కనబడిన చోటల్లా 'రవి'. 'రవి' అని సిరా రాసి రబ్బరు ముద్రలు కొట్టుకున్నాడు. మామయ్య పేర్లకంటే తనపేర్లే ఎక్కువ అచ్చుగుద్దుకొని అతడు పొంగిపోయాడు.

పాణి మామయ్య కీ విషయం ఏమీ తెలీదు. అతడు పేరు రావడం ఎలాగా అన్న ఆలోచనతోనే కూర్చుంటు న్నాడు దినమంతా. ఒక నాటకంగాని, సినిమా సంభాషణ గాని రాసి, పెద్ద పెద్ద కంపెనీల వారికిచ్చి పేరు తెచ్చు కోవాలని యోచిస్తున్నాడు.

నాటకం రాసి నాటకాల కంపెనీలచుట్టూ తిరిగాడు. లాభం లేకపోయింది. సినిమా సంభాషణ (స్క్రిప్టు) రాసి, ఫిల్ము కంపెనీలచుట్టూ తిరిగాడు. లాభం లేకపోయింది. ఈ తిరగడానికి అతనికెంతో శ్రమ, డబ్బు వ్యయ మయింది.

చివరకు పాణి మామయ్యకు తలనొప్పి పట్టుకుంది. ఎవరు మాట్లాడించినా తలనొప్పిగా వుండేది. 'కాఫీ కావాలా' అన్నా, 'భోజనానికి లెమ్మ'న్నా తలనొప్పి ఎక్కువయ్యేది.

ఇలాంటి సమయంలో రవిబాబు నాలుగు పుస్తకాలు చేత్తోపట్టుకొని, చరచర వచ్చి, "మామయ్యా! ఇలా చూడు నా పేరుకూడా బోలెడు పుస్తకాలమీద పడింది." అని తాను రబ్బరు ముక్కతో అచ్చు గుద్దుకున్న పేర్ల ముద్రలు చూపించాడు.

పాణి మామయ్యకు తన పుస్తకాలన్నీ అలా ఖరాబై పోవడం చూడగానే ఎక్కడలేని ఉక్రోషం వచ్చింది. "వెధవా! నా పేరంతా పాడుచేశావురా?" అని వూచి పుచ్చుకుని రవిని, దవడ వాచేలా ఒక లెంపకాయ గట్టిగా కొట్టాడు.

ఆదెబ్బతో రవి గింగురెత్తి ఏడుస్తూ వెళ్ళిపోయాడు. పాపం: రవి తన పేరు-సర్దా ఆలోచించుకున్నాడుగాని, పాణి మామయ్య పేరు పాడుచేద్దా మనుకోలేదు.

ఏమైతేనేం—రవిబాబు దవడ వాచింది.

పాణి మామయ్యకు కొంచెం ఉపశమనం కలిగింది.

గేయనాటిక :

కలికాలపు మోడల్ వివాహం

శ్రీమతి మండలీక సుభద్రాదేవి

పాత్రలు

మోహనరావు : వరుడు	...	లలిత : వధువు
భైరవశాస్త్రి : పెళ్ళిళ్ళ పేరయ్య	...	వెంకట్రామయ్య : కన్యాదాత
రమణయ్య : వరుని తండ్రి	...	కాంతమ్మ : వధువుతల్లి

(వీధి గుమ్మం ఎదురుగా కిటికీ. కిటికీ పక్కన టేబుల్. లైటు వెలుగులో పుస్తకాలు చదువుకుంటూ లలిత)

లలిత : (తనలో) జీవితమంతా యింతేనా
కాలంకర్మంకూడిరాని
నా గతి ఇదేనా ఆహాహా
ఏమిటేమిటీ పుస్తకంలో లవ్‌సీన్
ఓహోహో ఏమేమి మాధుర్యం ?

కాంతమ్మ : వడ్డన అంతా పూర్తిచేసి
పిలిచి పిలిచి నా నోరు పడిపోయినా
అడ్డ దిడ్డంగా ఏమిటి నీ చదువు ?
అసలు రోజు రోజుకీ మారుతూంది నీగతి
ఇలాగైతే ఏమికాను మా సంగతి ?

లలిత : అమ్మా అమ్మా చక్కని
అందమైన అపురూపమైన
ప్లాట్ ! నీ వెన్నడూ ఎరుగుండనిదీ
రచయిత భావప్రదర్శన
అయితే అయిందిలే ఆలస్యం
చదువా లిలాంటి దవశ్యం
రాదు రాదిటువంటి అవకాశం
[illegible]

కాంతమ్మ : క్షంతవ్యం కాని క్షమించరాని
నాక్షమ జీర్ణించి ప్రక్కాలయ్యే
తప్పులు నాకను కప్పుదమని చేసేవ్ !
ఏమిటేమిటి నీ రాతలు
ఇన్నాళ్ళనుంచి ప్రేమలేఖలు
చెప్పేస్తా మీ నాన్నగారితో
కట్టిపెట్టు నీ భాగోతం

లలిత : అమ్మా అమ్మా లేదు నా తప్పు
ఇందెందులేదు నాకెందు బాధ్యత
నీవన్నది కాదది నే వ్రాసిన కాగితం
చెప్పేస్తా, నిజం వప్పేసుకుంటా
పక్కింటి అబ్బాయి నన్నంటి వెంటాడి
విసిగి విసిగివేసారి రాక సమాధానం
వ్రాసేదు నాకో లేఖ....
ఆలోచించి ఆలోచించి, అవలోకించి,
తిలకించి, ఇంపొలకించి
సొంపుమీరగా వ్రాసేడు
అమ్మా ! అమ్మా ! ఊరుకో !
ఎందుకు ఎదలో నీకీ బెదద
ఏమిటిలే నీకా బెంగ ?
నా కతనిపై ప్రేమనాస్తి
అందుకే చేసా తగినశాస్తి.

(భైరవ శాస్త్రి ప్రవేశం.... పెళ్లికుమారుల లిస్టు తిరగ వేస్తూ...)

శాస్త్రి : ఓహోహో అమ్మ! అమ్మ!
అంతా క్షేమమా! కుశలమా!
సంగతులు సవిస్తరముగ
సత్వరమే సెలవియ్యండి
వీనికి వానికి వియ్యం
కలపటమే మనకార్యం
ఏదో ఇటు అటు కనుకప్పులు
అందుకే అటు ఇటు నాల్గు డబ్బులు
వచ్చె నిదె పెళ్ళిళ్ళకాలం
పిల్లల తల్లులపోరు
కనుకనే ఈ శాస్త్రి జోరు!

కాంతమ్మ : పెళ్ళి జరుగటం ఒకమాయ
ఉండాలి మాపై మీకుదయ
చంద్రబింబంవంటి ముఖం
చారెడుకళ్ళు చాయపప్పులా
పచ్చనిమేనూ చక్కనిసౌష్ఠవం
లలితగతి గలది లలిత
మా పిల్ల బలే నాణ్యం
కట్టుకోండి పెళ్ళి చేయించి పుణ్యం
శాస్త్రిగారూ! వేదవేదాంగ
పండితోత్తములుగారూ! వినరండి
ఇమ్మహిలో మీ మహిమ కనుపరచండి
సత్తుపైనా మారనిపైనా
ఎన్ని ఎన్ని ఎన్నెన్ని రూపాయలు
మీ హస్తంతో మార్చారో
తెలుసు, తెలుసు మాకు తెలుసు.
పదహారణాల నిండుతులం
వెండిరూపాయని మార్చి
మాపై దయ నుంచండి
మీకు మా తోచిన బహుమతీ....

(సంచిలోనుండి శాస్త్రిగారు లిస్టుతీసి... పొడుము బలంగా పీల్చి...)

శాస్త్రి : ఎంత ఎంతమాట
వేరే చెప్పాల ఆమాట
ఆలకించండి అమ్మ
ఈ సంబంధాల బంధంపై
మీ అభిరుచి ఎట్టిది?
వేపాకులవారూ పేలాలవారూ
ఒంటిమామిడివారూ, చింతకాయలవారూ
చింతకాయల వారుమాత్రం
రమణయ్య గారని ప్రశస్థం
పిల్లవాడు అతిరమ్యం
వారి ఆస్థి ఆగమ్యం
వారితో మీరు వియ్యం
కాకపోవటం మీ అభాగ్యం.

కాంతమ్మ : సిద్ధాంతిగారూ, వేదాంతిగారూ
ఆ సంబంధానికి మా సమ్మతి
ఇచ్చేస్తున్నా మా అనుమతి
యోగించేలా లాభించేలా
మనయత్నం ఫలించేలా
తప్పక ప్రయత్నించండి.

శాస్త్రి : ఇంకా మీకేమన్నా వెర్రా?
హేఁ మనం తల్చుకుంటే...!
వియ్యం తెచ్చిన కయ్యంతెచ్చిన
మనమే కడు సమర్థులం
వారం గిర్రునతిరుగకమునుపే
వచ్చేశనివారం కోడికూయకముందే
సంబంధం రైట్ చేసిరానూ....?

(వారం రోజుల అనంతరం... పెళ్లి చూపులు...)

రమ : పాటా ఆటా ఏమన్నా
నృత్యం నాట్యం అసలైనా
వంటా వడ్డనలో ఏమైనా
అనుభవం ఉందాండి బావగారూ!

వెంక : ఓహోహో ఆ కళలన్నిటిలో
మా అమ్మాయి తప్పదు ఫస్టు
ఆమె తరువాతనే ఎవరైనా 'నెక్స్టు'
ఇందెందులేదు సందేహం.

రమ : కట్నం కానుకలు కాసులు పూసలు
లాంఛనాలు తదితర వాంఛలు
వినోదాలు వింతలు
వేడుకలు కానుకలు
ముద్దు ముచ్చట్లు
ఏమేమో సెలవిస్తారా?

వెంక : కట్నమైనా కానుకైనా
ఇదయినా అదయినా —

నాలుగువేల రూపాయలు.... (నిట్టూర్చి)
మీకదే కట్నమైనా కష్టమైనా
సామాన్యుడను కరుణించండి
సౌమ్యులు మీరు కనికరించండి.

రమ : రావోయ్ పోదాంశాస్త్రి
నీవే ఈపెళ్ళికి మేస్త్రీ
అనువైన సంబంధం
కాని మన ఇంటలేదిట్టి కట్నం.
(పెళ్లివారి నిష్క్రమణ)

వెంకట్రామయ్య :
(లేఖలో) బావగారూ ! మీరన్నమాట ఖాయం
ముహూర్తం చూడండివేగం
త్వరలో చెప్పండి సమాధానం
వలదీవిషయంలో ఆలస్యం.
(రమణయ్య ఇంటివద్ద - కొడుకుతో)

రమ : ఈడు వచ్చిందబ్బాయీ !
జోడుకుదిరే అమ్మాయి
ఒకచో వెదికితెచ్చాం
కట్నం కానుక హెచ్చించాం
మళ్ళీ బుధవారమే వివాహం

మోహన : ఎవరినడిగి సంబంధం కుదిర్చావ్
తెగతెంపు త్వరలో ఆ బంధం
నా ఇచ్ఛవచ్చిన మనసిచ్చిన
పిల్లనే ఆడెద వివాహం !

శాస్త్రి : వంశం, ప్రతిష్ట గౌరవం
దృష్టిలో మామాట కంగీకరించు
సృష్టిలో లేదట్టి రమ్యమైన
"...... ....లలన"

మోహన : ప్రణయమా ప్రళయమా
మీరూహించేది నాకు
మీ ఆశలు అడియాసలు
చేసేస్తా...మీ ఆశల
తోరణాలు తెంపేస్తా
నా భవిష్యజ్జీవిత నాశనం
బహుశః మీ ఉజ్వల ఆశయం.

రమ : కాదంటే కాళ్ళుచేతులు
కట్టి చేసేస్తాపెళ్ళి
కాదనటానికి నీ ఇష్టం
నా గౌరవానికెంతో భంగం
తత్ క్షణమే వ్రాస్తున్నా లేఖ
పెళ్ళిసంభారం సమకూర్చేలా !

లలిత : (లేఖ చదువుతో)
ఆనందమానందం
అపరిమిత అమందానందం
హాయి ! హాయి జీవితం
జగమున క్షణమొకయుగం
గడవట మొక గగనం.


(బుధవారం ...పెళ్లి సమయం...వరుడు మాయం... లలిత వీధిలోకి శూన్యదృక్కులతో చూచును...శబ్ద తరంగాల నుండి స్పష్టంగా...పందిట్లో పెళ్ళాగుతున్నాదీ... దీనంగా (శాప్యంగా సన్నగా పాట...ప్రకృతి కన్నీరు కార్చింది సానుభూతిగా...)

(కొడుకు లేడని విని....)

రమ : రానీ ఏమైనా కానీ
నా ప్రాణమైన అమాంతం పోసీ
నమిలి తినేస్తా వాడిని
వంశంపరువు పెట్టెనయ్యో
నట్టనడి వీధిలో.......

వెంక : అడుగడుగున తడబడుతూ
మీరు చెప్పిన రూల్సుకి ఒడబడుతూ
డబ్బు దొరకక బడలికచే
కడు ప్రయాసతో ప్రయత్నించా
ఇన్ని యేళ్ళు గడచిన మీకైనా
ఉండాలి జ్ఞానం బావగారూ !

శాస్త్రి : పీటలమీద ఎన్నెన్ని
పెళ్ళిళ్ళు జరుగకసాంతం
ఆగిపోవును అమాంతం ?
కలవరపడకండి మీరంతా
అగు నీ వివాహం సుఖాంతం
ఇది కలికాలపు మోడల్ వివాహం.



"పరదేశి"

[సోవియట్ భారత సంయుక్త నిర్మాణ చిత్రం]

యస్. టి. సుదర్శనాచార్య

[భారత సోవియట్ దేశాల మైత్రిని పెంపొందించే మహత్తర చిత్రం. "పరదేశి" భారత స్వాతంత్ర్య 15–8–57 న భారతదేశంలో విడుదల కానున్నది. ఈ చిత్రాన్ని భారత సోవియట్ దేశాల చిత్రపరిశ్రమలు సంయుక్తంగా నిర్మించారు. రాజకీయ, సాంఘిక సంబంధాలు కలిగిన యీ చిత్ర ప్రథమ ప్రదర్శనం ఢిల్లీలోజరుగుతుంది. భారతదేశప్రధానమంత్రి యీప్రదర్శనానికి హాజరవుతారు. బ్రహ్మాండమైన యీ చిత్రం తాలూకు వివరాలు కొన్ని యీ వ్యాసంలో పొందుపరచడమైనది]

సోవియట్ యాత్రికుడు అఫనాసీ నికిటిన్ జీవితాన్ని ఆధారంగా తీసుకొని భారత, సోవియట్ చిత్ర పరిశ్రమలు ప్రప్రథమంగా సంయుక్తంగా నిర్మించిన "పరదేశి" చిత్రం ఆగస్టు 15 స్వాతంత్ర్య దినంనాడు భారతదేశంలో విడుదల అవుతుంది. న్యూఢిల్లీలో యీ చిత్ర ప్రపథమ ప్రదర్శనానికి ప్రధానమంత్రి శ్రీ నెహ్రూ హాజరవుతారు. పై విషయాన్ని భారతదర్శకనిర్మాత కె. ఎ. అబ్బాస్ తెలియజేస్తూ యీచిత్రంలోని ఆఖరి దృశ్యాన్ని భారత భూభాగంపైన మార్చి 7 వ తేదీని చిత్రీకరించారనీ నికిటిన్ భారతదేశం వదలివెళ్ళిపోయే యీసన్ని వేశాన్ని బొంబాయి హార్బరులో ఆనాడు చిత్రీకరించారనీ తెలియజేశారు అబ్బాస్.

అసలు యీ సంయుక్త చిత్ర నిర్మాణం యెలా తటస్థించినదీ ఆయన వివరిస్తూ చిత్ర నిర్మాణంలో సోవియట్, భారత దేశాలు రెండూ సమానమైన భాగస్వాములుగా వున్నాయన్నారు. "మొదట సంయుక్తనిర్మాణ ప్రయత్నాలకూ దీనికీ చాలా తేడావుంది. ఇటువంటి సమానత్వం వాటిలోకనపడదు. భారతదేశంలో యీచిత్రం తాలూకు షూటింగు 91 రోజులు జరిగంది. దీనిలో 45 దినాలు బొంబాయి, మద్రాసు మహాబలిపురం, ఎల్లోరా, ఢిల్లీలలో షూటింగు జరిగింది. ఈ వివిధ ప్రాంతాలలోనూ మాకు కావలసిన సదుపాయాలు చేసిన వివిధ ప్రభుత్వ మంత్రులకూ మా అభివందనలు అర్పిస్తున్నాము. దేశంలోని కొన్ని

లను చిత్రీకరించే సందర్భంలో సోవియట్ వారు దేవాలయంలోకి రావడానికి అనుమతించిన దేవాలయ అధికార్లను కూడా మేమెంతో అభి నందిస్తున్నాము'' అన్నారు అబ్బాస్.

డైరెక్టరు వి. ఐ. ప్రోనిన్, నికిటిన్ పాత్ర ధారి ఒలెగ్ స్ట్రిఝెనోవ్ లతో సహా సోవి యట్ బృందంలోని ప్రఖ్యాత సభ్యులు భారత దేశంలో జరిగిన పని గురించి వారి వారి అభి ప్రాయాలను వెల్లడి చేశారు.

వి. ఐ. ప్రోనిన్ యిలా అన్నారు "భారత దేశంలో వుండి మేమెంతో తెలుసుకున్నాము. భారత ప్రజలతోనూ, ముఖ్యంగా సినిమాకారు లతోనూ మాకు దగ్గిర సంబంధం కలిగింది. ఇది మాకొక అపూర్వ అనుభవం. మీ దేశాన్ని చూడటానికి మాకు అవకాశం లభించింది. చిత్ర పరిశ్రమలో వివిధ దేశాలలోని నిపుణుల పరి చయ భాగ్యం మాకు లభించింది. అంతే కాదు మాతో యెంతో స్నేహభావంగా వున్న పల్లె ప్రజలతో మాకు సంబంధం యేర్పడింది. పేద రైతు మొదలుకొని మీ ప్రధానమంత్రి శ్రీ నెహ్రూ వరకూ మా యందెంతో దయతో మెలిగారు. శ్రీ నెహ్రూకు కాలమెంతో విలు వైనది. అయినప్పటికీ వారు రెండు పర్యాయ ములు మాతో ముచ్చటించారు. మా పనిని చూచి ఆయనెంతో సంతోషాన్ని ప్రకటిస్తూ యీ చిత్రం యెప్పుడు చూస్తానా అని ఆతృత పడుతున్నట్లు చెప్పారు. ఇంతకూ మే మిక్కడ చేసినపని భారత, సోవియట్ దేశ ప్రజలకు ఉత్సాహాన్ని, వినోదాన్ని చేకూర్చగలదు. ఈ విధానం విజయవంతం కాగలదని మాకుముందు నుంచీ తెలుసు. ఈ చిత్ర నిర్మాణంలో కళా పోషణ విషయంలో మేము వివిధ విధానాలను అవలంబించాము. రెండు దేశాల తాలూకు సినిమాకారులు యీ చిత్ర నిర్మాణంలో కలిసి

మేమిక్కడ నాలుగు మాసాలనుండి వున్నా ము. ఈ స్వల్పవ్యవధిలో చిత్రం తాలూకు 60% పని పూర్తిచేశాము, పెద్ద తెరకు, మామూలు తెరకూ కూడా వుపయోగ పడేట్లు యీ చిత్రాన్ని నిర్మించడంలో మే మెంతకష్టపడ్డామో చెప్పనక్కర్లేదు. ఈ చిత్రం హిందీ, రష్యా ఆంగ్ల భాషలలో నిర్మింప బడింది. నిజంగా యీ చిత్రాన్ని మేము నిర్మించామని చెప్పు కోడాని కెంతో ఆనందంగా వుంది. మీ కళా కారులకు నా జోహారు లర్పిస్తున్నాను. పృథ్వీ రాజ్ కపూర్, నర్గీస్, బల్ రాజ్ సహాని, జైరాజ్ డేవిడ్, పద్మిని, మన్ మోహనకృష్ణ, అచలాసచ్ దేవ్ లు అంతా ప్రముఖ కళాకారులని మా అభిప్రాయం. ఈ చిత్ర నిర్మాణంలో వారు చూపగలిగినంత వరకూ కళాకౌశలాన్ని ప్రద ర్శించారు. ముఖ్యంగా శ్రీ అబ్బాస్ యీ చిత్ర నిర్మాణంలో మనస్ఫూర్తిగా అనన్యమైన సేవ చేశారు. అసలీ సంయుక్త నిర్మాణానికి పునాది వేసినది వీరే.

ఈచిత్రంద్వారా సోవియట్, భారత దేశాల ప్రజలమధ్య సంబంధబాంధవ్యాలు పెరిగి, రెండు దేశాలమైత్రీ పెంపొందగలదని ఆశిస్తున్నాను. అలా మా ఆశ నిజమైననాడు మా శ్రమకు తగిన ఫలితం లభించినట్లు మేము సంతోష పడ తాము."

"స్టాలింగ్రాడ్ బెర్గ్" "ఒథెల్లో" చిత్రాలకు ఛాయాగ్రహణం నిర్వహించి కేనిస్ చిత్ర ప్రద ర్శనోత్సవంలో బహుమతులు బడసిన ప్రఖ్యాత సోవియట్ ఛాయాగ్రాహకుడు ఇ. ఆంద్రికానిస్ మాట్లాడుతూ ఈ చిత్రనిర్మాణంలో ఆయన పని చేయడానికెంతో ఆనందించానన్నారు! ప్రదే శము వెలుతురు యేర్పాట్లు మున్నగు వాటిలో చిత్రకారు డెటువంటి సమస్యల నెదుర్కోవలసి వుంటుందో ఛాయాగ్రాహకుడు వాటిని యెదు ర్కోవాలి. అంతేకాదు ఛాయాగ్రాహక

ఎక్కువ భయపడతాడు. ఎందుకంటారా? అతని పనిని కోట్లకొలది ప్రజలు చూస్తారు. చిత్రం యొక్క జయాపజయాలు అతని పనిమీదనే ఆధారపడి వుంటాయి. ఈ చిత్రంలో భారత దేశంలోగల అత్యుత్తమ సుందర ప్రదేశాలను, బ్రహ్మాండమైన శిల్పాలు, కట్టడాలు చిత్రించి భారత దేశఔన్నత్యాన్ని, భారత ప్రజల విశిష్టతనూ గొప్పగా రూపొందించాను. ఈ చిత్రం చూశి ప్రపంచ ప్రజలు భారత దేశాన్ని మరింత యెక్కువగా ప్రేమిస్తారని నానమ్మకం. ఛాయాగ్రాహకుడు రామచంద్ర, నేనూ కలిసి యీ చిత్రానికి ఛాయాగ్రహణం నిర్వహించాం. ఇంతకూ చిత్రంలో యేభాగం నేను చేశానో, యే భాగం ఆయన చేశారో యెత్తిచెప్పటం కష్టం. అంటే మేమిద్దరం అంత కలిసికట్టుగా పనిచేశామన్నమాట." అన్నారు ఆంద్రికానిస్.

లైటింగ్ శాఖలో విధివిరామం లేకుండా పనిచేసిన భారత కార్మికుల పేర్లు వివరిస్తూ వారి యొక్క స్నేహానికీ సహకారానికీ వందనాలర్పిస్తున్నానన్నారు. బొంబాయి, మద్రాసులలోని స్టుడియోలన్నీ దర్శించి వాటిలో ఛాయాగ్రహ శాఖలో పనిచేసే వారందరినీ కలుసుకొని పరిచయం చేసుకున్నాననీ యీ చిత్రంలో కళాదర్శకత్వం నిర్వహించిన యం. ఆర్. అచరేకర్ కళాకౌశలానికి తాను ముగ్ధుడై పోయాననీ అన్నారు.

కథానాయకుడు పాత్ర నిర్వహించిన ఒలెగ్ స్ట్రిఝెనోవ్ యిలా అన్నారు. "రష్యాలోని వివిధ స్టుడియోలలోను నాకు అయిదు ప్రముఖ పాత్రలనిచ్చారు. కానీ అఫనాసీ నికిటిన్ పాత్ర నాకిస్తాననడంతోనే నేను వెంటనే దానికి అంగీకరించాను. అఫనాసీ సత్ప్రవర్తన గలిగిన ఒక సోవియట్ పౌరుడు. ఆయన నివసించే పట్టణంలో ఆయనే యెక్కువ చదువుకున్న వాడు. మంచి మేధావి. తనలోక జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోనేందుకు 500 సంవత్సరాలక్రితం గొప్ప దేశాన్ని సందర్శించాడు. భారత దేశంలో దయాస్వరూపులైన ప్రజలతో ఆయనకు సంబంధం యేర్పడింది. కొందరితో స్నేహం చేశాడు. ఆయన జ్ఞాపకాల నన్నింటినీ రష్యా తీసుకు వచ్చారు. అఫనాసీ అంటే మాకెంతో ప్రీతి. అతడు ప్రజానాయకుడు. ఈ చిత్రం ద్వారా భారత ప్రజలు అఫనాసీని గురించి దెలుసుకొంటారు. అంతే కాదు సోవియట్ దేశంగురించీ, ప్రజలగురించీ కూడా వివరంగా తెలుసుకోగలరు. అలాగే సోవియట్ ప్రజలు యీ చిత్రం ద్వారా భారత దేశం, భారత ప్రజలనూ తెలుసుకో గలరు. ఇవన్నీ నాకెంతో మంచివిగా కనుపించడం చేతనే నేనీపాత్ర నిర్వహించడానికి అంగీకరించాను. నాతో కలిసి నటించిన భారత కళాకారులంతా నాయందెంతో అనురాగాన్ని ప్రదర్శించారు. వారి కళలో మా హృదయాలకు దగ్గరగావుండే సత్యాన్ని నేను దర్శించగలిగాను. వారు నిర్వహించే పాత్రలలో లీనమై పోతారు. వారినటనలో అసహజత్వ మేకోశాన కనపడదు. "భారతమాత" చిత్రంలో నర్గీస్ నటన చూచి నేను ఆశ్చర్యపడ్డాను. ఈ చిత్రం తాలూకుకొన్ని రషెస్ చూచే భాగ్యంనాకు కలిగింది. రష్యాలో మేము ఆమె చిత్రాలను చూశాము. ఆమె చక్కని కథానాయికగా మాకు తెలుసు. కానీ "భారతమాత" చిత్రంలో నర్గీస్ యువతివేషం, వృద్ధురాలి వేషంకూడా యెంతో నైపుణ్యంతో నిర్వహించింది. బల్‌రాజ్‌సహానీకూడా నిశ్శబ్ద నటుడని చెప్పవచ్చును. మీలో ప్రముఖుడైన పృథ్వీరాజ్‌కపూర్‌తో నటించడానికి నాకు భయంవేసింది. కానీ ఆయన నన్నెంతో ఆదరంగాచూశారు. దానితో నాభయంవదిలింది." అన్నారు ఒలెగ్. ఆయన కలిసిపనిచేసిన భారత తారలపేర్లన్నీ చెబుతూ రష్యావెళ్ళగానే యింత

కంటె వివరంగా వారినిగురించి యింకావివరంగా వ్రాస్తానని అన్నారు ఒలెగ్ స్ట్రిఝెనోవ్.

చిత్రనిర్మాణ భారం వహిస్తున్న గార్లా మోత్ మాట్లాడుతూ నయాసంసార్ అంతర్జాతీయ బృందంవారికి తమ కృతజ్ఞత తెలియజేశారు. భారత సోవియట్ దేశ ప్రజల మైత్రిని దినదినాభి వృద్ధిగాంచ గలదని ఆశిస్తున్నానన్నారు.

ఒకరి ప్రశ్నకు సమాధానం చెబుతూ దర్శకుడు ప్రోనిన్ యిలా అన్నారు. "500 సంవత్సరాల క్రితం భారతదేశం యే విధంగా వుండేదో అలాగే చూపడానికి సర్వప్రయత్నాలుచేశాం. నికిటిన్ భారతదేశం సందర్శించినప్పుడు భారతదేశంలో భారతీయుని జీవితం, ఆచారాలు యేవిధంగా వున్నాయో తెలుసుకునేందుకు నేనూ, అబ్బాస్, యితర మిత్రులు ఒక సంవత్సరం పాటుబడ్డాం. మాకు ఆ వివరాలను తెలిపిన వారంతా కూడా యదార్థాలనే తెలియచేశారు. అవే మే మీ చిత్రంలో మీకుచూపబోతున్నవి."

చిత్ర సమీక్ష

సారథీ వారి పెద్దరికాలు

సారథీవారి "పెద్దరికాలు" తెలుగు చిత్రం 25 తేదీని ఆంధ్ర ప్రదేశ్‌లో విడుదలైంది. చక్కని సందేశాలను అందివ్వడంలో సారథీవారు మంచిపేరు పడ్డారు. ఈ చిత్రంలో పెద్దలు తెచ్చిపెట్టే ప్రమాదాలను అతిసహజముగా చిత్రీకరించారు. పండంటి కాపురాలను పాడు చేయడం, తిరిగివాటిని కొందరు పునరుద్ధరింప చేయటం సర్వసాధారణంగా కొన్ని కుటుంబాలలో జరుగుచున్నవే. కథ చిన్నదైనా దర్శకుడు శ్రీ చాణక్యగారు ఈ కథను రసవంతంగా తీసి ప్రేక్షకుల హృదయాలను రంజింపజేశారు.

శ్రీయుతులు చాణక్య, కొండేపూడి, నార్లచిరంజీవి, మున్నగువారు వ్రాసిన ఈ కథ రసవంతముగా వుంది. శ్రీనార్ల చిరంజీవి సంభాషణలు. శ్రీయుతులు తాపీ, కొసరాజుగార్ల పాటలు చిత్రానికిజీవం పోశాయి. "పదవమ్మా మాయమ్మా నీనోము ఫలించె, పతిమాట పాలించుమా" అనేపాట, జోలపాట ఈ రెండు శ్రీమతి బాల సరస్వతి వీనుల విందుగా పాడింది. శ్రీకమల్ ఘోష్ ఛాయాగ్రహణం ప్రసంశనీయంగా వుంది. శబ్దగ్రహణం కూడా బాగుంది. శ్రీ తాపి చాణక్యగారి ప్రతిభ చిత్రంలో ప్రతిఅడుగున తోడ్పడింది. ఈ చిత్రము ప్రజల ఆదరాభిమానాలనుచూరగొంటుం దనడములో సందేహములేదు.

అంజలీపిక్చర్స్ వారి సువర్ణసుందరి

అంజలీ పిక్చర్సువారి సువర్ణ సుందరి చిత్రం ప్రివ్యూ ప్రదర్శనం 25–5–57 వ తేదీ ఉదయం పేరగన్‌టాకీస్‌లో జరిగింది.

చిత్రానికి వేదాంతం రాఘవయ్యగారు దర్శకత్వం వహించారు. హఠాత్సంఘటనలూ, విచిత్ర సన్నివేశాలూ లేకపోయినా చిత్రం సాఫీగా నడిచిపోయింది. సామాన్య ప్రజలకు ఆకర్షణీయమైనహంగులన్నీ ఇందులోఉన్నాయి. నృత్యాలూ, ట్రిక్కులూ, పాములూ పెద్దపులులూ మొదలైన వానితోనూ రేలంగి ప్రభృతులతోనూ కలిపి చిత్రం వినోదంగా తయారు చేశారు.

నృత్యాలు మాత్రం చిత్రానికి వన్నె తెస్తున్నాయి. ఫోటోగ్రాఫీ శోభ తెచ్చింది. ఆర్టిస్టులు చెప్పుకోతగిన నటనా సామర్థ్యాన్ని చూపించినట్టు కనపడదు. అందుకు తగిన అవకాశం ఇచ్చేసన్నివేశాలూలేవు. అయితే అంజలీదేవి మాత్రం చాలా సహజంగా, ఉచితంగా నటించి ఉత్తమనటి అనే పేరు నిలబెట్టుకుంది.

రేలంగి, తనసహచరులూ వీరిలో కొత్త ఏమీ కనపడలేదు. తక్కిన వారిలో పాటలు సంభాషణలు చక్కగా సాగాయి. మనస్సును పట్టుకునేటట్టు లేకపోయినా బాగానే ఉన్నాయి. గ్రూపుడాన్సుల తాలూకు పాటల సంగీతం టకటక నడిచింది, మొత్తం మీదచిత్రం జనబాహుళ్యానికి వినోదంకల్పించి విజయవంతంఅవుతుందని ఆశించవచ్చు.

"సుభాషిణి"